Follow: @ANNTELUGU

23-11-2024

ANN తెలుగు

# మహా పత్రిక

శనివారం, హైదరాబాద్   సంపుటి- 23   సంచిక- 310   పేజీలు-08   వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI   REGISTERED NUMBER: APTEL/2003/9316   WWW.EPAPER.MAHAADAILY.COM




## ఉద్యోగ నియామకాల్లో రికార్డు

తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగ నియామకాల్లో గత రికార్డులు తిరగరాసింది. మాట నిలుపుకుంది. తెలంగాణ వచ్చిన తర్వాత ఒకే ఏడాది ఈ స్థాయి నియామకాలు ఇదే ప్రథమం. ఏడాదిలో అరలక్షకు పైగా ఉద్యోగ నియామకపత్రాలు అందజేయడంతో పాటు నిరంతర పరీక్షలు జరపడం, నోటిఫికేషన్లు విడుదల చేస్తుండడం నియామకాల అంశంలో ప్రభుత్వ చిత్తశుద్ధికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టుదలకు నిదర్శనంగా చెప్పవచ్చు.

ప్రత్యేక కథనం ఎడిటోరియల్ 4లో

బాబు జోరు

### ఐదోసారి కూడా సీఎంగా వస్తా: సీఎం చంద్రబాబు

- మంచి పనులు చేస్తే ప్రజలు గెలిపిస్తారు
- పదోసారి కూడాఎమ్మెల్యేను అవుతానని ధీమా



02

తారుమారు

### గెలిచేది కాంగ్రెస్సే

- మహారాష్ట్ర, జార్ఖండ్ ఎగ్జిట్ పోల్స్ తప్పు
- కర్నాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్



02

ఖరారు

### కీర్తి సురేష్ పెళ్లి

- డిసెంబరు 11న వివాహం
- అధికారికంగా ప్రకటించిన ఆమె తండ్రి



08



### ఐకమత్యమే మన సభ్యత.. మన భవిష్యత్

ఐకమత్యమే మన సభ్యత.. మన భవిష్యత్.. అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. మొదట మనం మారాలి.. మన ఆలోచనలూ మారాలి.. అప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధిస్తామని అన్నారు. హైదరాబాద్ పర్యటనలో భాగంగా.. శుక్రవారం శిల్పకళావేదికలో లోక్ మంథన్‌ను గవర్నర్ ప్రారంభించారు.

వివరాలు 2లో



### కార్మికులతో సీఎం ముచ్చట

తెలంగాణ తల్లి విగ్రహ పనుల పరిశీలన

హైదరాబాద్, మహా: తెలంగాణ సచివాలయ ప్రాంగణంలో నాలుగు కోట్ల ప్రజల ప్రేమమూర్తి తెలంగాణ తల్లి... విగ్రహ ప్రతిష్ఠాపనకు శరవేగంగా జరుగుతోన్న పనులను శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి పరిశీలించారు. శ్రమ జీవులతో పనులు జరుగుతున్న తీరుపై ముచ్చటించారు.

### బంగారం ధరలు

| | |
|---|---|
| 24 క్యారెట్ | 78,820 |
| 22 క్యారెట్ | 72,250 |
| సిల్వర్ (కేజీ) | 92,000 |

### స్టాక్ మార్కెట్

| | |
|---|---|
| సెన్సెక్స్ ↗ | 79,117.11 |
| నిఫ్టీ ↗ | 23,907.25 |

### ఈరోజు చికెన్ ధరలు

1 కేజీ రిటైల్ ధర ₹

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 180 | 220 | 230 |

హోల్ సేల్ ధర ₹

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 160 | 200 | 210 |

### ఈరోజు గుడ్డు ధరలు

| | 1 పీస్ ₹ | ట్రే |
|---|---|---|
| ఎన్ఈసీసీ గుడ్డు ధర | 5.80 | 174 |
| హోల్ సేల్ గుడ్డు ధర | 5.80 | 174 |
| రిటైల్ గుడ్డు ధర | 6.15 | 187.08 |

# ఆకర్ష్ 2.0



## అన్నా.. మీ వెంటే

లైన్‌లో మరో ఆరుగురు.. హైకోర్టు తీర్పు నేపథ్యంలో మళ్లీ జంపింగ్‌లు షురూ

ఇప్పటికే సంప్రదింపులు పూర్తి.. సానుకూలంగా సీఎం రేవంత్

గ్రేటర్ నుండి నలుగురు.. జిల్లాల నుండి మరో ఇద్దరు..

ఈ వారంలోనే చేరే అవకాశం ఉందంటున్న నేతలు

విస్తరణకు ముందే చేరాలని పలువురు ఎమ్మెల్యేల ఉబలాటం.. బిఆర్ఎస్‌కు.. మరో షాక్ తప్పదా?



బిఆర్ఎస్ పార్టీకి మరో గండం పొంచి ఉంది. హైకోర్టు సంచలన తీర్పు నేపథ్యంలో.. మరికొంతమంది ఎమ్మెల్యేలు అధికార ఫలాలు అందుకునేందుకు, తమ నియోజకవర్గ ప్రజలకు అందించేందుకు చేయందుకోవాలని డిసైడ్ అయ్యారు. హైకోర్టు తీర్పు రాగానే.. కీలకనేతలతో టచ్ లోకి వెళ్ళిపోయారు. ఇప్పటికే పదిమంది ఎమ్మెల్యేలు కారు దిగి చేయందుకోగా, హైకోర్టు తీర్పుతమకే అనుకూలంగా వస్తుందంటూ ఎమ్మెల్యేలకు నచ్చజెప్పి మరింతమంది పార్టీ మారకుండా ఇంతకాలం బిఆర్ఎస్ అధినేత చేయగలిగారు. ఉప ఎన్నికలు ఖాయమంటూ నమ్మించి.. నియోజకవర్గాల్లో ప్రచారం ప్రారంభించమంటూ కొందరు నేతలను కూడా వలస నియోజకవర్గాల్లో ప్రోత్సహించారు. కానీ ఇపుడు సీన్ రివర్స్ కావడం, ఎప్పటికైనా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలే తప్ప.. స్పీకర్ విధుల్లోఇతరులు జోక్యం చేసుకోలేరని స్పష్టత రావడంతో ఎవరిదారి వారు చూసుకోవాలని నేతలు భావిస్తున్నారు. - మహా, హైదరాబాద్

వివరాలు 2లో

### జంపింగ్‌లు సేఫ్

బిఆర్ఎస్‌కు షాక్.. నిర్ణయం స్పీకర్ దే


ఎలాంటి గడువు పెట్టలేం

సరైన సమయంలో స్పీకర్ నిర్ణయం తీసుకోవొచ్చు

తేల్చి చెప్పిన హైకోర్టు ధర్మాసనం



02



### రైతుల పరిస్థితి అగమ్యగోచరం

## మద్దతు ధర.. ఒట్టిమాటే

ఆధిపత్యం కోసం ముగ్గురు మంత్రుల బిజీ.. రైతులకు మద్దతుధర చెల్లించాలి

ఖమ్మం పత్తి మార్కెట్ లో మాజీమంత్రి హరీష్ రావు

పువ్వాడ అజయ్, గంగుల, వద్దిరాజు రవిచంద్ర, తాతా మధుతో కలిసి పర్యటన

**ఖమ్మం,మహా :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని మాజీమంత్రి, బీఆర్ఎస్ కీలకనేత తన్నీరు హరీశ్ రావు అన్నారు. బోనస్ మాట బోగస్ అయింది.. మద్దతు ధర కూడా రావట్లేదని విమర్శించారు. ప్రభుత్వ అలసత్వంతో పత్తి రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ మంత్రులు పువ్వాడ అజయ్, గంగుల కమలాకర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుతో కలిసి ఖమ్మం పత్తి మార్కెట్‌ను సందర్శించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

మిగతా 2లో

## హరీష్ పర్యటన.. ఓ జోక్

నాగలి పట్టి దున్నిన ముఖాలా మీవి?

- రైతులకు బేడీలు వేసిన మీరా మాట్లాడేది?
- కార్తీకమాసంలో దుష్టశక్తుల అపశకునాలు
- నిద్రాహారాలు మాని.. రేవంత్ పనిచేస్తున్నారు
- సీఎం పనితీరు బేష్.. కొత్తగూడెంకు ఎయిర్ పోర్టు తెస్తున్నాం
- ఏనుగులు పోతుంటే.. కుక్కలు మొరగడం కామన్
- బీఆర్ఎస్ మాజీమంత్రుల పర్యటనపై భగ్గుమన్న ఎంపీ రేణుకాచౌదరి



వివరాలు 2లో



## దద్దరిల్లిన దండకారణ్యం...

ఛత్తీస్‌గడ్‌లో... భారీ ఎన్ కౌంటర్..

పదిమంది మావోయిస్టులు మృతి.. మృతుల్లో ముగ్గురు మహిళలు

ఆరుగురిని గుర్తించిన పోలీసులు

**ఛత్తీస్‌గఢ్,మహా :** ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్కౌంటర్ జరిగింది.సుక్మా జిల్లాలోని బెజ్జి అటవీప్రాంతంలో భద్రతా బలగాలకు,మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పులో పదిమంది మావోయిస్టులు మృతి చెందారు. దండకారణ్యంలో మావోయిస్టులు సమావేశ మయ్యారనే పక్కా సమాచారంతో కూంబింగ్ నిర్వహిస్తున్న క్రమంలో భద్రతా దళాలకు మావోయిస్టులకు మధ్య హోరాహోరీ ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయి.ఉదయం నుంచే జరిగిన కాల్పుల్లో పది మంది మావోయిస్టులు మృతి చెందినట్లుగా సమాచారం.

మిగతా 2లో

### అడవిలో నెత్తుటేరు

09

అదానీతో చేసుకున్న ఒప్పందాలు

## రద్దు చేయాలి

రేవంత్ సర్కార్‌కు కేటీఆర్ డిమాండ్

**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అదానీతో చేసుకున్న ఒప్పందాలన్నింటినీ రద్దు చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. అదానీ వ్యవహారంపై తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అదానీ సంస్థలతో రూ.12,400 కోట్లు ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు ఘనంగా చెప్పారు.

మిగతా 2లో



ఒప్పందాలు

## సమీక్షిస్తాం

రాహుల్ మాటే మా బాట: పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

- అదానీ విరాళం రేవంత్ రెడ్డికి ఇవ్వలే
- కేటీఆర్ విరాళమిచ్చినా స్వీకరిస్తాం
- అదాని అక్రమాలపై జేపీసీ వేయాలి
- మోడీ రాజీనామా చేయాల్సి వస్తుందనే వేయడం లేదు



వివరాలు 2లో

### ములుగు ఏజెన్సీలో మావోల ఘాతుకం..!

09



# ఆకర్ష్ 2.0

**హైదరాబాద్, మహా:** బిఆర్ఎస్ పార్టీకి మరో గండం పొంచి ఉంది. హైకోర్టు సంచలన తీర్పు నేపథ్యంలో.. మరికొంతమంది ఎమ్మెల్యేలు అధికార ఫలాలు అందుకునేందుకు, తమ నియోజకవర్గ ప్రజలకు అందించేందుకు చేయందుకోవాలని డిసైడ్ అయ్యారు. హైకోర్టు తీర్పు రాగానే.. కీలకనేతలతో టచ్ లోకి వెళ్ళిపోయారు. ఇప్పటికే పదిమంది ఎమ్మెల్యేలు కారు దిగి చేయందుకోగా, హైకోర్టు తీర్పుతమకే అనుకూలంగా వస్తుందంటూ ఎమ్మెల్యేలకు నచ్చజెప్పి మరింతమంది పార్టీ మారకుండా ఇంతకాలం బిఆర్ఎస్ అధినేత చేయగలిగారు. ఉప ఎన్నికలు ఖాయమంటూ నమ్మించి.. నియోజకవర్గాల్లో ప్రచారం ప్రారంభించమంటూ కొందరు నేతలను కూడా వలస నియోజకవర్గాల్లో ప్రోత్సహించారు. కానీ ఇపుడు సీన్ రివర్స్ కావడం, ఎప్పటికైనా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలే తప్ప.. స్పీకర్ విధుల్లోఇతరులు జోక్యం చేసుకోలేరని స్పష్టత రావడంతో ఎవరిదారి వారు చూసుకోవాలని నేతలు భావిస్తున్నారు. ఏడాదికాలంగా వెయిట్ చేసి నష్టపోయిన నేతలు ఇపుడు ఎంతమాత్రం టైం వేస్ట్ చేసుకోకూడదని భావిస్తున్నారు.

### గ్రేటర్ లో భారీ దెబ్బే?

గ్రేటర్ హైదరాబాద్ కు చెందిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ లోక్ సభ ఎన్నికలకు మందే కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోగా, తర్వాత శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, పటాన్ చెరు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. గ్రేటర్ హైదరాబాద్ కు చెందిన ఎల్బీనగర్, ఉప్పల్ , అంబర్ పేట ఎమ్మెల్యేలు పార్టీ మారవచ్చన్న ప్రచారం చాలా కాలంగా ఉంది. మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి సంగతి సరేసరి. గ్రేటర్ హైదరాబాద్ లో బిఆర్ఎస్ అత్యధిక స్థానాలు గెలుచుకోగా, బైపోల్ లో కంటోన్మెంట్ స్థానాన్ని కాంగ్రెస్ గెలుచుకుంది. బిఆర్ఎస్ నుండి నలుగురు కాంగ్రెస్ లోకి వచ్చారు. ఇపుడు మరో ఆరుగురు సిద్ధంగా ఉన్నారని, ప్రస్తుతానికి నలుగురికి మాత్రమేగ్రీన్ సిగ్నల్ లభించిందన్న చర్చ కాంగ్రెస్ వర్గాల్లో ఉంది. జిల్లాల నుండి మరో ఇద్దరు టచ్ లో ఉన్నారని, ఇందులో మాజీ సీఎం జిల్లా నుండి ఒకరు.. ఉమ్మడి ఆదిలాబాద్ నుండి ఒకరు ఉన్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ఈనెల 29న బిఆర్ఎస్ దీక్షా దివాస్ నిర్వహిస్తుండగా, ఈనెల 30న ఢిల్లీ కి వెళ్ళే యోచనలో కాంగ్రెస్ నేతలు ఉన్నారు. ఈ క్రమంలో ఒక్కొక్కరుగా చేరుతారా.. ఆరుగురు ఒకేసారి చేరుతారా? అన్నదానిపై చర్చ జరుగుతోంది.


## విస్తరణకు ముందే?

మంత్రివర్గ విస్తరణకు ముందే చేరాలని, వలస ఎమ్మెల్యేల్లో ఇద్దరికి బెర్త్ లు ఇవ్వాలని కొందరు నేతలు సంప్రదింపులు చేస్తున్నట్లు కాంగ్రెస్ సర్కిల్స్ లో వినబడుతోంది. ఇంకా డిప్యూటీ స్పీకర్ చీఫ్ విప్ వంటి పదవులు భర్తీ చేయకపోగా, వలస ఎమ్మెల్యేల్లో కొందరు డెవలప్ మెంట్ ను, మరికొందరు పదోన్నతిని ఆశిస్తున్నారు. డిసెంబర్ 7లోగా గులాబీపార్టీలో సంచలనాలు ఖాయమన్న చర్చమాత్రం సాగుతోంది. ఇప్పటికే పిసిసి చీఫ్ కూడా.. కేటీఆర్ చుట్టూ ఉండే ఇద్దరు ముగ్గురు తమతో టచ్ లో ఉన్నారంటూ ప్రకటించారు.

## ఐదోసారి కూడా ముఖ్యమంత్రిగా ..



**అమరావతి, మహా:** ఏపీ అసెంబ్లీలో విజన్ డాక్యుమెంట్ 2047పై పవర్ పాయింట్ ప్రజంటేషన్ సందర్భంగా సీఎం చంద్రబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను ఐదోసారి కూడా ముఖ్యమంత్రిని అవుతానని ధీమా వ్యక్తం చేశారు. మంచి పనులు చేస్తే ప్రజలు గెలిపిస్తారని, మళ్లీ మనమందరం గెలిచి విజన్ 5.0ను కూడా తీసుకువద్దామని చంద్రబాబు కూటమి ఎమ్మెల్యేలను ఉద్దేశించి పిలుపునిచ్చారు. గుజరాత్ లో గత 30 ఏళ్లుగా ఒకే పార్టీ ఉందని, అక్కడ బీజేపీనే గెలుస్తోందని తెలిపారు. హర్యానాలోనూ బీజేపీ మూడో పర్యాయం విజయం సాధించిందని అన్నారు.



## రైతుల పరిస్థితి అగమ్యగోచరం

(మొదటిపేజీ తరువాయి)

మార్కెట్ లో పత్తి ధరలు తగ్గించి కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం హరీశ్ రావు మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ సర్కార్ రైతులను నట్టేట ముంచిందన్నారు. వరంగల్ రైతు డిక్లరేషన్ లో ఇచ్చిన హామీలు అమలు చేయడంలేదని విమర్శించారు. పత్తికి రూ.500 బోనస్ ఇస్తామన్నారని, ఇప్పుడు బోనస్ ను బోగస్ గా చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని మండిపడ్డారు.సీసీఐ రైతుల దగ్గర పత్తి కొనడం లేదని, దళారుల వద్ద కొంటున్నదని చెప్పారు. రాష్ట్రంలో పత్తి రైతులకు మద్దతు ధర రావట్లేదని చెప్పారు. ఖమ్మం మార్కెట్ లో ఇప్పటి వరకు మద్దతు ధర రాలేదని చెప్పారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా మద్దతు ధరకు పత్తి కొనుగోలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు ఆధిపత్యం కోసం బాగా బిజీ అయ్యారని, రైతులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రతిపక్షాలను ఇబ్బంది పెట్టడం, కుట్రలు చేయడం తప్ప కాంగ్రెస్ చేసిందేమీ లేదన్నారు. ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయలేదని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, రాకేష్ రెడ్డి, బొమ్మెర రామ్మూర్తి, ఆర్జెసి క్రిష్ణ, చంద్రావతి తదితరులు పాల్గొన్నారు.

# జంపింగ్ లు సేఫ్

**హైదరాబాద్, మహా :** జంపింగ్ ఎమ్మెల్యేలకు తెలంగాణ హైకోర్టులో బిగ్ రిలీఫ్ లభించింది. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ పై తెలంగాణ హైకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా హైకోర్టు సంచలన తీర్పు వెల్లడించింది. బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని పిల్ దాఖలైంది. బీఆర్ఎస్ పార్టీపై గెలిచి కాంగ్రెస్ లోకి వెళ్లిన దానం నాగేందర్, తెల్లం వెంకట్రావ్, కడియం శ్రీహరిపై స్పీకర్ చర్యలు తీసుకునేలా అదేశాలు ఇవ్వాలని కోరుతూ బీఆర్ఎస్ నేతలు పిటిషన్ వేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై 4 వారాల్లోగా టైం ఫ్రేమ్ ఫిక్స్ చేయాలని అసెంబ్లీ స్పీకర్ గడ్డం వినోద్ కుమార్ కు సింగిల్ బెంచ్ ఆదేశించింది. సింగిల్ బెంచ్ ఆదేశాలను సవాలు చేస్తూ హైకోర్టు డివిజన్ బెంచ్ లో అసెంబ్లీ కార్యదర్శి అప్పీల్ చేశారు. అసెంబ్లీ కార్యదర్శి రిట్ అప్పీల్ పై హై కోర్టు శుక్రవారం తీర్పు ప్రకటించింది. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ పై హైకోర్టు కీలక తీర్పు వెల్లడించింది. స్పీకర్ తుది నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు డివిజన్ బెంచ్ స్పష్టం చేసింది. స్పీకర్ కు ఎలాంటి టైం బాండ్ లేదని హైకోర్టు తేల్చిచెప్పింది. రీజనబుల్ టైంలో స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ఆదేశించింది. సింగిల్ బెంచ్ తీర్పును హైకోర్టు కొట్టేవేసింది.

### సీజే ధర్మాసనం తీర్పులో కీలక అంశాలు

ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై 10వ షెడ్యూల్ ప్రకారం నిర్ణయం తీసుకోవాలని చెప్పింది. తగిన సమయంలో నిర్ణయం తీసుకోవాలని అసెంబ్లీ స్పీకర్ కు సీజే ధర్మాసనం సూచించింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులను సీజే ధర్మాసనం కొట్టివేసింది. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం, 10వ షెడ్యూల్, అసెంబ్లీ ఐదేళ్ల గడువును దృష్టిలో ఉంచుకుని స్పీకర్ తగిన నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ఆదేశించింది. ఈ సందర్భంగా సింగిల్ బెంచ్ ఉత్తర్వులను కొట్టివేసింది. బీఆర్ఎస్ పార్టీలో గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిన ఎమ్మెల్యేలపై స్పీకర్ అనర్హత వేటు ప్రకటించాలని కోరుతూ కూకట్ పల్లి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ గౌడ్, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పిటిషన్లు వేశారు. ఈ పిటిషన్ పై న్యాయస్థానం విచారణ చేసింది. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద్ గౌడ్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అనర్హతపై మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు తీర్పులున్నా పరిగణలోకి తీసుకోవడంలేదని. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు తెలిపారు. కాగా బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ లోకి వెళ్లిన ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ దాఖలైన పిటిషన్ పై హైకోర్టులో విచారణ జరిగింది. ఇపుడు దీనికి సంబంధించిన అప్పీల్ పై ధర్మాసనం స్పష్టత ఇచ్చింది. ఇది బిఆర్ఎస్ కు షాకే.



## గెలిచేది కాంగ్రెస్సే

**మహా:** మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భాగస్వామిగా ఉన్న కూటమిలే విజయం సాధిస్తాయని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అన్నారు. రెండు రాష్ట్రాల్లో బీజేపీ కూటమిలే విజయం సాధిస్తాయంటూ ఎగ్జిట్ పోల్స్ వేసిన అంచనాలు తప్పవుతాయని డీకే చెప్పారు.

# హరీష్ పర్యటన.. ఓ జోక్

**ఖమ్మం, మహా :** రైతులకు బేడీలు వేసి నానా హింసలు పెట్టిన బిఆర్ఎస్ నేతలు, మాజీమంత్రి హరీష్ ఖమ్మంలో పర్యటించడం పెద్ద జోక్ అని, నాగలిపట్టి దున్నిన ముఖాలా మీవి.. కమిషన్ కాకతీయ కమిషన్ భగీరథ బతుకులు అంటూ ఎంపీ రేణుకా చౌదరి తీవ్ర స్థాయిలో ఫైర్ అయ్యారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ నిన్నటి వరకు కుక్కిన పేనులా ఉన్న అజయ్ ఇపుడు మీసాలు తిప్పుతున్నాడని, రైతులకు భేడీలు వేసిన దుష్టశక్తులు ఇవ్వాళ మాట్లాడుతున్నారన్నారు. కార్తీక మాసం లో అపశకుణం మాటలు మాట్లాడుతున్నారని, గుట్టలు మాయం చేసిన మీరా మాట్లాడేది.. కొయిన్ని వెంకన్నను అడిగితే మీ పాపాలు బయట పడతాయంటూ భగ్గుమన్నారు. మీకు ప్రజల మీద సానుభూతి ఉంటే సలహాలు సూచనలు చేయండి.... స్వీకరిస్తామన్నారు. బిడ్డను జైల్ నుంచి విడిపించుకోవడానికి ఎన్ని ప్రయత్నాలు చేశారో దేశ ప్రజలకు తెలుసు. రాష్ట్రంలో ప్రజలు చాలా హ్యాపీగా ఉన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ పాలన భేషుగ్గా ఉంది. బి ఆర్ ఎస్ వాళ్లకు ఈర్ష్యా ద్వేషాలు పెరిగిపోయాయి. హరీష్ రావు పర్యటననే ఓ జోక్. నాగలి పట్టి దున్నిన మొహలా మీవి. మీ బ్రతుకులు కమిషన్ కాకతీయ,కమిషన్ భగీరథ అంటూ రేణుకాచౌదరి ధ్వజమెత్తారు. మీరు మంచి చేస్తే ఎందుకు ఓడిపోయారు. బేడీలు వేసిన చరిత్ర మీది కాదా? ప్రజలను నానా హింసలు పెట్టింది మీరు కాదా? ఓడిపోయి ఏమి చేయాలో తెలియక ఇలాంటి జోకులు చేస్తున్నారు. నిద్ర హారాలు మని రేవంత్ పని చేస్తున్నారు. మీకు ఆత్మగౌరవం ఉందా? మీకు రాష్ట్ర ప్రయోజనాల మీద కమిట్మెంట్ ఉందా? మీ రాజ్యసభ సభ్యులు ఏ స్కీం తెచ్చారు? పువ్వాడ అజయ్ కు ఏమీ కనబడవు? దమ్ముంటే నాతో రా....కలిసి నడుద్దాం అంటూ సవాల్ చేశారు. బి ఆర్ ఎస్ వాళ్ళు మోపిన భారాన్ని ఇపుడు అందరం కట్టాల్సిన పరిస్థితి నెల కొందని, నెల కాగానే జీతాలు ఇస్తున్నామన్నారు. నకిలీ విత్తనాలతో సుజాతనగర్ లో రైతులు ఇబ్బందులు పడితే రైతుకు 6500 ఇప్పించానని, నకిలీ విత్తనాలు అమ్మే వ్యాపారులను రాష్ట్ర బహిష్కరణ చేయాలన్నారు.

## కొత్తగూడెంకు కార్గో ప్లెయిన్

కొత్తగూడెం లో ఫ్రీ కండిషన్ ఎయిర్ పోర్ట్ రానుందని, కార్గో ప్లెయిన్ కూడా అడిగానని రేణుకాచౌదరి తెలిపారు. ఖమ్మం జిల్లాలో అడవి అనేది లేకుండా పోయిందని, వైరా లో రైతులకు పంటల పై అవగాహన కోసం హాస్టల్ కట్టించాలని అనుకున్నామన్నారు. ఖమ్మం ను మార్చిపోనే పోనని, తాను ఖమ్మం జిల్లా ఆడబిడ్డను.ఆ బిరుదు శాశ్వతమన్నారు. వచ్చే ఏడాది స్థంభాద్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించబోతున్నామని, మత్స్యకారుల పండుగ రోజున పాలేరు లో ఉత్సవాలు జరుపబోతున్నామన్నారు. నేలకొండపల్లి బౌద్ధ స్థూపం ను అభివృద్ధి చేయాలని టూరిజం శాఖ మంత్రిని కోరానన్నారు. కేటిపిఎస్ లో 7వ స్టేజి వచ్చిందంటే తన కృషి ఉందని, బీజేపీ ప్రభుత్వం పాల్వంచ స్పాంజ్ ఐరన్ ను మూసివేసిందన్నారు. అక్కడి ట్రేడ్ యూనియన్ నాయకులతో మాట్లాడి మళ్ళీ తెరిపించాలని పోరాటం చేస్తానన్నారు. కేటీఆర్ మాటలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం లేదని, కాళేశ్వరం మొత్తం డొల్ల అంటే మీరు ఒప్పుకుంటారా? మూసి ప్రక్షాళన ముమ్మాటికీ అవసరమేనని, ఏనుగులు పోతుంటే కుక్కలు మొరుగుతూనే ఉంటాయని వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు.

## అదానీతో చేసుకున్న ఒప్పందాలు రద్దు చేయాలి

### రేవంత్ సర్కార్ కు కేటీఆర్ డిమాండ్

(మొదటిపేజీ తరువాయి)

5000 కోట్లు గ్రీన్ ఎనర్జీ, 5000 కోట్లు డేటా సెంటర్, సిమెంట్ పరిశ్రమ పెట్టుబడులు ఇలా మొత్తం రూ.12,400 కోట్ల పెట్టుబడులు చేసుకున్నామని చెప్పారు. తెలంగాణ డిస్కంలను అదానీకి అప్పగించేందుకు ఓల్డ్ సిటీ బిల్లుల వసూళ్ల డ్రామా మొదలుపెట్టారు. అదానీకి డిస్కంలను అప్పగించి వాటిని ప్రైవేటీకరించేందుకు కుట్ర చేశారు. యాదాద్రిలోని రామన్నపేటలో సిమెంట్ పరిశ్రమ వద్దని ప్రజలు వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్ పట్టించుకోలేదు. ఏ మూసీ శుద్ధి అంటున్నారో అదే మూసీ సిమెంట్ ఫ్యాక్టరీ కారణంగా మురికి మాయం అవుతుందని చెప్పినా పట్టించుకోలేదు. ప్రజాభిప్రాయ సేకరణ చేసినట్లుగా మమ అనిపించి అదానీకి సహకరించే పని చేశారు. పైన బడే భాయ్ ఆదేశించటంతో...కింద చోటా భాయ్ ఆచరించాడని కేటీఆర్ ధ్వజమెత్తారు.

# ఒప్పందాలు సమీక్షిస్తాం

### రాహుల్ మాటే మా బాట: పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

**హైదరాబాద్, మహా :** ప్రముఖ వ్యాపారవేత్త గౌతమ్ అదానీపై అమెరికాలో కేసు నమోదవటం ఇప్పుడు దేశంలో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఇదే సమయంలో గౌతమ్ అదానీతో రేవంత్ రెడ్డి సర్కార్ చేసుకున్న వ్యాపార ఒప్పందాలు, తెలంగాణలో అదానీ పెట్టుబడులు, ఇచ్చిన విరాళాల గురించి కూడా పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. విపక్షాల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఈనేపథ్యంలో గాంధీ భవన్ లో మీడియా సమావేశం ఏర్పాటు చేసిన టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో అదానీ పెట్టుబడులు, సర్కారుతో వ్యాపార ఒప్పందాలపై స్పందిస్తూ చట్టానికి లోబడే వ్యాపారాలను తెలంగాణలో అనుమతి ఇస్తామని, అది అదానీ అయినా అంబానీ అయినా సరే అంటూ వ్యాఖ్యానించారు. ఈ క్రమంలోనే అదానీపై వస్తున్న అవినీతి ఆరోపణలు నిజమేనని నిరూపితమైతే తెలంగాణలో ఆయన పెట్టుబడులపై పునరాలోచన చేస్తామని తేల్చి చెప్పారు. అదానీకి తెలంగాణలో ఇప్పటి వరకు ఇంచు భూమి కూడా ఇవ్వలేదని క్లారిటీ ఇచ్చారు. ఇదే క్రమంలో స్కిల్ యూనివర్సిటీకి అదానీ రూ.100 కోట్ల విరాళం ఇచ్చారని స్పష్టం చేస్తూ, ఆ విరాళం రేవంత్ రెడ్డి సొంత పాకెట్ కు ఇవ్వలేదని, ప్రజా అవసరాలకు ఇచ్చిన విరాళమని పేర్కొన్నారు.



రేపు కేటీఆర్ వచ్చి విరాళం ఇస్తామంటే కూడా స్వీకరిస్తామని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. స్కిల్ యూనివర్సిటీకి అదానీ వంద కోట్ల విరాళం ఇత్తారమని, కేటీఆర్ రూ. 50 కోట్ల విరాళమిచ్చినా స్వీకరిస్తామని పేర్కొన్నారు. గతంలోనూ తెలంగాణలో అదానీ కార్యకలాపాలు సాగాయన్న మహేష్ కుమార్ గౌడ్ అప్పుడు అదానీ డబ్బులు కొందరికి వ్యక్తిగతంగా ముట్టాయని ఆరోపించారు. చట్టరీత్యా వ్యాపారాలు చేసుకుంటే తెలంగాణ ప్రభుత్వానికి ఎటువంటి అభ్యంతరం లేదని ఇప్పుడు బయటకు వచ్చిన అంశంపై జేపీసీ కోరుతున్నామని చెప్పుకొచ్చారు. జేపీసీ ఏర్పాటై నిష్పక్షపాతంగా విచారణ జరిగితే నరేంద్ర మోదీ ప్రధానిగా తప్పుకోవాల్సి వస్తుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. అదానీ అవినీతిపై రాహుల్ గాంధీ ఎన్నిసార్లు చెప్పినా ఎవరూ స్పందించలేదని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. అర్హత లేకపోయినా అదానీకి వేల కోట్ల రుణాలు ఇచ్చారని ఆరోపించారు.

## చాలా మంది టచ్ లో ఉన్నారు

పార్టీలో చేరికలపై స్పందించిన మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. త్వరలోనే కాంగ్రెస్ పార్టీలోకి మరిన్ని చేరికలు ఉంటాయని.. ఎంతమంది చేరుతారో త్వరలోనే క్లారిటీ ఇస్తామని పేర్కొన్నారు. కేటీఆర్ కు అత్యంత దగ్గరగా ఉండేవారు కూడా తమతో టచ్ లో ఉన్నారంటూ మహేష్ కుమార్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేయటం ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో మరింత ఆసక్తికర చర్చ నడుస్తోంది. హైకోర్టు తాజా తీర్పుతో చేరికలపై మరోసారి కాంగ్రెస్ పార్టీ దృష్టి పెట్టిందన్న విషయం టీ పీసీసీ చీఫ్ వ్యాఖ్యలతో స్పష్టమవుతోంది.

# తెలంగాణకు పెట్టుబడుల వెల్లువ

### రూ. 5260 కోట్ల పెట్టుబడులు.. 12490 మందికి ఉపాధి



**హైదరాబాద్, మహా :** దేశంలో పేరొందిన పలు ఫార్మా కంపెనీలు హైదరాబాద్ లో భారీ పెట్టుబడులకు ముందుకు వచ్చాయి. తమ కంపెనీల కార్యకలాపాల విస్తరణతో పాటు కాలుష్య రహితంగా ఏర్పాటు చేసే గ్రీన్ ఫార్మా కంపెనీలను నెలకొల్పేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. వివిధ ఫార్మా కంపెనీల ప్రతినిధులు శుక్రవారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో సంప్రదింపులు జరిపారు. ఎంఎస్ఎన్ గ్రూప్, లారస్ ల్యాబ్స్, గ్లాండ్ ఫార్మా, డాక్టర్ రెడ్డీస్ లాబోరేటరీస్, అరబిందో ఫార్మా, హెటిరో ల్యాబ్స్ కంపెనీల ప్రతినిధులు, టీఎస్ఐఐసీ ఛైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, విష్ణువర్ధన్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫార్మా కంపెనీల ప్రతినిధులు తమ పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించిన ఎంవోయూలపై సంతకాలు చేశారు. ఈ ఆరు కంపెనీలు కలిసి దాదాపు రూ.5260 కోట్లు పెట్టుబడులు పెట్టనున్నాయి. వీటి ద్వారా ఫార్మా రంగంలో 12490 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. ఇప్పటికే ప్రభుత్వం గుర్తించిన ఫార్మా సిటీలో వీటికి అవసరమైన యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం స్థలాన్ని కేటాయించనుంది. ఎంవోయూల ఒప్పందాల ప్రకారం ఎంఎస్ఎన్ లాబోరేటరీ మాన్యుఫాక్చరింగ్ యూనిట్ తో పాటు ఆర్ అండ్ డీ సెంటర్ నెలకొల్పనుంది. లారస్ ల్యాబ్స్, అరబిందో ఫార్మా ఫార్ములేషన్ యూనిట్లు నెలకొల్పుతాయి. గ్లాండ్ పార్మా ఆర్ అండ్ డీ సెంటర్, ఇంజెక్టబుల్స్, డ్రగ్ సబ్స్టాన్స్ మాన్యుఫాక్చర్ యూనిట్లను స్థాపించనుంది. డాక్టర్ రెడ్డీస్ లాబ్స్ ఇంజెక్టబుల్, బయో సిమిలర్ల యూనిట్ ఏర్పాటు చేస్తుంది. హెటిరో ల్యాబ్స్ ఫినిషడ్ డోస్, ఇంజక్టబుల్ తయారీ పరిశ్రమ నెలకొల్పనుంది. మరో నాలుగు నెలల్లో ఫార్మా కంపెనీలు తమ నిర్మాణ పనులు చేపట్టేందుకు వీలుగా స్థలాలను కేటాయించటంతో పాటు, ఫార్మా సిటీలో అవసరమైన సదుపాయాలు కల్పించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. డాక్టర్ రెడ్డీ ల్యాబ్స్ డైరెక్టర్ సతీష్ రెడ్డి, లారస్ ల్యాబ్స్ ఈడీ వివి రవికుమార్, గ్లాండ్ ఫార్మా సీఈవో శ్రీనివాస్, ఎంఎస్ ల్యాబ్స్ సీఎండీ ఎంఎస్ఎన్ రెడ్డి, అరబిందో డైరెక్టర్ మదన్మోహన్ రెడ్డి, హెటిరో గ్రూప్ ఎండీ బి.వంశీకృష్ణ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# ఐకమత్యమే మన సభ్యత.. మన భవిష్యత్

### మనం మారాలి.. మన ఆలోచనలు మారాలి.. అప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధిస్తాం

### లోక్ మంథన్ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

**హైదరాబాద్, మహా:** ఐకమత్యమే మన సభ్యత.. మన భవిష్యత్.. అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. మొదట మనం మారాలి.. మన ఆలోచనలూ మారాలి.. అప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధిస్తామని అన్నారు. హైదరాబాద్ పర్యటనలో భాగంగా.. శుక్రవారం శిల్పకళావేదికలో లోక్ మంథన్ ను గవర్నర్ ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడతూ.. సంస్కృతీ సంప్రదాయాలను బలోపేతం చేసే గొప్ప కార్యక్రమం లోక్ మంథన్ అని అన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం గర్వంగా భావిస్తున్నానని తెలిపారు. 2018 రాంచీలో జరిగిన లోకమంథన్ లో ప్రత్యక్షంగా పాల్గొన్నానని గుర్తు చేసుకున్నారు. ఆ తర్వాత మరోసారి లోకమంథన్ లో పాల్గొనే అవకాశం కలిగిందని, ఇందుకు చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. భారతదేశ సంస్కృతి, ఆచార వ్యవహారాలు, మన పరంపర చాలా ఘనమైనవన్న ఆమె.. భిన్నత్వంలో ఏకత్వం గురించి మాట్లాడతాం.. పాటిస్తాం. ఇదే మన బలం, ఇదే మన స్థైర్యం అని తెలిపారు. ఇన్ని భిన్న సంస్కృతులు ఒకేచోట ఉండటం నిజంగా చాలా గొప్ప విషయమన్నారు. ద్రౌపది ముర్ము ఇవన్నీ కలిసిన సుందరమైన ఇంద్రధనస్సు లాంటి దేశం మనదని, మనం మనదేశాన్ని చూసి గర్వించాలని పేర్కొన్నారు.

### మనమంతా భారతవాసులం..

వనవాసి, నగరవాసి అని తేడా లేకుండా మనమంతా భారతవాసులం అనే విషయాన్ని మరవకూడదని సూచించారు. లోకమంథన్ కార్యక్రమంలో.. అహల్యాబాయ్ హోల్కర్, రాణి రుద్రమదేవి వంటి వీరనారులపై నిర్వహిస్తున్నారని తెలిసి హర్షం వ్యక్తం చేశారు. వారి ప్రేరణ ఎప్పటికీ మనకు అవసరమని తెలిపారు.



### విదేశాల్లోనూ మన సంప్రదాయాలు..

విదేశాల్లోనూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పాటిస్తుండటం అభినందనీయమన్నారు. ఇండొనేషియా సహా వివిధ దేశాల ప్రతినిధులు ఈ వేదిక ద్వారా తమ సంస్కృతిని ప్రదర్శిస్తుండటాన్ని హృదయపూర్వకంగా అభినందిస్తున్నట్లు చెప్పారు. భారతదేశ ఆధ్యాత్మిక భావనలు, కళలు, సంగీతలు, విద్య, వైద్య విధానాలు ప్రపంచవ్యాప్తంగా గౌరవాన్ని పొందాయని, ప్రపంచానికి మనం జ్ఞాన దర్శనం చేశామని, ప్రపంచమంతా ప్రస్తుత సమయంలో మళ్లీ భారతదేశ జ్ఞానాన్ని పంచాల్సిన అవసరం ఏర్పడిందన్నారు.

'విదేశీ శక్తులు శతాబ్దాలుగా మన మీద జులుం ప్రదర్శించాయి. మన సంస్కృతిని, భాషను, సంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను విధ్వంసం చేశాయి. మనలో ఐకమత్యాన్ని దెబ్బతీసేలా వ్యవహరించారు. మనలో బానిస మూలాలను చొప్పించారు. కానీ మన దేశ ప్రజలు సంస్కృతి, సంప్రదాయాలను పాటిస్తూ.. వీటిని నిరంతరం జీవింపజేశారు. ఇకపైనా వీటిని కొనసాగించాల్సిన అవసరం ఉంది. భారతదేశం బానిసత్వ మూలాలను తొలగించుకునే ప్రయత్నం చేస్తోంది. రాజ్ పథ్ పేరు కర్తవ్యపథ్ మారింది. దర్బార్ హాల్ పేరు.. గణతంత్ర మండప్ గా మార్చాం. ఇది బానిసత్వ ఆలోచనలను తొలగించే దిశగా జరుగుతున్న ప్రయత్నం. మన ఆలోచనలు కూడా మారాలి. ఇటీవల.. ఓ హైకోర్టులో మహిళా జడ్జి విగ్రహాన్ని ప్రారంభించారు. కానీ ఆ విగ్రహం కళ్లకు నల్లని గంతల కట్టలేదు. ఇది మనం సాధిస్తున్న మార్పునకు సంకేతం. మన ఆలోచనలు కూడా మారాలి. అప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించగలం. ఐకమత్యమే మన సభ్యత. మన భవిష్యత్తు. ఈ దిశగా మనమంతా కలిసి పనిచేద్దాం' అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము లోక్ మంథన్ లో పిలుపునిచ్చారు.

## దద్దరిల్లిన దండకారణ్యం



ఎన్కౌంటర్ జరిగిన ప్రదేశంలో భారీగా ఆయుధాలు, పేలుడు సామాగ్రిని భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మావోయిస్టులకు అడ్డాగా ఉన్న ఛత్తీస్ ఘడ్ లోని సుక్మా జిల్లాలోని దండకారణ్యం మరోసారి కాల్పులతో దద్దరిల్లింది.మృతి చెందినవారిలో ముగ్గురు మహిళలు ఉన్నారు.మృతి చెందిన వారిలో... దూది మాసా(డివిసీఎం),మాద్వి లక్మా,డోరోకోసి(ఏసిఎంలు),కుంజమ్ బమన్,కాటంకోసి(పీ ఎల్ జి ఏ 8 కమాండర్),దూది హంగీ లను గుర్తించారు.మరో నలుగురిని గుర్తించాల్సి ఉందని...ఘటనా స్థలంలో ఏకే 47 1,ఎస్ ఎల్ ఆర్ 1,ఇన్సాస్ 1,సింగిల్ షాట్ గన్,1మరియు ఒక పిస్టల్ ను స్వాధీనం చేసుకున్నట్లు ఛత్తీస్ ఘడ్ పోలీసులు తెలిపారు.



## ఏపీ అసెంబ్లీ ప్రాంగణంలో మహిళా ఎమ్మెల్యేలు సెల్ఫీ

కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి జన్మదినం సందర్భంగా అసెంబ్లీ లో వేడుకలు జరగ్గా, కేక్ కట్ చేసిన ప్రశాంతిరెడ్డి కి ఎమ్మెల్యే లు .. శుభాకాంక్షలు తెలి పారు . వేడుకల అనంతరం అందరినీ తన ఫోన్‌తో సెల్ఫీ తీసిన హోం మంత్రి అనిత సంతోషం పంచుకున్నారు .

# కొన్నిసార్లు మనుసును చంపుకొని పని చేయాల్సి వస్తోంది

## మానవత్వంతో ఆలోచిస్తే సమాజమంతా బాధపడాల్సి వస్తుంది.. హైడ్రా చీఫ్ రంగనాథ్



**హైదరాబాద్, మహా:** నిర్మాణాలు కూల్చి చెరువులు కాపాడటం హైడ్రా ఉద్దేశం కాదని, చెరువుల పరిధిలో కొత్త నిర్మాణాలను అడ్డుకోవడం తమ లక్ష్యమని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. చెరువులను పునరుద్ధరించాలంటే ఇళ్లను కూల్చాల్సిన పని లేదని అన్నారు. చెరువులో నీటి విస్తీర్ణం, సర్వే ఆఫ్ ఇండియా మ్యాప్‌లు, విలేజ్ మ్యాప్‌లను కూడా పరిగణనలోకి తీసుకుంటున్నామని తెలిపారు. ఇవాళ హైడ్రా కార్యాలయంలోని విశ్రాంత ఇంజినీర్లు, రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులతో రంగనాథ్ సమావేశమై హైడ్రాకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడారు. అక్రమ నిర్మాణాల విషయంలో మానవత్వంతో ఆలోచిస్తే సమాజమంతా బాధపడాల్సి వస్తుందని రంగనాథ్ పేర్కొన్నారు. కొన్నిసార్లు మనుసును చంపుకొని పని చేయాల్సి వస్తోందని వ్యాఖ్యానించారు. అమీన్‌పూర్ తూములు మూయడంతోనే లేఔట్లు మునిగాయని తెలిపారు. తప్పుడు అనుమతులు ఇచ్చినవి, అనుమతులు రద్దు చేసిన ఇళ్లను మాత్రమే కూల్చివేశామని వెల్లడించారు. కొంతమందిపై చర్యలతో హైడ్రా పని అందరికీ తెలిసిందని అన్నారు. ప్రజల్లో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లపై అవగాహన వస్తోందని, ఆక్రమణల నియంత్రణకు ఆధునిక సాంకేతికతను వాడుతున్నామని వివరించారు. నిపుణులు ఇచ్చిన సూచనలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. ప్రతి చెరువు పునరుద్ధరణకు ప్రజలను భాగస్వామ్యం చేస్తామని పేర్కొన్నారు. చెరువుల పునరుద్ధరణ కోసం హైడ్రా కీలక నిర్ణయం తీసుకుందని తెలిపారు.

### వాతావరణ శాఖతో కలిసి పని చేస్తాం


మరోవైపు ప్రకృతి విపత్తుల నుంచి హైదరాబాద్ ప్రజలను అప్రమత్తం చేసేందుకు వాతావరణశాఖతో కలిసి పని చేస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. పెరుగుతున్న పట్టణీకరణ వల్ల వాతావరణశాఖ నుంచి వచ్చే అప్రమత్త సందేశాలు కచ్చితత్వంతో ఉండేలా చూసుకోవాలని సూచించారు. భారత వాతావరణ శాఖ 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఇవాళ అమీర్‌పేట్‌లోని సెస్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐఎండీ అలర్ట్ సందేశాన్ని ఆయన ఆవిష్కరించారు. వాతావరణ మార్పులను అంచనా వేయడంలో ఎన్నో సవాళ్లు ఎదురవుతున్నాయని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మహోపాత్ర తెలిపారు. బెంగళూరు తరహాలో ప్రతి 15 నిమిషాలకు డేటా సేకరించి విశ్లేషించాలని రంగనాథ్ అభిప్రాయపడ్డారు.

# ఆర్జే వెంచర్స్ మోసం

## రూ.150 కోట్లకు ముంచేశారు

### సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

### న్యాయం చేయాలంటూ పీఎస్ ముందు ఆందోళన



**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ లో మరో ఘరానా మోసం బయటపడింది. ఆర్జే వెంచర్స్ అనే సంస్థ ప్రీ లాంచ్ పేరుతో 600 మంది నుంచి రూ.150 కోట్లు వసూలు చేసి, నిలువునా ముంచేసింది. శుక్రవారం ఆర్జే వెంచర్స్ బాధితులు సీసీఎస్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. పీఎస్ ముందు వారు ఆందోళన చేపట్టారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ, తమకు న్యాయం చేయాలని కోరారు. నారాయణఖేడ్, పటాన్ చెరు, ఘట్ కేసర్ ప్రాంతాల్లో అపార్ట్ మెంట్లు, ఫామ్ ల్యాండ్ పేరుతో ఆర్జే వెంచర్స్ సంస్థ కస్టమర్లకు కుచ్చుటోపీ పెట్టింది. భారీగా డబ్బు వసూలు చేసిన ఈ వెంచర్స్ సంస్థ నాలుగేళ్లు గడుస్తున్నా ఎలాంటి నిర్మాణాలు చేపట్టకపోవడంతో, డబ్బు చెల్లించిన వారు లబోదిబోమంటున్నారు. 2020లో రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు డబ్బు కట్టామని, సంస్థను ఎన్నిసార్లు అడిగినా నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని బాధితులు వాపోయారు. ఆర్జే వెంచర్స్ ఎండీ భాస్కర్ గుప్తా, సంస్థ డైరెక్టర్ సుధారాణి మాటలు నమ్మి డబ్బులు కట్టామని బాధితులు చెబుతున్నారు. గట్టిగా నిలదీస్తే, కొందరికి చెక్కులు ఇచ్చారని, కానీ అవి బౌన్స్ అయ్యాయని వారు వెల్లడించారు.

# నకిలీ మందులు

## నార్కోటిక్ మత్తు సిక్కర్ల పట్టివేత

### రూ. 6.91 లక్షల విలువ చేసే నకిలీ మందుల స్వాధీనం

### డ్రగ్ కంట్రోల్, ఎక్సైజ్ ఎన్ ఫోర్స్‌మెంట్ సంయుక్తంగా దాడి



**హైదరాబాద్, మహా :** సుద్ద ముక్కలు, బియ్యం పిండి కలిపి తయారు చేసిన నకిలీ యాంటి బాటిక్స్‌ను ఉత్తరఖాండ్‌తో తయారు చేసి కరీంనగర్, కర్నూల్‌లో అమ్మకాలు జరపడానికి దిగుమతి అయిన మందులను డ్రగ్స్ కంట్రోల్, ఎక్సైజ్ ఎన్ ఫోర్స్‌మెంట్‌లు సంయుక్తంగా దాడి చేసి పట్టుకున్నారు. శుక్రవారం వచ్చిన పక్కా సమాచారం మేరకు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు, ఎక్సైజ్ ఎస్టిఎఫ్ టీమ్ పోలీసులు కలిసి బాలనగర్ లోని తిరుపతి కొరియర్‌కు వచ్చిన యాంటి బాటిక్ మందులను, సిక్కరు అంటించుకుంటే చాలు మత్తు కలిగించే నార్కోటిక్ మందు లను పట్టుకున్నారు. పట్టుకున్న నకిలీ మందుల విలువ రూ. 6.91 లక్షలు ఉంటుందని అంచనాలు వేశారు.

ఉత్తరఖాండ్‌లో మహేష్ కుమార్ షైనీ అనే వ్యక్తి తన కంపెనీలో ఎలాంటి యాంటిబాటిక్స్ మందుల్లో వినియోగించే రసాయన పదార్థాలు లేకుండా తయారు చేసిన మందులను మునిశేఖర్, గంద్ర రాములు అనే వ్యక్తులు హైదరాబాద్‌కు తెప్పించారు. ఈ మందులను కరీంనగర్, కర్నూల్ జిల్లా కేంద్రాంలో మందుల దుకాణాలకు సరపరా చేయడానికి దిగుమతి చేసుకున్నారు. నకిలీ యాంటిబాటిక్స్‌ను పట్టుకున్న వారిలో డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాద్, సరూర్‌నగర్, ఉప్పల్, సికింద్రాబాద్, మల్కక్‌పేట్ ప్రాంతాలకు చెందిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు నాగరాజు, లక్ష్మణ్, గోవింద్ సింగ్, అనిల్‌రెడ్డిలు ఉన్నారు. ఎక్సైజ్ ఎస్ టి ఎఫ్ సీఐ నాగరాజు సిబ్బంది ఉన్నారు. ఒకేసారి నకిలీ యాంటిబాటిక్స్‌ను, మత్తు పదార్థలను పట్టుకున్న డ్రగ్ ఇస్పెక్టర్లను, ఎస్ టి ఎఫ్ సిబ్బంది డ్రగ్ కంట్రోల్ డైరెక్టర్ ఆఫ్ జనరల్, ఎక్సైజ్ ఎన్ ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి. కమలాసన్‌రెడ్డి అభినందించారు.



# ఢిల్లీ వాయు కాలుష్యం ఆందోళనకరం

### పరిష్కారం తక్షణ అవసరం

### ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ

**ఢిల్లీ, మహా:** ఉత్తర భారతంలో వాయు కాలుష్యం ఆందోళన కలిగిస్తోందని, ఇది జాతీయ అత్యవసర పరిస్థితే అని లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. ఇండియా గేట్ వద్ద పర్యావరణవేత్త ఝూతో కలిసి ఆయన మాట్లాడారు. ఇందుకు సంబంధించిన వీడియోను ఎక్స్ సోషల్ మీడియా వేదికపై పోస్ట్ చేశారు. పార్లమెంట్ సమావేశాల్లో వాయు కాలుష్యంపై చర్చించి సరైన పరిష్కారం కనుగొనాలన్నారు. వాయు కాలుష్యానికి సామాన్యులే ఎక్కువగా బలవుతున్నారన్నారు.

# సుప్రీంను ఆశ్రయిస్తాం: కేటీఆర్



**హైదరాబాద్, మహా:** పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు సంబంధించిన పిటిషన్లపై హైకోర్టు ఇచ్చిన తీర్పు మీద బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. గత ఎన్నికల్లో తమ పార్టీ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలకు సంబంధించిన అనర్హత పిటిషన్‌లపై స్పీకర్ నిర్ణయం తీసుకోకుంటే తాము సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు. మొన్నటి వరకు స్పీకర్‌ను ఆదేశించే అధికారం కోర్టుకు లేదని వాదించారని కేటీఆర్ విమర్శలు గుప్పించారు. ఇప్పుడు మాత్రం మరోలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. హైకోర్టు రీజనబుల్ పీరియడ్ అని చెప్పిందని తెలిపారు. రీజనబుల్ పీరియడ్ అంటే మూడు నెలలు అని మణిపూర్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో స్పష్టంగా ఉందన్నారు.

# మూడో ప్రపంచ యుద్ధం మొదలైనట్లే

## ఉక్రెయిన్ రాయబారి సంచలన వ్యాఖ్య

- రష్యా మిత్రపక్షాలు పాల్గొనడం
- ఇదే సూచిస్తున్నాయన్న అధికారి జలుజ్నీ
- ఉత్తర కొరియా దళాలు, చైనా ఆయుధాలు యుద్ధంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని వ్యాఖ్య
- ఉక్రెయిన్‌కు అనేక మంది శత్రువులు ఉన్నారన్న జలుజ్నీ

**మహా:** ఉక్రెయిన్ మాజీ మిలటరీ కమాండర్ ఇన్ చీఫ్, బ్రిటన్ లో ఉక్రెయిన్ రాయబారిగా ఉన్న వాలెరీ జలుజ్నీ సంచలన వ్యాఖ్యలు చేశారు. మూడో ప్రపంచ యుద్ధం మొదలైనట్లేనని ఆయన అభిప్రాయపడ్డారు. రష్యా-ఉక్రెయిన్ మధ్య క్షిపణి ప్రయోగాల నేపథ్యంలో ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 2024లో మూడో ప్రపంచ యుద్ధం ప్రారంభమైందని భావిస్తున్నానని జలుజ్నీ వ్యాఖ్యానించారు. తాజా సంక్షోభంలో రష్యా మిత్రపక్షాలు పాల్గొనడం ఇదే విషయాన్ని సూచిస్తోందన్నారు. ఉక్రెయిన్‌లో ప్రావ్దా యూపీ100 అవార్డ్ ఫంక్షన్‌లో ఆయన మాట్లాడారు. ఉత్తర కొరియాకు చెందిన సైనికులు ఉక్రెయిన్‌పై పోరాడుతున్నారని, ఇరాన్ రూపొందించిన ఆయుధ సామాగ్రితో ఉక్రెయిన్‌లో చాలామంది ప్రాణాలు కోల్పోయారన్నారు. ఉత్తర కొరియా దళాలు, చైనా ఆయుధాలు ఈ యుద్ధంలో కీలక పాత్రను పోషిస్తున్నాయన్నారు. తాజా సంక్షోభం మరింత విస్తరించకుండా నిర్ణయాత్మక చర్యలు తీసుకోవాలని ఉక్రెయిన్ మిత్రదేశాలకు విజ్ఞప్తి చేశారు. దీనిని ఇక్కడితో ఆపడం సాధ్యమేనని... కానీ కొన్ని కారణాల వల్ల తమ భాగస్వామ్య పక్షాలు దీనిని అర్థం చేసుకోవడం లేదన్నారు. ఉక్రెయిన్‌కు అనేకమంది శత్రువులు ఉన్నట్లు తెలిపారు.

# ప్రభుత్వ పథకాలు గడప గడపకు చేరాలి

### ప్రజా పాలన విజయోత్సవాల్లో ప్రతి ఒక్కరిని భాగస్వాములు చేయాలి

### అన్ని శాఖలు ప్రజాపాలన విజయోత్సవాల సంబరాలు జరపాలి

### 30న మహబూబ్ నగర్ లో రైతు దినోత్సవం సభ

### డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ట్యాంక్ బండ్ పై మూడు రోజుల కార్నివాల్

### అధికారులలో డిప్యూటీ సీఎం బట్టి సమీక్ష

### సమావేశానికి హాజరైన మంత్రులు ఉత్త మ్ , పొంగులేటి, సీతక్క, ప్రభుత్వ సలహాదారులు




**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి అవుతున్న సందర్భంగా ఏడాది కాలంలో చేపట్టిన పథకాల అమలు, కార్యక్రమాలను రాష్ట్రంలోని ప్రతి గడపకు చేరవేసేలా విస్తృత స్థాయిలో కార్యక్రమాలను చేపట్టాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఒక సంవత్సరం పూర్తయిన సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశమైంది. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, సీతక్క, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, వివిధ శాఖల కార్యదర్శులు, ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ సి.ఎం. భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం సందర్భంగా ప్రజా విజయోత్సవాలు ఇప్పటికే ప్రారంభించామన్నారు. హైదరాబాద్ లోని ఎల్.బీ స్టేడియంలో పాఠశాల విద్యార్థుల దినోత్సవం, వరంగల్ లో మహిళా దినోత్సవం కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టడం జరిగిందని, అదే విధంగా ఈనెల 30 వ తేదీన మహబూబ్ నగర్ లో రైతు దినోత్సవం నిర్వహిస్తున్నట్టు వివరించారు. అలాగే డిసెంబర్ 7, 8, 9 తేదీలలో ట్యాంక్ బండ్, నెక్లెస్ రోడ్ మార్గాలలో కన్నుల పండగగా కార్నివాల్, లేజర్ షో, పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ మూడు రోజుల ఉత్సవాలలో మహిళలు, పిల్లలు, పౌరులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే, ప్రతి జిల్లాలో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ విజయవంతంగా జరుగుతున్నాయని, గ్రామ స్థాయి నుండి, మండలాలు, జిల్లా స్థాయి వరకు ఈ ప్రజా విజయోత్సవాలు పండగ వాతావరణంలో నిర్వహించాలన్నారు. ఏడాది కాలంలో అమలు చేసిన పథకాలు, కార్యక్రమాలపై అంతర్గతంగా ప్రతి శాఖ వేడుకలు నిర్వహించుకోవాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. ఏడాది కాలంలో చేపట్టిన విజయాలను ప్రతి వ్యక్తికి చేరవేసేలా సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ లను విస్తృత స్థాయిలో ఉపయోగించుకోవాలని, గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ బడులలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించాలన్నారు.

నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో ఉన్న దాదాపు 70 లక్షల స్వయం సహాయక మహిళలకు సున్నా వడ్డీ పథకం, బ్యాంకు లింకేజీలు, సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ తదితర మహిళా సాధికారత పథకాల వివరాలన్నీ వారికి చేరవేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ విజయాలపై ప్రత్యేకంగా రూపొందించిన హోర్డింగులు, షార్ట్ ఫిలిం లు, తదితర ప్రచార అంశాలను సోషల్ మీడియా ద్వారా విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహించాలన్నారు. అదే విధంగా రాష్ట్రంలో ఉన్న దాదాపు 25 వేల ఆర్టీసీ బస్సుల పై ఈ హోర్డింగులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రధానంగా ప్రభుత్వ గ్యారెంటీలలో భాగంగా అమలు చేస్తున్న ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రూ. 500 లకే గ్యాస్ సిలిండర్, ఆరోగ్య శ్రీ కవరేజి పెంపు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం తదితర పథకాలపై పాఠశాల విద్యార్థులు వ్యాసరచన, వకృత్వ పోటీలను నిర్వహించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి మాట్లాడుతూ, ఈ ప్రజా విజయోత్సవాలు పురస్కరించుకొని రాష్ట్రంలో నర్సింగ్, పారా మెడికల్ కళాశాలల ప్రారంభోత్సవం, 200 విద్యుత్ సబ్ స్టేషన్ల ప్రారంభం, 9007 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందచేయడం, ఆరు ప్రధాన పాలసీలను ముఖ్యమంత్రిచే ప్రారంభించుకోవడం తదితర కార్యక్రమాలను కూడా చేపడుతున్నామని వివరించారు.

## రీల్స్ చేసి ట్రెండ్ సెట్ చేద్దాం అనుకుని..

# పుట్టిన రోజు వేడుకల్లో గన్ పేలి హైదరాబాద్ విద్యార్థి మృతి



**ఉప్పల్, మహా:** ఖండాతరాలు దాటినా.. పెద్ద చదువుల కోసం దేశాలు దాటి వెళ్లినా.. ముందూవెనుకా ఆలోచించకుండా చేసే పనులు కుటుంబానికి షాక్ నిస్తున్నాయి. పుట్టిన రోజు వేడుకల పేరుతో ట్రెండింగ్ అంటూ చేస్తున్న వికృత చేష్టలు ప్రాణాలు బలికోరుతున్నాయి. బర్త్ డే డెత్ డే గా మారుతుంటే కన్న పేగు విలవిలలాడుతుంది. రీల్స్.. రీల్స్.. రీల్స్.. సమయం, సందర్భం లేకుండా.. ఫాలోవర్స్ కోసం ఒళ్లు మరిచి చేసే పనులు కుటుంబీకులను కంటతడి పెట్టిస్తున్నాయి. మంచి చదువులు చదువుకుని, ఉద్యోగం తెచ్చుకుని తమని బాగా చూసుకుంటారు అనుకుంటున్న కన్న వారి కలలు.. కాటికి చేరుతున్నాయి. తమను మోయాల్సిన భుజాలను.. తమ భుజాలపై మోస్తుంటే ఆ భారాన్ని వర్ణించడం ఎవరి తరం కాదు.. ఆ క్షోభను అనుభవిస్తున్నారు... ఉప్పల్ కు చెందిన సుదర్శన్‌రెడ్డి దంపతులు. పుట్టిన రోజు నాడు రీల్స్ చేసి .. ట్రెండ్ సెట్ చేద్దాం అనుకున్న ఓ తెలుగు విద్యార్థికి. అదే అతని చివరి వీడియో అయింది. ఉప్పల్ ధర్మపురి కాలనీకి చెందిన సుదర్శన్‌రెడ్డి కుమారుడు ఆర్యన్‌రెడ్డి (23) ఏడాదిన్నర క్రితం మాస్టర్స్ చేసేందుకు అమెరికా వెళ్లాడు. జార్జియాలోని అట్లాంటాలో ఉంటున్నారు. పార్ట్ టైం జాబ్ చేసుకుంటూ.. ఎంఎస్ చదువుతున్నారు. ఈ నెల 13న అతని పుట్టిన రోజు. ఈనెల 13న ఆర్యన్‌రెడ్డి.. తన పుట్టినరోజును ఫ్రెండ్స్ తో కలిసి చాలా గ్రాండ్ గా సెలబ్రేట్ చేసుకున్నాడు. ఇదే టైం లో గన్ తో కేక్ వెలిగించి.. రీల్స్ చేద్దాం అని ఫిక్స్ అయ్యారు అందరూ.. అయితే ఇక్కడే గన్ మిస్ ఫైర్ అయింది. బులెట్ ఆర్యన్ రెడ్డి శరీరంలోకి దూసుకెళ్లింది. తీవ్రరక్తస్రావం కావడంతో అతను అక్కడే ప్రాణాలు విడిచారు. ఘటనపై అట్లాంటా పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. గన్ వారికి ఎక్కడి నుంచి వచ్చింది..? ఎంత కాలం నుంచి గన్ వాడుతున్నారు అని విచారణ చేస్తున్నారు. ఆర్యన్ రెడ్డి మృతదేహం ఉప్పల్ కు చేరింది.

# ఉద్యోగ నియామకాల్లో రికార్డు

తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగ నియామకాల్లో గత రికార్డులు తిరగరాసింది. మాట నిలుపుకుంది. తెలంగాణ వచ్చిన తర్వాత ఒకే ఏడాది ఈ స్థాయి నియామకాలు ఇదే ప్రథమం. ఏడాదిలో అరలక్షకు పైగా ఉద్యోగ నియామకపత్రాలు అందజేయడంతో పాటు నిరంతర పరీక్షలు జరపడం, నోటిఫికేషన్లు విడుదల చేస్తుండడం నియామకాల అంశంలో ప్రభుత్వ చిత్తశుద్ధికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టుదలకు నిదర్శనంగా చెప్పవచ్చు. రేవంత్ పాలనలో తెలంగాణ యువత భవిత మలుపు తిరిగింది. తొలి ఏడాదిలోనే ప్రభుత్వం యువతకు ఇచ్చిన మాట ప్రకారం ఉద్యోగ నియామకాల మేళా నిర్వహించింది. ఉద్యోగాల భర్తీలో కొత్త రికార్డు నమోదు చేసింది. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మొదటి ఏడాదిలోనే 53 వేలకుపైగా ఉద్యోగ నియామకాలు చేపట్టింది. గడిచిన పదేండ్లలో ఉద్యోగాల భర్తీ లేక విసిగి వేసారిన నిరుద్యోగుల జీవితాల్లో సరికొత్త మార్పు తెచ్చింది. అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి యూపీఎస్సీ తరహాలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రక్షాళన చేపట్టారు. అప్పటివరకు పెండింగ్ లో ఉన్న పరీక్షలు, ఫలితాలకు ఉన్న అడ్డంకులన్నింటినీ ప్రభుత్వం తొలిగించింది. పదేండ్లుగా ఉద్యోగాల భర్తీ లేనందున యువత నష్టపోకుండా టీజీపీఎస్సీ నియామకాలకు వయో పరిమితిని సడలించింది. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో రద్దయినవి.. వాయిదా పడ్డవి.. పెండింగ్ లో పెట్టిన ఫలితాలన్నింటినీ విడుదల చేసింది. ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందించింది. దేశంలో ఎక్కడా లేని



విధంగా తెలంగాణలో వార్షిక జాబ్ క్యాలెండర్ ను ప్రకటించింది. క్యాలెండర్ ప్రకారం ప్రభుత్వ ఉద్యోగ నియామకాలను నిరంతర ప్రక్రియగా నిర్వహించే వినూత్న విధానాన్ని అమల్లోకి తెచ్చింది. బీఆర్ఎస్ హయాంలో పదేండ్లలో ఒకేసారి డీఎస్సీ వేసి 7857 టీచర్ పోస్టులు భర్తీ చేస్తే... కొత్త ప్రభుత్వం కేవలం పది నెలల వ్యవధిలోనే 11062 పోస్టులతో మెగా డీఎస్సీ 2024 నిర్వహించింది. జూలైలో పరీక్షలు నిర్వహించి, రికార్డు వేగంతో సెప్టెంబర్ 30వ తేదీన ఫలితాలను వెల్లడించింది. ఎంపికైన అభ్యర్థులకు దసరా పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నియామక పత్రాలు అందించారు. వీరిలో 10006 మంది ఉద్యోగాల్లో చేరారు. రెసిడెన్షియల్ సొసైటీల పరిధిలో టీజీటీ, పీజీటీ, జూనియర్ లెక్చరర్లు, డిగ్రీ కాలేజీ లెక్చరర్ పోస్టులన్నీ కలిపి.. కొత్త ప్రభుత్వం 8,304 మందికి నియామక పత్రాలను అందించింది. పేపర్ లీకేజీతో గందరగోళంగా మారిన గ్రూప్ 1 పరీక్షను కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేసింది. 563 పోస్టులతో కొత్త నోటిఫికేషన్ ఇచ్చింది. గ్రూప్ 1 ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలను విజయవంతంగా నిర్వహించింది. షెడ్యూలు ప్రకారం నవంబర్లో గ్రూప్ 3 పరీక్షలు నిర్వహించింది. డిసెంబర్ 15, 16 తేదీల్లో గ్రూప్ 2 పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేసింది. టీజీపీఎస్సీ వివిధ నోటిఫికేషన్ల ద్వారా ఈ ఏడాదిలో 3,393 ఉద్యోగ నియామకాలు చేపట్టింది. ఇరిగేషన్ విభాగంలో 687 మంది ఏఈఈలకు, రవాణా శాఖ పరిధిలో 96 మంది ఏఎంవీఐలకు ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి స్వయంగా నియామక పత్రాలు అందించారు. గత ప్రభుత్వం పెండింగ్ లో పెట్టిన గ్రూప్ 4 తుది ఫలితాలను టీజీపీఎస్సీ వెల్లడించింది. మొత్తం 8143 మంది ఎంపికైన అభ్యర్థులకు ప్రజా ప్రభుత్వం తొలి విజయోత్సవాల సందర్భంగా నియామక పత్రాలు అందించనుంది. పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు ద్వారా కానిస్టేబుల్ పోస్టుల నియామకాలకు ఉన్న అడ్డంకులన్నింటినీ ప్రభుత్వం అధిగమించింది. ఎంపికైన 16067 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందించింది. మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్మెంట్ బోర్డు అధ్వర్యంలో 7094 మంది స్టాఫ్ నర్స్ ల నియామకాలు విజయవంతంగా పూర్తి చేసింది. వీరిలో 6956 మందికి ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చింది. ఇటీవలే 1,284 ల్యాబ్ టెక్నిషియన్, 2,050 నర్సింగ్ ఆఫీసర్ (స్టాఫ్ నర్స్) పోస్టులు, 633 ఫార్మసిస్ట్ (గ్రేడ్ 2) పోస్టుల భర్తీ నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. మొత్తం 5378 పోస్టుల నియామకాలు వివిధ దశల్లో ఉన్నాయి. మరికొన్ని నోటిఫికేషన్లు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. కొత్త ఉద్యోగులతో ఆయా శాఖల్లోనూ సుదీర్ఘకాలం తర్వాత నూతన ఉత్సాహం కనబడుతోంది.



# తెలుగు సామెతలు

1. అంత్యనిష్ఠూరం కన్నా ఆది నిష్ఠూరం మేలు
2. అంబలి తాగే వారికి మీసాలు యెగబట్టేవారు కొందరా
3. అడిగేవాడికి చెప్పేవాడు లోకువ
4. అత్తలేని కోడలుత్తమురాలు కోడల్లేని అత్త గుణవంతురాలు
5. అనువు గాని చోట అధికులమనరాదు
6. అభ్యాసం కూసు విద్య
7. అమ్మబోతే అడివి కొనబోతే కొరివి
8. అయితే ఆదివారం కాకుంటే సోమవారం
9. ఆలూ లేదు చూలు లేదు కొడుకు పేరు సోమలింగం
10. ఇంట్లో ఈగల మోత బయట పల్లకీల మోత
11. ఇల్లు కట్టి చూడు పెళ్ళి చేసి చూడు
12. ఇంట గెలిచి రచ్చ గెలువు



# దేశం చూపు.. మహారాష్ట్ర వైపు

## దిగ్గజాల రణం.. మహాయుతి vs మహావికాస్ అఘాడీ

దేశవ్యాప్తంగా ఉత్కంఠ రేపిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు శనివారం వెలువడనున్నాయి. వీటితోపాటు నాందేడ్ లోక్‌సభ స్థానానికి జరిగిన ఉపఎన్నిక ఓట్ల లెక్కింపు కూడా శనివారమే జరగనుంది. ఓట్ల లెక్కింపు కోసం మహారాష్ట్రవ్యాప్తంగా 288 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిని పర్యవేక్షించేందుకు 288 మంది పరిశీలకులను ఈసీ నియమించింది. ఉదయం 8 గంటలకు కౌటింగ్ ప్రారంభం కానుంది. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కించి తర్వాత ఈవీఎం ఓట్లను లెక్కించనున్నారు. నవంబర్ 26తో మహారాష్ట్ర అసెంబ్లీ గడువు ముగుస్తున్న నేపథ్యంలో గెలిచిన కూటమి 72 గంటల్లోగా ప్రభుత్వాన్ని చేయాల్సి ఉంది.

### గెలుపెవరిదో?

మహారాష్ట్రలో నవంబర్ 20న 288 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. మొత్తం 66.05 శాతం పోలింగ్ నమోదైంది. అదే రోజు నాందేడ్ లోక్‌సభ స్థానానికి జరిగిన ఉపఎన్నికలో 67.81 శాతం పోలింగ్ నమోదైంది. ఈ ఎన్నికల్లో అధికార మహాయుతి కూటమిలోని బీజేపీ 149, శివసేన శిందే పార్టీ 81, ఎన్‌సీపీ అజిత్ పవార్ వర్గం 59 స్థానాల్లో పోటీ చేశాయి. ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) కూటమిలోని కాంగ్రెస్ 101, శివసేన-యూబీటీ 95, ఎన్‌సీపీ-ఎస్పీ 86 స్థానాల్లో బరిలోకి దిగాయి. మహారాష్ట్రలో అధికారం చేపట్టడానికి 145 స్థానాల్లో విజయం సాధించాల్సి ఉంది.

### కాంగ్రెస్ అలర్ట్

మహారాష్ట్ర, ఝార్ఖండ్ ఎన్నికల ఫలితాలు శనివారం వెల్లడికానున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ కీలక చర్యలు తీసుకుంది. ఎన్నికల అనంతర పరిస్థితులను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా పరిశీలకులను నియమించింది. కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, అశోక్ గహ్లోత్, భూపేశ్ బఘేల్, డాక్టర్ జి.పరమేశ్వరను మహారాష్ట్ర ఏఐసీసీ పరిశీలకులుగా నియమించింది. తారిఖ్ అన్వర్, మల్లు భట్టివిక్రమార్క, కృష్ణ అల్లవూరును ఝార్ఖండ్ కు ఏఐసీసీ పరిశీలకులుగా పంపింది.

## ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో

# గెలుపు ఎవరిది?

## మ్యాజిక్ మార్క్ అధిగమించేది ఎవరు?



**మహా:** ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు శనివారం వెలువడనున్నాయి. ఎన్‌డీఏ, ఇండియా కూటముల మధ్య నెలకొన్న ద్విముఖ పోరులో ఎవరిని విజయం వరిస్తుందో కొద్ది గంటల్లో తెలిపోనుంది. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్లతో ఓట్ల లెక్కింపు మొదలు పెట్టనున్నట్లు ఈసీ వెల్లడించింది. ఝార్ఖండ్‌లో మొత్తం 81 అసెంబ్లీ స్థానాలుండగా, 41 మ్యాజిక్ మార్కును ఎవరు అధిగమిస్తారో చూడాలి.

**ఎవరు గెలుస్తారు?**

అధికార ఝార్ఖండ్ ముక్తిమోర్చాజెఎంఎం, కాంగ్రెస్ కూటమి, ప్రతిపక్ష ఎన్డీఏ భవితవ్యం శనివారం తేలనుంది. ఈ ఫలితాల కోసం రెండు కూటముల నేతలు ఆసక్తి ఎదురుచూస్తున్నారు. 2000 సంవత్సరం నవంబర్ 15న ఝార్ఖండ్ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల వరకు చూసుకుంటే, ఈసారే ప్రజలు అత్యధికంగా ఓట్లు వేశారు. రికార్డు స్థాయిలో 67.74 శాతం పోలింగ్ నమోదైంది. ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు చేసిన ఎన్నికల సంఘం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి విడివిడిగా పరిశీలకులను నియమించింది. లెక్కింపు ప్రక్రియను నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ప్రతి కౌంటింగ్ టేబుల్‌కు ఒక ఏఆర్ఓను నియమించినట్లు ఎన్నికల ప్రధానాధికారి తెలిపారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య మీడియా ప్రతినిధులు, అభ్యర్థులు లేదా వారి ఏజెంట్‌ల సమక్షంలో ఓట్ల లెక్కింపు జరగనున్నట్లు వెల్లడించారు. ఉదయం 8 గంటల నుంచి పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని, తర్వాత ఈవీఎంలలో ఓట్లు లెక్కిస్తామని తెలిపారు. 9 గంటల తర్వాత నుంచి ఫలితాల సరళి వెలువడే అవకాశం ఉందని పేర్కొన్నారు.

**పోలింగ్ రెండువిడతలుగా**

ఝార్ఖండ్‌లోని 81 అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 13, 20 తేదీల్లో రెండు విడతల్లో పోలింగ్ జరిగింది. తొలి విడతలో 43 నియోజకవర్గాల్లో ఎన్నికలు జరగగా, మిగిలిన 38 స్థానాలకు రెండో విడతలో ఓటింగ్ నిర్వహించారు. ఈ ఎన్నికల్లో అధికార జేఎంఎంకాంగ్రెస్ కూటమి, ప్రతిపక్ష బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమికి మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఎట్టిపరిస్థితుల్లోనూ అధికారాన్ని నిలబెట్టుకోవాలని జేఎంఎం ఎన్నికల బరిలో నిలవగా, తిరిగి ఝార్ఖండ్ సీఎం పీఠాన్ని దక్కించుకోవాలని ఈ ఎన్నికల్లో బీజేపీ సర్వశక్తులు ఒడ్డింది. ఈ నేపథ్యంలో తాజాగా వెలువడిన ఎగ్జిట్ పోల్స్ బీజేపీ కూటమికే అధికారం దక్కే అవకాశముందని అంచనా వేశాయి. జేఎంఎం నేతృత్వంలోని మహాఘట్‌బంధన్ మాత్రం తాము అధికారం నిలబెట్టుకుంటామని ధీమాతో ఉంది.

**కీలక స్థానాలివే**

ఈ ఎన్నికల్లో ప్రముఖ నాయకుల భవితవ్యాన్ని నిర్ణయించే కొన్ని స్థానాలపై అందరి దృష్టి నెలకొంది. ఈ ఫలితాల్లో మొత్తం 12,011 మంది అభ్యర్థుల భవిష్యత్తు తేలనుంది. సీఎం హేమంత్ సోరెన్ బర్‌హైట్ నియోజకవర్గం నుంచి బరిలో నిలవగా, ఆయన భార్య కల్పనా సోరెన్ గాండే స్థానం నుంచి పోటీ చేశారు. ఝార్ఖండ్ బీజేపీ నాయకుడు ప్రతిపక్షనేత అమర్ కుమార్ బౌరీ చందన్‌కియారీ నియోజకవర్గంలో బరిలో నిలిచారు. ధన్‌వార్ నుంచి బీజేపీ నేత బాబులాల్ మారాండి, నాలా నుంచి స్పీకర్ రబీంద్ర నాథ్, మహాగామా స్థానం నుంచి కాంగ్రెస్ నేత దీపిక పాండే సింగ్, జేఎంఎం నుంచి బీజేపీలోకి వెళ్లిన హేమంత్ సోరెన్ వదిన సీతా సోరెన్ జాంతారా స్థానం నుంచి పోటీకి దిగారు. సరాయ్‌కెలా నుంచి మాజీ సీఎం చంపయీ సోరెన్ బీజేపీ అభ్యర్థిగా పోటీలో ఉన్నారు.

# రంగుల కలయిక

**ఇంటి అలంకరణలో ఫొటోలు, ఫ్లవర్ వాజ్‌లు, వస్తువులు ఎంత ముఖ్యపాత్ర పోషిస్తాయో.. గోడకు వేసే రంగులు కూడా అంతే ముఖ్యమని గ్రహించాలి. బెడ్‌రూమ్‌లో వేసే రంగుల కాంబినేషన్ అభిరుచులను తెలియజేయడమే కాదు.. నిద్ర నాణ్యతను కూడా శాసిస్తుందని పలు అధ్యయనాల్లో తేలింది. పడక గదిలో రెండు రంగుల కాంబినేషన్ వేసుకుంటే.. ఉభయ కుశలోపరిగా ఉంటుందని నిపుణులు సెలవిస్తున్నారు. ఆ రంగుల హంగులు దంపతుల్లో నవీన ఉత్సాహాన్ని కలిగిస్తాయని సెలవిస్తున్నారు.**

లావెండర్, హాఫ్ వైట్ కాంబినేషన్ పెయింట్లు పడక గది లుక్‌ను సమూలంగా మార్చేస్తుంది. లావెండర్ రంగు కొత్త ఆలోచనలు రేకెత్తిస్తుంది. కలర్ సైకాలజీ ప్రకారం ఈ రంగు మనసుకు ప్రశాంతతను కలిగిస్తుంది. హాఫ్‌వైట్‌తో ఈ రంగు జతకడితే.. ఉడుకు నెత్తురును మరింత ఉద్రేకపరుస్తుందట. తెలుపు, నీలం రంగుల కాంబినేషన్ ఎప్పుడూ హైలైట్‌గానే నిలుస్తుంది. హై గ్లో నేవీ బ్లూ పెయింట్ పడక గది లుక్‌ను మార్చేస్తుంది. గోడలకు తెల్లరంగు వెల్లె వేస్తే.. గది విశాలంగా కనిపిస్తుంది. వైట్ అండ్ బ్లూ షేడ్స్ కలగలిపి వేస్తే.. శృంగార భావనలు పెరుగుతాయట. మిల్క్ వైట్ రంగు వేసిన గోడలకు పీచ్ కలర్ జోడిస్తే గదంతా ఆకర్షణీయంగా మారుతుంది. గోడలకు పీచ్ రంగు వేసినప్పుడు పిల్లర్స్ ప్లేస్‌లో తెల్లరంగు వేస్తే లుక్ అదిరిపోతుంది. ఈ జోడు రంగులు ఆ గదిలో నిద్రించే జోడీని మాయ చేస్తాయట. లైమ్ గ్రీన్, పింక్ కలర్స్ కాంబినేషన్ రిచ్ లుక్ ఇస్తుంది. గ్రీన్ ప్రశాంతమైన అనుభూతిని అందిస్తే, గులాబీ రంగు శృంగారానికి సిద్ధం అవ్వమని ప్రేరేపిస్తుంది. బర్గండి, లేత గోధుమ కలర్ కాంబినేషన్ గదిని ప్రకాశవంతంగా మారుస్తాయి. ఈ కాంబో తాజా భావనలు కలిగిస్తుంది. రొమాంటిక్ ఫీలింగ్స్‌కు ఊతమిస్తుంది.



## రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
editor@mahaadaily.com |
whatsapp-
7436939999

# జిల్లాలో 75.15శాతం సమగ్ర సర్వే పూర్తి

### - జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



**ఖమ్మం, నవంబర్ 22, మహా:** జిల్లాలో నవంబర్ 21 నాటికి 75.15 శాతం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పూర్తయినట్లు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. శుక్రవారం సర్వే ఎన్యుమరేటర్ లు కలెక్టర్ క్యాంపు కార్యాలయానికి చేరుకుని, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కుటుంబ సర్వే నిర్వహించారు. సర్వే సిబ్బందికి కలెక్టర్ పూర్తిగా సహకరిస్తూ వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో హౌస్ లిస్టింగ్ చేసిన మొత్తం 5 లక్షల 67 వేల 338 ఇండ్లను సర్వే కోసం గుర్తించామని, నవంబర్ 21 నాటికి 4129 ఎన్యుమరేటర్ బ్లాక్ పరిధిలో మొత్తం 4 లక్షల 26 వేల 333 ఇండ్ల సర్వే పూర్తయిందని అన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఖమ్మంలో 54.96 శాతం, పాలేరులో 80.93 శాతం, మధిరలో 80.66 శాతం, వైరాలో 88.54 శాతం, సత్తుపల్లిలో 88.54 శాతం, జిల్లా వ్యాప్తంగా 75.15 శాతం సర్వే పూర్తయిందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో పెండింగ్ సర్వే ప్రక్రియ సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజల నుంచి సేకరించిన సమాచారం పకడ్బందీగా భద్రపర్చాలని, డేటా ఎక్కడా లీక్ కాకుండా చూసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ట్రాన్స్ జెండర్లకు స్వయం సహాయక సంఘాలు

- ట్రాన్స్ జెండర్ లు ఆత్మ గౌరవంతో జీవించాలి
- ఖమ్మం కార్పోరేషన్ పరిధిలో 2 చోట్ల స్త్రీ టీ స్టాల్స్
- ట్రాన్స్ జెండర్లతో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్





**ఖమ్మం, నవంబర్ 22, మహా:** ట్రాన్స్ జెండర్ లు ఆత్మగౌరవంతో జీవించేందుకు సంపూర్ణ సహకారం అందిస్తామని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజతో కలిసి ట్రాన్స్ జెండర్ లతో సమావేశమయ్యారు. ట్రాన్స్ జెండర్ లకు ఆధార్ కార్డు జారీ, పేరు మార్పు విధానం, అర్హులైన వారికి రేషన్ కార్డులు, పెన్షన్, నూతన ఎస్.హెచ్.జి. ల ఏర్పాటు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ట్రాన్స్ జెండర్ ల సంక్షేమానికి చర్యలు చేపడతామని అన్నారు. ఆధార్ కార్డులు లేనివారికి ఆధార్ కార్డుల జారీకి చర్యలు తీసుకోవాలని అన్నారు. పేరు మార్చుకోవాలనుకుంటే చేయాల్సిన చర్యలపై అవగాహన కల్పించాలన్నారు. రేషన్ కార్డు కోసం ట్రాన్స్ జెండర్ లు దరఖాస్తు చేసుకోవాలని, ప్రభుత్వ మార్గదర్శకాలు ప్రకారం నూతన రేషన్ కార్డులు మంజూరు సమయంలో అర్హులైన వారికి రేషన్ కార్డులు అందిస్తామని కలెక్టర్ తెలిపారు. ట్రాన్స్ జెండర్లకు ప్రత్యేకంగా ప్రభుత్వం నుండి ఎటువంటి పెన్షన్ పథకం లేదని, ఒంటరి మహిళల కోట క్రింద పెన్షన్ మంజూరుకు దరఖాస్తులు సమర్పిస్తే, మంజూరుకు చర్యలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. స్వశక్తి మహిళా సంఘాల తరహాలో ట్రాన్స్ జెండర్లు సంఘాలుగా ఏర్పాటయితే వ్యాపార యూనిట్ల ఏర్పాటుకు రుణాలు అందిస్తామని అన్నారు. ఖమ్మం నగర పరిధిలో 13 చోట్ల స్త్రీ టీ లను ఏర్పాటు చేయనున్నట్లు, వీటిలో 2 చోట్ల ట్రాన్స్ జెండర్ లకు అవకాశం కల్పిస్తామని, మరో నాలుగు ఇతర వ్యాపార యూనిట్ల ఏర్పాటుకు సహకారం అందిస్తామని, ట్రాన్స్ జెండర్ లు చర్చించుకుని, ఎటువంటి వ్యాపారం ప్రారంభించాలో ఆలోచించుకోవాలని కలెక్టర్ సూచించారు. ట్రాన్స్ జెండర్లకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు కృషి చేయనున్నట్లు కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి కె. రాంగోపాల్ రెడ్డి, డీఆర్డీవో ఎస్. సన్యాసయ్య, డీఆర్వో ఎం. రాజేశ్వరి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ముమ్మరంగా టీడీపీ సభ్యత్వం



**ఇల్లందు, నవంబర్ 22, మహా:** తెలుగుదేశం పార్టీ బలోపేతంలో భాగంగా 202426 సంవత్సరానికి మున్సిపల్ పరిధిలోని వార్డులలో ముమ్మరంగా సభ్యత్వ నమోదు కొనసాగుతుందని మహబూబాబాద్ పార్లమెంట్ ఆడహాక్ కమిటీ సభ్యులు ముద్రగడ వంశీ పేర్కొన్నారు. శుక్రవారం పలు వార్డులలో సభ్యత్వాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ముద్రగడ వంశీ మాట్లాడుతూ గతంలో ఉన్న సభ్యత్వాలను రెన్యూవల్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. పార్టీలో నూతన సభ్యత్వాలను పెంచడం జరుగుతుందన్నారు. తెలుగుదేశం పార్టీ సభ్యులందరూ సభ్యత్వం తీసుకోవాలని కోరారు. తెలుగుదేశం పార్టీ కోసం ప్రతి ఒకరు కష్టపడి పని చేయాలని, రానున్న కాలంలో తెలుగుదేశం పార్టీ బలమైన శక్తిగా ఎదుగుతుందని, మరల పూర్వ వైభవం దిశగా దూసుకోపోతుందని తెలిపారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకున్నా వారికి రూ. 5లక్షల ఇన్సూరెన్స్ వర్తిస్తుందన్నారు. రేపటి నుండి ప్రతి గ్రామంలో సభ్యత్వం కార్యక్రమం జరుగుతుందని అందరు సభ్యత్వం నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చాందావత్ రమేష్ బాబు, మాటేలా రత్నాకర్, ప్రజలు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**మంగపేట, మహా:** ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను శుక్రవారం మండల కేంద్రంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మైల జయరామ్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యణయ్య, జిల్లా సెక్రటరీ తుడి భగవాన్ రెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షులు ముత్తినేని ఆదినారాయణ, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు చాద మల్లయ్య, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు టీవీ హైదయ్ తుల్లా, గ్రామ కమిటీ అధ్యక్షులు సదయ్ హుసేన్,మండల సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బడిశా ఆదినారాయణ, గంగినేని శేషగిరి, గంగెర్ల నాగరాజు, మూర్తి, గాదె సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగూడెంలో కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాం



**కొత్తగూడెం, నవంబర్ 22, మహా:** జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్ ఆధ్వర్యంలో శుక్రవారం కొత్తగూడెం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కూలీ లైన్ లో కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాంను నిర్వహించారు. ఇందులో భాగంగా మొత్తం సుమారుగా 250 ఇండ్లలో సోదాలు చేసి సరైన పత్రాలు లేకుండా నెంబర్ ప్లేట్లు లేని 16 వాహనాలను సీజ్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. అదేవిధంగా 11 వాహనాలకు 2400 రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు. ఇద్దరు బెల్ట్ షాపు నిర్వాహకుల నుండి సుమారుగా 14,000 రూపాయల మద్యం బాటిల్లను సీజ్ చేసి అనంతరం కూలీ లైన్ కాలనీ వాసులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి ఆయన పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్ట వ్యతిరేక మరియు సాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల గురించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసువారికి సమాచారం అందించాలని కోరారు. తమ ప్రాంతంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. మట్కా, జూదం, బెట్టింగ్, గంజాయి రవాణా వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేయడమైనదని తెలిపారు. ఇట్టి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల సమాచారం తెలిపినవారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సుమారుగా 100 మందికి పైగా పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# ఆపదలో అండగా జారె



**అశ్వారావుపేట, నవంబర్ 22, మహా:** అశ్వారావుపేట నియోజకవర్గానికి చెందిన 64 మంది ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన వారి దరఖాస్తులను విభాగాధికారుల చేతుల మీదుగా స్వయంగా అందజేసిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. చికిత్స ఖర్చులను భరించే స్థోమత లేని స్థితిలో సీఎంఆర్ఎఫ్ తమకు ఎంతో మేలు చేస్తుందన్నారు. ఎమ్మెల్యే తమ ఆర్జీలను స్వయంగా తీసుకెళ్లి పరిష్కారం పొందేందుకు సహకరించడం ఎంతో ఆదరణీయమైంది అని లబ్ధిదారులు అభిప్రాయపడ్డారు. సహాయం పొందినవారు కృతజ్ఞతలు తెలుపుతూనే, ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నవారు తమకు కూడా సీఎంఆర్ఎఫ్ సాయం వస్తుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఆదినారాయణ ప్రజల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆపదలో ఉన్న కుటుంబాలకు సహాయం అందించడంలో ముందుంటున్నారని పలువురు తెలిపారు.

# ఉచిత వైద్య శిబిరం



**మణుగూరు, నవంబరు 22, మహా:** ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో అన్ని ఏరియాలలో ఉన్న సింగరేణి ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులతోపాటు పరిసర ప్రాంత వాసుల ఆరోగ్య సౌకర్యార్థం ఆయుర్వేద వైద్య వైద్య శిబిరాలను నిర్వహిస్తుంది. "మాత రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద" హైదరాబాద్ వారి సౌజన్యంతో కొత్తగూడెం ఏరియాలో ఉచిత ఆయుర్వేద శిబిరాన్ని ఈ నెల 23న (శనివారం) ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు రుద్రంపూర్ సేవా సెంటర్ నందు, ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వహించబడునని కొత్తగూడెం జనరల్ మేనేజర్, ఎం.షాలెం రాజు ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాదుకు చెందిన డాక్టర్ విశ్వనాథ మహర్షి ఫోన్ నెంబర్ 9849574706 చే ఈ ఉచిత ఆయుర్వేద మెడికల్ క్యాంపు నిర్వహించబడునని, డాక్టర్ ఉచిత వైద్య పరీక్ష నిర్వహించి తగిన ఆయుర్వేద మందులను ఎటువంటి లాభపేక్ష లేకుండా తగు మూల్యంతో ఇవ్వడం జరుగుతుంది అని తెలియజేశారు. డెంగ్యూ, వైరల్, ఫీవర్, బిపి, మధుమేహం, చర్మవ్యాధులు, క్యాన్సర్, ఎయిడ్స్, దీర్ఘకాలిక వ్యాధులన్నిటి నుండి ఎలా కాపాడుకోవాలో పాటించవలసిన పద్ధతులు సూచనలు, సలహాలు ఇస్తారని తెలియజేశారు. కొత్తగూడెం పరిసర ప్రజలు, కార్మికులు వారి కుటుంబ సభ్యులు ఈ ఉచిత ఆయుర్వేద శిబిరంలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కొత్తగూడెం ఏరియా జీఎం ఎం. షాలెం రాజు కోరారు.

# బొగ్గు గనుల విస్తరణకు అనుమతులు సాధించాలి

### - ఎంపీ బలరాం నాయక్ కు వినతి



**మణుగూరు, నవంబరు 22, మహా:** మణుగూరు మనుగడకై సింగరేణి ఆధ్వర్యంలో కొత్త బొగ్గు గనుల ఏర్పాటు, ఉన్నగనులకు విస్తరణ అనుమతులు సాధించాలని కోరుతూ పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు సహకారంతో ఐఎఫ్టీయూ అధ్యర్యంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి, మహబూబాబాద్ ఎంపీ పొరిక బలరాంకి శుక్రవారం వినతి పత్రాలు అందజేసినట్లు ఐఎఫ్టీయూ అనుబంధ గోదావరిలోయ బొగ్గుగని కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నాజర్ పాషా విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో ప్రస్తుతం బొగ్గు ఉత్పత్తి ప్రక్రియ కొనసాగుతున్న ఓసి గనులు మూత పడనున్నాయని, కొత్త గనులు ప్రారంభం కాకపోతే మణుగూరు ఏరియా మనుగడ ప్రశ్నార్థకం అయ్యే అవకాశం ఉందన్నారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం మణుగూరులో కొత్త గనుల ఏర్పాటుకు సత్వర చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉన్న గనులకు విస్తరణ అనుమతులు సాధించాలన్నారు. అన్ని గనులు సింగరేణి ఆధ్వర్యంలోనే నడిపించాలని ప్రజాప్రతినిధులను కోరినట్లు ఆయన తెలిపారు. దీంతోపాటు మణుగూరుకు వరద ముంపు నివారిస్తూ శాశ్వత పరిష్కారం చూపాలని, ఇటీవల భారీ వర్షాలకు వరద ముంపునకు గురై సర్వం కోల్పోయిన నిరాశ్రయులకు ఇందిరమ్మ పక్కా ఇల్లు నిర్మించాలని కోరారు. అలాగే సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, సింగరేణి భూ నిర్వాసితులకు, ప్రభావిత గ్రామాల యువతకు, సింగరేణి డిపెండెంట్ లకు, స్థానికులకు సింగరేణి ఓబీ కంపెనీలలో, సెక్యూరిటీ మరియు ఇతర సివిల్ కాంటాక్ట్ పనులలో ఉపాధి అవకాశాలు కల్పించాలని, మణుగూరులో ట్రాఫిక్ నివారణకు ఆటోనగర్ ఏర్పాటు చేయాలని పదవీ విరమణ చేసిన సింగరేణి కార్మికులు మణుగూరులో ఐదు సెంట్ల భూమిలో గృహ నిర్మాణం చేపడితే ఇబ్బందులు లేకుండా చూడాలని కోరినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడిపూడి కోటేశ్వరరావు, ఎస్ డి హుమాయూన్లు పాల్గొన్నారు.

# ప్రజాపాలన ప్రచార రథాలు ప్రారంభం



**ఇల్లందు, నవంబర్ 22, మహా:** రాష్ట్ర ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదేశాల మేరకు ప్రజా పాలన విజయోత్సవ వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కాలంలో ప్రభుత్వం విజయవంతంగా ప్రవేశపెట్టి అమలుపరుస్తున్న ప్రభుత్వ పథకాలపై విస్తృతంగా ప్రచారం నిర్వహించేందుకు రెండు ప్రచార రథాలను అందుబాటులోకి తెచ్చారు. శుక్రవారం వాటిని ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, సుజాతనగర్ మండల పరిధిలో తహశీల్దార్ శిరీష ప్రారంభించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక మండలి కళాజాత బృందాలు రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ఆట పాటలతో ప్రదర్శనలు ఇస్తూ ప్రజలకు వివరిస్తున్నారు.

# 3 ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన సమ్మక్క



**అశ్వారావుపేట/దమ్మపేట, నవంబర్ 22, మహా:** దమ్మపేట మండల కేంద్రంలోని జీసీసీ హమాలీగా పనిచేస్తున్న బోగి సత్యం, అంగన్వాడీ కార్యకర్త బోగి రమణ దంపతుల పెద్ద కుమార్తె సమ్మక్క తన కృషితో విశేష విజయాలు సాధిస్తోంది. నిరంతర శ్రమతో మూడు ప్రభుత్వ ఉద్యోగాలను సాధించిన సమ్మక్క, తన తల్లిదండ్రులకు గర్వకారణమైంది. సమ్మక్క మొదటగా సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికైంది. ఆపై గ్రూప్ 4 జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ద్వారా జీసీసీలో సేవలు ప్రారంభించింది. తాజాగా జూనియర్ లెక్చరర్ (గెజిటెడ్) ఉద్యోగాన్ని సాధించి ఆదర్శంగా నిలుస్తుంది. తన విజయాలకు తల్లిదండ్రుల సహకారం, కుటుంబ ప్రోత్సాహమే ప్రధాన కారణమని సమ్మక్క పేర్కొంది. సివిల్స్ సాధించడమే తన తదుపరి లక్ష్యమని వెల్లడించిన ఆమె, మరింత ముందుకు సాగాలని సంకల్పించింది. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబానికి చెందిన సమ్మక్క విజయాలు యువతకు ప్రేరణగా నిలుస్తున్నాయి అని పలువురు అభినందిస్తున్నారు.

# అధిక ఫీజులను అరికట్టాలి : ఎస్ఎఫ్ఐ



**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, నవంబర్ 22, మహా:** ప్రైవేట్ కళాశాలలో అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలని, విద్యార్థుల నుండి అక్రమంగా ఫీజులను వసూలు చేస్తున్న విద్యా సంస్థలపై అధికారులు చర్యలు చేపట్టాలని, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి వీరభద్రం డిమాండ్ చేశారు. శుక్రవారం లక్ష్మీదేవిపల్లిలోని పులిపాటి నర్సింగ్ కళాశాలలో వసూళ్లు చేస్తున్న అక్రమ ఫీజులను ఆపాలని, ఇంటర్న్ షిప్ పేరుతో పేద విద్యార్థుల నుండి వసూళ్లు చేసిన 24 వేల రూపాయలు తిరిగి ఇవ్వాలని కోరుతూ కళాశాల ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బైఠాయించారు. ఈ సందర్భంగా వీరభద్రం మాట్లాడుతూ.. పులిపాటి నర్సింగ్ కళాశాలలో ఇంటర్న్ షిప్, కండోనేషన్ ఫీజు పేరుతో అక్రమంగా ఒక్కో పేద విద్యార్థి తల్లిదండ్రుల నుండి 24 వేల రూపాయలు ఫీజులు వసూళ్లు చేస్తున్నారన్నారు. పరీక్ష ఫీజులు ఇంటర్మీడియట్ బోర్డు, పారామెడికల్ బోర్డు నిర్ణయించిన ఫీజులకు అదనంగా వసూళ్లు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా ఇంటర్మీడియట్, పారామెడికల్ బోర్డుల కళాశాలలు ఒకే కళాశాలలో నిర్వహిస్తున్నారని, కళాశాలలో అర్హులైన సిబ్బంది లేరనీ, ల్యాబ్, ఫైర్ సేఫ్టీ లేవనీ పేర్కొన్నారు. కేవలం ఫీజుల కొరకే కళాశాలను నిర్వహిస్తున్నారని, ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే కళాశాల యాజమాన్యంపై అధికారులు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, కఠిన చర్యలు తీసుకోవాలని, పేద విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. తల్లిదండ్రులెవరూ ఇంటర్న్ షిప్ ఫీజులు, అదనపు పరీక్ష ఫీజులు చెల్లించొద్దని సూచించారు. వసూళ్లు చేసిన అక్రమ ఫీజులు విద్యార్థులకు తిరిగి ఇచ్చేవరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మందా నాగకృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ రామ్ చరణ్, జిల్లా నాయకులు పి.పవన్, ఎండీ నాహీద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# అక్రిడేషన్ కమిటీలో అవకాశం కల్పించండి



**ములుగు, మహా:** అక్రిడేషన్ కమిటీలో ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్టులకు అవకాశం కల్పించాలని కోరుతూ ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు భానోత్ వెంకన్న ఆధ్వర్యంలో ములుగు జిల్లా కలక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ జిల్లా అక్రిడేషన్ కమిటీలో ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ సభ్యులకు అవకాశం కల్పించాలని, ప్రభుత్వం డిసెంబర్ నెలలో గిరిజన జర్నలిస్టులకు నిర్వహించబోతున్న శిక్షణ తరగతులలో వర్కింగ్ జర్నలిస్టులందరికీ అవకాశం కల్పించాలని కోరారు. వినతిపత్రం అందించినవారిలో గౌరవ అధ్యక్షులు భూక్యా సునీల్, కార్యదర్శి ముకులోత్ శరత్, వర్కింగ్ ప్రెసిడెంట్ నేతావత్ సుధాకర్, ఉపాధ్యక్షుడు పోరిక సునీల్, లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

# పేదల కోసం ఇందిరమ్మ ఇళ్లు

### - పైలట్ ప్రాజెక్ట్ సర్వే ప్రారంభం



**అశ్వారావుపేట/ములకలపల్లి, నవంబర్ 22, మహా:** ములకలపల్లి మండలం ముత్యాలంపాడు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడం ద్వారా పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. ఈ ప్రాజెక్టులో భాగంగా, నేడు అధికారుల ఆధ్వర్యంలో సర్వే ప్రక్రియ ప్రారంభమైంది. కార్యక్రమానికి మండల రెవెన్యూ అధికారి గుడ్ల పుల్లారావు, ఎంపీ ఓ లక్ష్మయ్య, సర్వే ప్రత్యేక అధికారులు, పలువురు కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా, లబ్ధిదారుల ఎంపిక పద్ధతిపై అధికారులు వివరణ ఇచ్చారు. గ్రామస్తుల సామాజిక, ఆర్థిక స్థితి ఆధారంగా ఎంపికను పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రత్యేక సాంకేతిక పద్ధతులు అనుసరిస్తున్నట్లు తెలిపారు. అర్హుల గుర్తింపునకు గ్రామసభల సూచనలను పాటించి, తహసీల్దార్ ధ్రువీకరణ ప్రక్రియలో భాగంగా అన్ని వివరాలను పరిశీలిస్తారు. ఇందిరమ్మ ఇళ్ల ప్రాజెక్టు కింద తొలిదశలో ప్రతి నియోజకవర్గానికి 3,500 4,000 ఇళ్లు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇంటి నిర్మాణానికి అవసరమైన ఉచిత ఇసుక, రాయితీపై సిమెంట్, స్టీల్ సరఫరా వంటి అంశాలను రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తోంది. పేదరికాన్ని మాత్రమే ప్రామాణికంగా తీసుకుని, ఇంటిని యజమానురాలి పేరుపైనే మంజూరు చేయడం ద్వారా మహిళా సాధికారితకు దోహదం చేస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, ఇందిరమ్మ ఇళ్లు మా జీవితాల్లో వెలుగులు నింపుతాయి అని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు ఈ ప్రాజెక్టును పేదల ఆకాంక్షలకు నెరవేరుస్తూ, గ్రామీణ అభివృద్ధికి పునాది వేస్తుందని అభిప్రాయపడ్డారు. ఇది రాజకీయ జోక్యం లేకుండా పూర్తి పారదర్శకంగా జరుగుతుందని అధికారులు హామీ ఇచ్చారు.

# ఆదర్శంగా నిలుస్తున్న గుగులోత్ సురేందర్



**టేకులపల్లి, నవంబర్ 22, మహా:** ఏజెన్సీ మారుమూల ప్రాంతంలోని నిరుపేద కుటుంబం గుగులోత్ సక్రాం సేవీరి దంపతుల చిన్న కుమారుడు గుగులోత్ సురేందర్ జూనియర్ లెక్చరర్ ప్రభుత్వ ఉద్యోగం కైవసం చేసుకుని ఆదర్శంగా నిలిచారు. టీడీపీఎస్సీ ఇటీవల ప్రకటించిన జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో గణిత శాస్త్రం విభాగంలో సురేందర్ ఉద్యోగ సాధించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం టేకులపల్లిలోని తన గురువు టీఎస్టీటీఎఫ్ వ్యవస్థ అధ్యక్షులు ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్ ను కలిశారు. అనంతరం శాలువాతో సన్మానించి స్వీట్స్ తినిపించారు. ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ విద్య పేదరికాన్ని జయించి, ఉన్నత స్థాయికి ఎదగడానికి గొప్ప ఆయుధమని అన్నారు. కృషి, పట్టుదల, క్రమశిక్షణ, నిబద్ధత ఉంటే పేదరికాన్ని జయయించవచ్చని సురేందర్ నాయక్ నిరూపించారన్నారు. సురేందర్ విజయం, కమ్యూనిటీకి, మొత్తం సమాజానికి ప్రేరణ అని అన్నారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షులు ధరావత్ ప్రేమ్ చంద్ నాయక్, సేవాలాల్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు భూక్యా రవి రాథోడ్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధికార ప్రతినిధి బానోత్ నాగరాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# డిసెంబర్ 8న ప్రజారగ్ జోళ్ యాత్ర



**భద్రాచలం ,నవంబర్ 22, మహా :** భద్రాచలం మండలం సుందరయ్య నగర్ కాలనీ నందు సేవాలాల్ సేన భద్రాచలం మండల అధ్యక్షులు బోడా వీరేందర్ నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రజా రగ్ జోళ్ యాత్ర కరపత్రాలను ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్ పాల్గొని కరపత్రాలనుఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మొదటి విడతగా నిర్వహించే ప్రజా రగ్ జోళ్ యాత్ర 9 జిల్లాలలో చేపట్టడం జరిగింది అని వారు తెలిపారు. అందులో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలంలోని సేవాఘడ్ సేవాలాల్ మహారాజ్ మందిరం నుండి డిసెంబర్ 8న మొదలు కాబోతున్నది అని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం మండల ప్రధాన కార్యదర్శి భూక్య కిషన్ నాయక్, భూక్యా రమేష్ నాయక్, బానోత్ శంకర్ నాయక్, వాంకుడోత్ తావునాయక్, భూక్యా రవి, వాంకుడోత్ ప్రతాప్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుంది



**మంగపేట, మహా :** కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు అన్నారు. శుక్రవారం మంగపేట మండలంలోని కమలాపురం గ్రామంలో లక్ష్మణ్ బాబుతోపాటు ఇన్చార్జి బడే నాగజ్యోతి, ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పోరిక గోవింద్ నాయక్, పార్టీ నాయకుడు భూక్యా జంపన్నలు పర్యటించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తల కుటుంబాలను కలిసి వారితో మాట్లాడారు. పార్టీ కార్యకర్తలకు, నాయకలకు ఎలాంటి కష్టం వచ్చినా పార్టీ వారికి అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కాకులమర్రి ప్రదీప్ రావు, కమలాపురం గ్రామ కమిటీ అధ్యక్షుడు తుక్కాని శ్రీనివాస్, ఎస్.కె కుర్బన్ అలీ, గడదాసు సునీల్, తుమ్మ మల్లారెడ్డి, రాంసాయం శ్రీనివాస్ రెడ్డి, ఈసం రామ్మూర్తి, మాదరి రామయ్య, గండేపల్లి నర్సయ్య, చల్లగురుగుల తిరుపతి, గుడివాడ శ్రీహరి, చిలకమర్రి రాజేందర్, యలవర్తి శ్రీనివాస్, చీకుర్తి సుధాకర్, గుడిసేవ నాగేశ్వరావు, మల్లి కంటి శంకర్, పగడాల వెంకట్ రెడ్డి, గూడా ఎల్లారెడ్డి, పంజాల సత్యం, సోషల్ మీడియా ఇంచార్జి బీస్ సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంబో పరిశ్రమల అభివృద్ధికి కృషి

**- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**



**అశ్వారావుపేట/చంద్రుగొండ, నవంబర్ 22, మహా:** చంద్రుగొండ మండలం బెండలపాడు గ్రామంలోని బ్యాంబో క్లస్టర్‌ను జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ శుక్రవారం సందర్శించారు. ఈ క్లస్టర్ బ్యాంబో ఆధారిత పరిశ్రమల అభివృద్ధి, ఉపాధి అవకాశాల సృష్టి, ఉత్పత్తుల ఎగుమతి ప్రోత్సహించడానికి ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కలెక్టర్ తన పర్యటనలో బ్యాంబో ఉత్పత్తుల తయారీ విధానాలను పరిశీలించి, మార్కెటింగ్ అవకాశాలు, అవసరమైన మౌలిక వసతులపై సమీక్ష నిర్వహించారు. గ్రామస్తులు, పంచాయితీ ప్రతినిధులు, స్థానిక వ్యాపారవేత్తలతో చర్చిస్తూ గ్రామ అభివృద్ధి పట్ల ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కార్యక్రమం సందర్భంగా జిల్లా నాయకులు బొజ్యా నాయక్ కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి చంద్రుగొండ మండల సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా జిల్లా దిశా కమిటీ సభ్యులు బొర్ర సురేష్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధారా గోవిందరెడ్డి, సీనియర్ నాయకులు కారం సైదులు, కృష్ణయ్య, యువ నాయకులు రాజేష్, బోడా శీను తదితరులు పాల్గొన్నారు.

# మిరప పంట రక్షణ చర్యలపై అవగాహన



**కొనిజర్ల, నవంబర్ 22, మహా:** కొణిజర్ల మండలం చిన్న గోపతి గ్రామంలో మిరప పంటల్లో "కొమ్మ కుళ్ళుడు" వ్యాధి వ్యాప్తి చెందినట్లు గుర్తించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 'వాతావరణ మార్పులు, మబ్బులున్న వాతావరణం, చిరు జల్లుల కారణంగా ఈ వ్యాధి వేగంగా వ్యాప్తి చెందుతోంది. రైతులు పొలంలో నడవడం, పనిమనిషులు లేదా యంత్రాల ద్వారా వ్యాధి ఒక చెట్టు నుంచి మరొక చెట్టుకు వ్యాపిస్తుంటుంది. చల్లటి గాలులతో కొమ్మలు విరిగి పడి మరింత వ్యాప్తి చెందుతుంది. కొమ్మ కుళ్ళుడును అదుపులో ఉంచడానికి రైతులు కొమ్మ కుళ్ళు వచ్చిన భాగాలను తొలగించి వాటిని చేనుకు దూరంగా తగలబెట్టాలి. నత్రజని లేదా యూరియా ఎరువులను అధికంగా వాడకూడదు. సిలింద్ర నాశన మందులను సాయంత్రం సమయాల్లో మాత్రమే పిచికారి చేయాలి. తాయోఫినెట్ మీథైల్ 450 గ్రా లేదా 200 మి.లీ, కాపర్ ఆక్సిక్లోరైడ్ 500 గ్రా, పైరాక్షిస్ట్రోబిన్ 600 గ్రా లేదా ఆక్సక్సీస్ట్రోబిన్ 200 మి.లీ పిచికారి చేయడం ద్వారా వ్యాధిని నియంత్రించవచ్చు' అని పేర్కొన్నారు. ఈ పరిశీలనలో ఏంఏఓ బాలాజీ, ఏఈఓ శ్రీనివాసరాజు, రైతులు పోట్లపల్లి శ్రీనివాసరావు, చిన్న జిడయ్య, అనిల్, బండారు నరేష్, ఏ. రామకృష్ణ పాల్గొన్నారు.

# గిరిజనులకు అండగా నిలిచిన సీపీఐ



నేలకొండపల్లి, నవంబర్ 22, మహా: మండలంలోని తిరుమలాపురంలో దారి పంచాయతితో పలువురు ఇబ్బంది పడుతున్నారు. గత రెండేళ్ల నుంచీ గ్రామంలోని సన్న, చిన్నకారు రైతుల భూములకు వెళ్లకుండా ఓ రైతు కంచెను ఏర్పాటు చేసుకున్నాడు. అది ప్రభుత్వ భూమి అని గిరిజనులు..కాదు తమ సొంత పట్టాదారు భూమి అని రైతు ఈ వివాదం రెండేళ్ల నుంచి కొనసాగుతుంది. కాగా ఈ ఏడాది 33 మంది రైతులు 50 ఎకరాలను వరి సాగు చేశారు. పంట చేతికొచ్చింది. పంటను తెచ్చుకునేందుకు దారి లేకపోవటంతో గిరిజనులు ఆందోళనలు చేపట్టారు. అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహశీల్దార్ జె మాణిక్య రావు క్షేత్ర స్థాయిలో పర్యటించి సమస్యకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, పార్టీ కంట్రోల్ కమిషన్ చైర్మన్ మౌలానా, జాతీయ సమితి సభ్యులు హేమంతరావు, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్రెడ్డి, మండల కార్యదర్శి కర్నాటి భానుప్రసాద్, సహాయ కార్యదర్శులు పాల్తీయ శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, కనకబండి సీతారాములు ఘటనా స్థలానికి చేరుకుని బాధితుల గోడును విన్నారు. అధికారులతో మాట్లాడారు. పంటను తెచ్చుకునే విధంగా దారి సౌకర్యం కల్పించాలని వారు కోరారు. గిరిజనులకు అండగా ఉంటామని వారు పేర్కోన్నారు.

# నూతన వాటర్ ప్లాంట్ ప్రారంభం



**పాలేరు, నవంబర్ 22, మహా:** పాలేరు నియోజకవర్గం కూసుమంచి మండలం చేగోమ్మ గ్రామంలో బొల్లం నాగేశ్వరరావు, రజిత దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక వాటర్ ప్లాంట్ ను కూసుమంచి క్యాంపు కార్యాలయం ఇంచార్జ్ భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి శుక్రవారం నూతనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేగోమ్మ గ్రామ ప్రజలకు, మంచి తాగునీటిని అందించాలని, అలాగే వారి యొక్క వ్యాపారం అనుకున్న విధంగా జరగాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం బొల్లం నాగేశ్వరరావు దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి మాజీ ఎంపీటీసీ మాదాసు ఉపేందర్, మాజీ సర్పంచ్ భారీభద్రం, నేలకొండపల్లి మండల వ్యవసాయ కమిటీ వైస్ చైర్మన్ కొండపర్తి సురేష్, చేగోమ్మ మాజీ ఉపసర్పంచ్ బత్తుల నాగేశ్వరరావు, అరవపల్లి జనార్ధన్, మద్దినేని వెంకన్న, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ఆయుష్మాన్ ఆరోగ్య సెంటర్ల తనిఖీ



**ములుగు, మహా:** ములుగు మండలంలోని రాయినిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల దేవనగర్, ములుగు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సెంటర్లను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాలరావు తనిఖీ చేశారు. అసంక్రమిత వ్యాధులైన బీపీ, షుగర్, మూడవ విడత రిస్క్రీనింగ్ పరీక్షలు 100 శాతం చేయాలని సిబ్బందికి సూచించారు. నిర్ధారించిన బీపీ, షుగర్ రోగులకు మందుల పంపిణీని ఆశాల ద్వారా అందించాలన్నారు. ఉపకేంద్రాలలో గర్భిణీల క్లినిక్లను నిర్వహించి, గర్భిణీలకు చేసే నాలుగు చెకప్ లు, సాధారణ కాన్పుల ప్రయోజనాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసూతి చేసుకోవాలని అవగాహన కల్పించాలన్నారు. డెలివరీ అయిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు, తల్లిపాల ప్రాముఖ్యతను వివరించాలని, వ్యాధి నిరోధక టీకాల ప్రాముఖ్యతను కూడా గర్భిణీలకు అర్థమయ్యేలా వారికి వివరించాలన్నారు. అదేవిధంగా ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్ లలో ఓపీ సేవలు పెరగాలని తెలుపుతూ, వారి రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్. శ్రీకాంత్, డాక్టర్. రణధీర్, ఇన్చార్జ్ మీడియా ఆఫీసర్ సంపత్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పూర్ణ సంపత్ రావు, ఆరోగ్య విస్తరణ అధికారి సురేష్ బాబు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు ఉచిత బస్ పాస్ లు




కల్లూరు, నవంబర్ 22, మహా: పెద్ద కోరుకొండి గ్రామంలో దివ్యాంగులందరికీ ఉచితంగా బస్సు పాస్ లను ప్రతి సంవత్సరం అందజేస్తున్న డాక్టర్ వేము గంగరాజు సేవలు అభినందనీయమని సత్తుపల్లి డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం పెద్ద కోరుకొండి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద మాజీ సర్పంచ్ వేము రత్తమ్మ ఆధ్వర్యంలో డాక్టర్ వేము గంగరాజు ఆర్థిక సహాయంతో అర్హులైన దివ్యాంగులకు ఉచితంగా ఆర్టీసీ బస్ పాస్ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన దివ్యాంగులందరూ బస్సు పాస్ లతో పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్, డీలక్స్ బస్సులలో 50% రాయితీతో ప్రయాణించవచ్చని అన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా గ్రామంలో అర్హులైన దివ్యాంగులందరికీ తన సొంత ఖర్చులతో బస్ పాస్ లను అందజేస్తున్న డాక్టర్ వేము గంగరాజును ఈ సందర్భంగా ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో విలేజ్ బస్ ఆఫీసర్ కిన్నెర, ఆనందరావు, కంచి సాంసన్, దివ్యాంగుల గ్రామ అధ్యక్షులు వేమిరెడ్డి జానారెడ్డి, వడ్రానపు హరికృష్ణ, బెజవాడ నరసింహ, వేము మరియదాసు, బెజవాడ అలివేలు తదితరులు పాల్గొన్నారు.

# ఉనికి కోసమే మావోయిస్టుల అఘాయిత్యాలు

**- ములుగు జిల్లా ఎస్పీ శబరీష్**

**ములుగు, మహా:** కోల్పోయిన ఉనికి కోసమే మావోయిస్టులు ఆదివాసీలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని ములుగు జిల్లా ఎస్పీ శబరీష్ అన్నారు. గురువారం రాత్రి ఇద్దరు ఆదివాసీ యువకుల హత్యపై శుక్రవారం ఎస్పీ విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మావోయిస్టులు తాము కోల్పోయిన ఉనికిని చాటుకోవడానికి గత కొద్ది కాలంగా ప్రయత్నాలు చేస్తున్నారని, ఛత్తీస్ గడ్, ములుగు జిల్లా సరిహద్దుగా ఉన్న కర్రె గుట్ట అటవీ ప్రాంతాన్ని గెరిల్లా బేస్ గా మార్చే ప్రయత్నంలో వరుస అఘాయిత్యాలకూ పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. ములుగు జిల్లా వాజేడు మండలం మారు మూల అటవీ గ్రామమైన పెనుగోలులో కనీస వసతులు లేకున్నా అటవీ మార్గంలో రోజుకు 18 కిలో మీటర్లు నడిచి పట్టుదలతో చదివి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా ఎన్నికై విధులను నిర్వహిస్తున్న ఉయిక రమేష్ ని మావోయిస్టులకు సహకరించడంలేదని, అదేవిధంగా అటవీ ఉత్పత్తుల సేకరణ మీద ఆధారపడి జీవనం కొనసాగించే ఉయిక అర్జున్ ను మావోయిస్టు పార్టీలో చేరమని ఒత్తిడికి గురి చేశారన్నారు. దీంతో స్వగ్రామం వదిలి పెనుగొలు కాలనీకి వచ్చి కూలి పనులు చేసుకొని జీవనం కొనసాగిస్తున్నాడన్నారు. వీరిద్దరూ మావోయిస్టుల వేధింపులతో స్వగ్రామం పెనుగొలు వదిలి, పెనుగొలు కాలనీలో ఉంటున్నారని ఎస్పీ తెలిపారు. కేవలం పార్టీకి సహకరించడం లేదనే కారణంతో పోలీస్ ఇన్ఫార్మర్ ముద్ర వేసి గురువారం అర్ధరాత్రి మావోయిస్టులు పదునైన ఆయుధాలతో దాడి చేసి అత్యంత పాశవికంగా హత్యచేశారని ఎస్పీ తెలిపారు. ములుగు జిల్లాలో ఆదివాసీలు తమ జీవనోపాధి కోసం అటవీ ఉత్పత్తులు సేకరిస్తూ పశువులను అడవులలో మేపుతూ జీవనం కొనసాగిస్తుంటారని, అలాంటి ఆదివాసీ ప్రజలు స్వేచ్ఛగా జీవించకుండా నైతిక హక్కులను కాలరాస్తూ వారు అడవులలోకి వెళ్లకుండా మందుపాతరలు అమర్చి వారి ప్రాణాలను బలిగొంటున్నారని, ములుగు జిల్లా వెంకటాపురం మండలం జగన్నాధపురం గ్రామానికి చెందిన ఇల్లందుల యేసు కట్టెలు కొట్టుకొని జీవనం సాగించేవాడని, అతను మందు పాతర పేలి దుర్మరణం చెందాడన్నారు. బేధం గుట్టపై దైవ దర్శనం కోసం వెళ్తున్న భక్తురాలు డర్రా సునీత అను మహిళ కాలి నడక బాటలో అమర్చిన మందు పాతర పేలి వికలాంగురాలిగా మారిందని తెలిపారు. ఇలా ఆదివాసీలను ఇబ్బందులకు గురిచేసేలా కర్రెగుట్టపై అమర్చిన ప్రెషర్ మైన్స్ ను ములుగు జిల్లా బి.డి. పోలీసు టీం ఆధ్వర్యంలో తొలగించి వాటిని అమర్చిన వెంకటాపురం, వాజేడీ ఏరియా డిప్యూటీ దళకమాండర్ రీత తోపాటు మరి కొందరు మావోయిస్టులను అరెస్ట్ చేశామని ఎస్పీ తెలిపారు.

## మానవ హక్కుల సంఘాలు స్పందించాలి

**▪ఎస్పీ శబరీష్**



అమాయక ఆదివాసీ ప్రజలపై పోలీసు ఇన్ఫార్మర్ నెపంతో హత్యలు చేస్తూ వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్న మావోయిస్టుల అఘాయిత్యాలపై మానవ హక్కుల సంఘాలు స్పంచాలని ఆయన కోరారు. గిరిజనులను విద్య, వైద్యం, ప్రభుత్వ పథకాలకు దూరం చేస్తున్నారని, గ్రామ సమీప అడవుల్లో, కాలిబాటల్లో మందు పాతరలు పెట్టి జంతువులు, మనుషుల వారి ప్రాణాలను బలిగొంటున్నారని తెలిపారు. తమ ఉనికి చాటుకునేందుకు మావోయిస్టులు చేపట్టే దుశ్చర్యలను ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని ఎస్పీ తెలిపారు. ఆదివాసీ ప్రజల హక్కుల రక్షణకు పోలీసుశాఖ ఆధ్వర్యంలో మరింతగా కృషి చేస్తామని ఎస్పీ శబరీష్ పేర్కొన్నారు.

## రాష్ట్ర స్థాయి పోటీకి ఎంపికైన విద్యార్థికి సన్మానం



**అశ్వారావుపేట, నవంబర్ 21, మహా:** జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రథమ బహుమతి సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి నాగ సాయి కౌశిక్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హరిత ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వాసవి క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కౌశిక్‌కు రూ.1000 బహుమతిని అందజేశారు. దాతలైన కంచర్ల రామారావు, కంచర్ల భాస్కర్‌లు ఈ మొత్తాన్ని అందజేశారు. వాసవి క్లబ్ డిస్టిక్ జాయింట్ సెక్రటరీ శీమకుర్తి సుబ్బారావు, మండల అధ్యక్షుడు దేవరాజ్, ఉపాధ్యాయులు, ఇతర ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొని కౌశిక్‌ను అభినందించారు. కౌశిక్ రాష్ట్రస్థాయిలో కూడా విజయం సాధించాలని కోరుతూ, విద్యార్థుల్లోని ప్రతిభను ప్రోత్సహించడంలో ఉపాధ్యాయుల పాత్రను ప్రశంసించారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన అదనపు కలెక్టర్



**ములుగు, మహా:** మావోయిస్టుల చేతిలో హత్య చేయబడ్డ మృతుల కుటుంబాలను ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రి వద్ద ఇన్చార్జి అదనపు కలెక్టర్ ఎం. సంపత్ రావు శుక్రవారం పరామర్శించారు. పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మృతుల కుటుంబాలను పరామర్శించి ప్రభుత్వం వారికి అండగా ఉంటుందన్నారు.

## జాతీయ స్థాయి ఫుట్ బాల్ పోటీలకు లాస్య ఎంపిక



**కల్లూరు, నవంబర్ 22, మహా:** జమ్మూ కాశ్మీర్ లోని జమ్ముతావిలో నిర్వహించే అండర్ 17 బాలికల ఫుట్ బాల్ పోటీలకు మండల కేంద్రంలోని శాంతినగర్ కాలనీకి చెందిన మాతిపోగు సతీష్ కుమార్తె మాతిపోగు లాస్య ఎంపిక కావడంతో స్థానిక మండల ప్రజలు, శాంతినగర్ కాలనీవాసులు, శాంతినగర్ సొసైటీ డెవలప్మెంట్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా లాస్యకు అభినందనలు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనటానికి ఫుట్ బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఖమ్మం జిల్లా ఆదర్శ్ కుమార్ సహకారంతో ఎంపికల్లో పాల్గొని జాతీయస్థాయి జట్టుకి ఎంపిక కావడం జరిగిందన్నారు. పోటీలలో పాల్గొనటానికి అవసరమయ్యే రవాణా ఖర్చును అందించేందుకు స్కూల్ స్పోర్ట్స్ ఆఫీసర్ రతన్ బోస్, శాంతినగర్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు ఆర్టీసీ ఆనంద్ తోపాటు పలువురు ముందుకు వచ్చారు. పసుపులేటి వీర రాఘవయ్య, కల్లూరు మండల వ్యాయామ ఉపాధ్యాయులతోపాటు పలువురు కూడా లాస్యను ఈ సందర్భంగా అభినందించారు.

# విధులు పక్కాగా జరిగేలా చూడాలి

**- అదనపు కలెక్టర్ డా.పి. శ్రీజ**




**ఖమ్మం, నవంబర్ 22, మహా:** జిల్లాలో గ్రామ పంచాయతీల విధులు పక్కాగా జరిగేలా చూడాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో గ్రామ పంచాయతీల పనితీరుపై అదనపు కలెక్టర్, సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని గ్రామ పంచాయతీల పరిధిలో నూతన భవన నిర్మాణాలకు సంబంధించిన అనుమతులు నిబంధనల ప్రకారం జారీ చేయాలని, లే ఔట్ అనుమతుల జారీ వివరాలు పక్కాగా నమోదు చేయాలని సూచించారు. గ్రామ పంచాయతీలలో నిర్దేశిత లక్ష్యం మేరకు 100 శాతం పన్ను వసూలు పూర్తి చేయాలని అన్నారు. గ్రామాలలో వ్యాపారస్తుల ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్ జరిగేలా చూడాలని, గ్రామ పంచాయతీలలో ఉండే సెల్ టవర్ల నుంచి ఫీజు సకాలంలో వసూలు చేయాలని, నూతన సెల్ టవర్ ఏర్పాటు ప్రతిపాదనలు సకాలంలో డిస్పోస్ చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. గ్రామ పంచాయతీలలో పారిశుద్ధ్య నిర్వహణ పట్ల ప్రత్యేక చర్య తీసుకోవాలని, మల్టీ పర్పస్ వర్కర్లకు వేతనాలు, సీసీ చార్జీలు, ట్రాక్టర్ లోన్ రీ పేమెంట్ అమౌంట్ సకాలంలో చెల్లించాలని అన్నారు. ఉపాధి హామీ క్రింద మంజూరు చేసిన అభివృద్ధి పనులను గ్రామసభల ద్వారా ఆమోదింపజేసుకొని వెంటనే గ్రౌండ్ చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి ఆశలత, డివిజనల్ పంచాయతీ అధికారి రాంబాబు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీల పోరాటానికి సంపూర్ణ మద్దతు



**అశ్వారావుపేట, నవంబర్ 21, మహా:** అశ్వారావుపేట మండలం వినాయకపురం శివారు ఎర్రగుంటపల్లిలో గత రెండేళ్లుగా గిరిజనులు ఇళ్ల స్థలాల కోసం సాగిస్తున్న పోరాటానికి సీపీఐఎంఎల్ మాస్ లైన్ పార్టీ పూర్తి మద్దతును ప్రకటించింది. ఈ మేరకు ఆ పార్టీ జాతీయ కమిటీ సభ్యులు కచ్చల రంగారెడ్డి గురువారం ఎర్రగుంటపల్లిలో పర్యటించి, గిరిజనులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కచ్చల రంగారెడ్డి మాట్లాడుతూ, నివాస స్థలాలు వంటి కనీస హక్కుల కోసం పేద ప్రజలు పోరాటం చేయవలసిరావడం దురదృష్టకరమన్నారు. ప్రజల అవసరాలను తీర్చడం ప్రభుత్వాల కనీస ధర్మం అని అన్నారు. గిరిజనులకు తగిన న్యాయం చేయకపోతే ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తాం అని హెచ్చరించారు. సమావేశంలో పాల్వంచ డివిజన్ కార్యదర్శి గోకినపల్లి ప్రభాకర్, అశ్వారావుపేట మండల కమిటీ సభ్యులు కుంజా అర్జున్, పండ ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

# నేడు కార్పొరేట్ సంస్థల ప్రతినిధుల రాక



**ములుగు, మహా:** నేడు 50 కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు రాంనగర్ గ్రామ పంచాయితీ, ఎల్బీనగర్, మాన్య తండాలను సందర్శించనున్నారని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తెలిపారు. శుక్రవారం గోవిందరావుపేట మండలంలోని ఆ తండా లను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోవిందరావుపేట మండలంలోని రాంనగర్ గ్రామ పంచాయితీ, ఎల్ బి నగర్, మాన్య తండాలను శనివారం దాదాపు 50 కార్పొరేట్ సంస్థ ప్రతినిధులు సందర్శించనున్న నేపథ్యంలో గ్రామ సభలు ఏర్పాటు చేయుటకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని మండల అధికారులను ఆదేశించారు. గ్రామాలలో కావాల్సిన వాటర్ ట్యాంకు, స్ట్రీట్ లైట్స్ తదితర సౌకర్యాలు, గ్రామ ప్రజలకు కావాల్సిన ఇంకా ఇతర సౌకర్యాల గురించి గ్రామ సభలో కార్పొరేట్ సంస్థ ప్రతినిధులకు తెలియపర్చుటకు ప్రజలకు అవగాహన కల్పించి గ్రామ సభలకు హాజరు కావాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్మాన్ సంస్థ సతీష్, దేవిడ్, తహశీల్దార్ సృజన్ కుమార్, ఎంపీడీఓ జవహర్ రెడ్డి, ఎంపిఓ శరత్, పంచాయితీ సెక్రెటరీ స్వర్ణ, తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి

**- హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి**

**- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**



**ఖమ్మం, నవంబర్ 22, మహా:** వాతావరణ పరిస్థితిలో వస్తున్న మార్పు నేపథ్యంలో హాస్టల్ లలో చదివే పిల్లల ఆరోగ్యం పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ జలగం నగర్ లోని మైనారిటీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ సొసైటీని (బాలురు) తనిఖీ చేశారు. విద్యాలయ ఆవరణ, లోపల పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, విద్యాలయంలో తరగతుల నిర్వహణ, పాఠ్య పుస్తకాలు అందించారా, విద్యార్థులకు అందిస్తున్న భోజనం, త్రాగునీరు వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారం రుచిగా, శుభ్రంగా ఉంటుందా, కోడి గుడ్డు, పండ్లు వంటి పౌష్టికాహారం అందిస్తున్నారా వంటి వివరాలను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం విద్యాలయంలోని టాయిలెట్స్, హాస్టల్ ప్రాంగణం, వంట చేసే ప్రాంతం, డార్మెంటరీ తనిఖీ చేశారు. స్టోర్స్ లోని సరుకులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెసిడెన్షియల్ పాఠశాల, హాస్టల్ పరిసరాలు, ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు తాజా సరుకులు, కూరగాయలతో భోజనం అందించాలని, నిల్వ చేసిన భోజనం పదార్థాలు విద్యార్థులకు ఇవ్వవద్దని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం అత్యవసర వసతులు కల్పించేందుకు ప్రతిపాదనలు ఇవ్వాలని, పిల్లలకు వాటర్ హీటర్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ తనిఖీ సందర్భంగా జూనియర్ లెక్చరర్లు జావేద్ పాషా, ఇందిర, మహేష్, సిబ్బంది హసన్, పర్వేజ్ పాష, తదితరులు ఉన్నారు.

## ఎల్ఆర్ఎస్ పై సమీక్ష

**ఖమ్మం సిటీ, నవంబర్ 22, మహా:** సుడా పరిధిలో పెండింగ్‌లో ఉన్న లేఔట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్) దరఖాస్తుల పరిష్కారం కోసం సుడా వైస్ చైర్మన్ అభిషేక్ అగస్త్య మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. దరఖాస్తులను వేగంగా పరిశీలించి, ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సుడా మండలాల ఎంపీఓలు, ఇరిగేషన్ అధికారులు, రెవెన్యూ అధికారులు, డిటిసిపిఓ ప్రసాద్, సుడా ఎపిఓ ఖాదర్, జేపిఓ సుడా ఇటికాల భాస్కర్ పాల్గొన్నారు.

## ప్రజాపాలనపై కళాయాత్ర



**కల్లూరు, నవంబర్ 22, మహా:** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం గడుస్తున్న సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం విజయోత్సవ కళాయాత్రను మండలంలోని కల్లూరు, చెన్నూరుతోపాటు వివిధ గ్రామాలలో సాంస్కృతిక సారధి కళాకారులు ప్రజా పాలన విజయోత్సవ కళాయాత్ర యాత్రను నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న 6 గ్యారంటీలలో భాగంగా మహాలక్ష్మి పథకం, రైతు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహ జ్యోతి పథకం కింద 200 యూనిట్ల లోపు ఉచిత కరెంటు, ఎస్సీ, ఎస్టీ హాస్టల్ విద్యార్థులకు మెస్ ఛార్జీల పెంపు మొదలగు అంశాలపై కాల్వకట్ట జాన్ టిఎస్ఎస్ కళాబృందం కళారూపాలతో గ్రామ ప్రజలకు అవగాహన కలిగిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కళాకారులు నలగాటి సుధాకర్, పరకాల అజయ్, మాచర్ల కృష్ణ, బంక భద్రయ్య, పిడియాల లక్ష్మయ్య, కొండ్రు జ్యోతి పాల్గొన్నారు.

## వన సమారాధనను జయప్రదం చేయండి




**ఇల్లందు, నవంబర్ 22, మహా:** ఈనెల 24న లలితాపురం వద్ద గల మామిడి తోటలో జరిగే మున్నూరుకాపు వన సమారాధనలో కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని మున్నూరుకాపు కుల సంఘ నాయకులు దిండిగల రాజేందర్, పింగళి నరేష్ లు కోరారు. శుక్రవారం వన సమారాధన జరిగే మామిడి తోట వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. అంతేకాకుండా మున్నూరు కాపు ప్రముఖులు సైతం హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు కులస్తులు పాలెపు ఆనంద్, కలవల సుధాకర్, పగడాల చందు, పెద్దినేని రామకృష్ణ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రులను కలిసిన దిండిగల



**ఇల్లందు, నవంబర్ 22, మహా:** ఖమ్మం జిల్లా పర్యటనకు వచ్చిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు తన్నీరు హరీష్‌రావు, గంగుల కమలాకర్ లను శుక్రవారం మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఇంట్లో మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్ మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలు కప్పి పూల బొకేలను అందజేశారు. జిల్లాలో నిర్వహిస్తున్న పార్టీ కార్యక్రమాలు, జిల్లాలో పలు వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. రాబోయే రోజుల్లో పార్టీ నిర్వహించే కార్యక్రమాలలో సమిష్టిగా పని చేసి ప్రతిపక్ష పార్టీగా రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకొని వెళ్లాలని సూచించినట్లు దిండిగల తెలిపారు.






# వాట్సాప్ కొత్త ఫీచర్.. వాయిస్ మెసేజ్ హాయిగా టెక్స్ట్‌గా చదువుకోవచ్చు..!

**మహా, బిజినెస్:** ఇన్‌స్టంట్ మెసేజింగ్ యాప్ వాట్సాప్ తన యూజర్ల కోసం రోజుకో ఫీచర్ తీసుకొస్తోంది. చాలా మంది యూజర్లు సుదీర్ఘ విషయం చెప్పడానికి వాయిస్ మెసేజ్ ఫీచర్ వినియోగిస్తారు. ఈ వాయిస్ మెసేజ్‌ని నలుగురి మధ్యలో ఉన్నప్పుడు వినడం ఇబ్బందికరంగా ఉంటుంది. అటువంటప్పుడు వినాలంటే ఇయర్ ఫోన్స్ ఉండాలి. అలా వీలు కాకుంటే సదరు వాయిస్ మెసేజ్ వదిలేయాల్సి ఉంటది. ఈ ఇబ్బందులకు చెక్ పెట్టడానికి.. వాయిస్ మెసేజ్..టెక్స్ట్ రూపంలో చదువుకోవడానికి వీలుగా వాయిస్ ట్రాన్స్‌స్క్రిప్ట్స్ (Voice Message Transcripts) ఫీచర్ తెచ్చింది.

ఈ ఫీచర్ సాయంతో వాయిస్ మెసేజ్ వినొచ్చు.. వినలేని పరిస్థితుల్లో ట్రాన్స్‌స్క్రిప్ట్ చేసుకుని టెక్స్ట్ రూపంలో చదువు కోవచ్చు. అలాగని అది ట్రాన్స్‌లేటర్ కానేకాదు. వాయిస్ మెసేజ్ ఉన్న భాషలోనే టెక్స్ట్ వస్తుంది. ఈ ఫీచర్ ఎనేబుల్ చేసుకుంటే వాయిస్ మెసేజ్‌లకు ఆటోమేటిక్‌గా కింద టెక్స్ట్ రూపం లభిస్తుంది. కేవలం మెసేజ్ అందుకున్న వారు మాత్రమే టెక్స్ట్ చూడగలరు తప్ప.. పంపిన వారు అలా టెక్స్ట్ మెసేజ్ కోసం ఈ ఫీచర్ వినియోగించలేరని వాట్సాప్ తెలిపింది.

ఆండ్రాయిడ్ వర్షన్‌లో ఇంగ్లీష్ తోపాటు పోర్చుగీస్, రష్యన్, స్పానిష్ భాషలకు వాయిస్ మెసేజ్ ఫీచర్ మద్దతుగా ఉంటుంది. ఇక ఆపిల్ ఐఓఎస్ యూజర్లకు అదనంగా అరబిక్, చైనీస్, ఫ్రెంచ్, జర్మన్, ఇటాలియన్, జపనీస్ భాషల్లో ఈ ఫీచర్ అందుబాటులో ఉంటుంది. మున్ముందు ఇతర భాషల్లోకి విస్తరించనున్నది. వాయిస్ మెసేజ్ ట్రాన్స్‌స్క్రిప్ట్స్ ఫీచర్ యాక్టివేట్ చేసుకోవడానికి వాట్సాప్ సెట్టింగ్స్‌లోకి వెళ్లాలి. అక్కడ చాట్స్ ఆప్షన్ ఎంచుకోవాలి. అందులో కనిపించే వాయిస్ మెసేజ్ ట్రాన్స్‌స్క్రిప్ట్స్ ఆప్షన్ ఆన్ / ఆఫ్ చేసుకోవడంతోపాటు భాషను కూడా ఎంచుకోవాలి. ఆండ్రాయిడ్ లేదా ఐఓఎస్ యూజర్లకు సపోర్ట్ లేని భాష, పదాలను గుర్తించలేకపోతే ట్రాన్స్‌స్క్రిప్ట్స్ ఎర్రర్ వస్తుందని వాట్సాప్ తన బ్లాగ్ పోస్టులో వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా వాట్సాప్ రోల్ ఔట్ చేసిన ఈ ఫీచర్ త్వరలోనే అందరికీ అందుబాటులోకి రానున్నది.




# ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ 2.40 రెట్లు సబ్‌స్క్రిప్షన్..!

ఎన్టీపీసీ (NTPC) అనుబంధ సంప్రదాయేతర ఇంధన వనరుల సంస్థ ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ (NTPC Green Energy) ఐపీఓ (IPO) 2.40 రెట్లు సబ్ స్క్రైబ్ అయ్యింది. ఐపీఓ ద్వారా వాటాల విక్రయం శుక్రవారంతో ముగిసింది. రూ.10 వేల కోట్ల నిధుల సేకరణ లక్ష్యంతో ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ (NTPC Green Energy) ఐపీఓకు వెళ్లింది. 59,31,67,575 షేర్లకు 1,42,65,07,242 బిడ్లు దాఖలయ్యాయి. అంటే 2.40 రెట్లు అధికంగా ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ ఐపీఓ సబ్ స్క్రైబ్ అయిందని ఎన్ఎస్ఈ డేటా చెబుతోంది.

ఇక రిటైల్ ఇండివిడ్యుయల్ ఇన్వెస్టర్లు 3.39 రెట్లు సబ్‌స్క్రైబ్ చేశారు. క్వాలిఫైడ్ ఇన్‌స్ట్యూషనల్ ఇన్వెస్టర్లు 3.32 రెట్లు సబ్‌స్క్రైబ్ చేస్తే, నాన్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లు 81 శాతం సబ్‌స్క్రైబ్ చేశారు. యాంకర్ ఇన్వెస్టర్ల ద్వారా ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ రూ.3,960 కోట్ల నిధులు సేకరించింది. తాజా షేర్ల జారీ ద్వారా ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ నిధులు సేకరించింది. ఐపీఓలో షేర్ ధర రూ.102108గా నిర్ణయించింది.

ఐపీఓ ద్వారా సేకరించిన నిధులను ఎన్టీపీసీ రెన్యూవబుల్ ఎనర్జీ (ఎన్ఆర్ఈఎల్) రుణాల చెల్లింపు, కార్పొరేట్ అవసరాలకు వినియోగానికి ఖర్చు చేయనున్నది. ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ ఐపీఓ లీడ్ మేనేజర్లుగా ఐడీబీఐ క్యాపిటల్ మార్కెట్స్ అండ్ సెక్యూరిటీస్, హెచ్డీఎఫ్సీ బ్యాంక్, ఐఐఎఫ్ఎల్ క్యాపిటల్ సర్వీసెస్ (మాజీ ఐఐఎఫ్ఎల్ సెక్యూరిటీస్), నువామా వెల్త్ మేనేజ్మెంట్ వ్యవహరించాయి.

# 17.7 బిలియన్ డాలర్లు పతనం..

## 657.89 బిలియన్ డాలర్లకు ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు..!



ఫారెక్స్ రిజర్వ్ (Forex Reserves) నిల్వలు మరోమారు తగ్గుముఖం పట్టాయి. ఈ నెల 15తో ముగిసిన వారానికి ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు 17.7 బిలియన్ డాలర్లు పతనమై 657.89 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని ఆర్బీఐ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ నెల ఎనిమిదో తేదీతో ముగిసిన వారానికి ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు తగ్గి 675.65 బిలియన్ డాలర్లకు చేరాయి.

ఈ నెల 15తో ముగిసిన వారానికి ఫారెక్స్ రిజర్వ్ నిల్వల్లో ప్రధానమైన ఫారిన్ కరెన్సీ అసెట్స్ (ఎఫ్‌సీఏఎస్) 15.5 బిలియన్ డాలర్లు క్షీణించి 569.84 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. బంగారం రిజర్వు నిల్వలు 2 బిలియన్ డాలర్లు తగ్గి 65.7 బిలియన్ డాలర్ల వద్ద ముగిశాయి. ఇక స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ (ఎస్డీఆర్ఎస్) 94 మిలియన్ డాలర్లు పతనమై 18 బిలియన్ డాలర్ల వద్ద నిలిచాయి. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్)లో భారత్ ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు 51 మిలియన్ డాలర్లు క్షీణించి 4.2 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.

# రెండు వారాల గరిష్టానికి బంగారం..

## రూ.80 వేల మార్క్ దాటేసిన పుత్తడి..

దేశీయ బులియన్ మార్కెట్లలో మళ్లీ బంగారం ధరలు ధగధగ మెరుస్తున్నాయి. శుక్రవారం దేశ రాజధాని ఢిల్లీలో తులం బంగారం (24 క్యారట్స్) ధర రూ.1,100 పెరిగింది. వరుసగా రెండో రోజు ధర పెరగడంతో బంగారం తులం ధర రూ.80 వేల మార్క్ దాటేసింది. జ్యువెల్లరీ సంస్థలు, రిటైల్ కొనుగోలుదారుల నుంచి కొనుగోళ్లకు మద్దతు లభించడంతో శుక్రవారం తులం బంగారం (24 క్యారట్స్) ధర రూ.80,400 పలికింది. పెండ్లిండ్ల సీజన్ కావడంతో బంగారానికి గిరాకీ పెరిగిందని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. గురువారం తులం బంగారం ధర రూ.79,300 పలికింది. మరోవైపు శుక్రవారం కిలో వెండి ధర రూ.300 వృద్ధితో రూ.93,300లకు చేరుకున్నది. 99.5 శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర రూ.1,100 పెరిగి రూ.80 వేలు పలికింది. గురువారం 99.5 శాతం స్వచ్ఛత బంగారం ధర రూ.78,900 వద్ద స్థిర పడింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో తులం బంగారం డిసెంబర్ డెలివరీ ధర రూ.906 వృద్ధి చెంది రూ.77,599 పలికింది. వెండి కాంట్రాక్ట్స్ డిసెంబర్ డెలివరీ ధర రూ.996 పెరిగి రూ.90,921లకు చేరింది. ఇంక అంతర్జాతీయ మార్కెట్లో కామెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్ లో ఔన్స్ బంగారం ధర 36 డాలర్లు పెరిగి 2735.30 డాలర్లు పలికింది. ఇక ఔన్స్ వెండి సైతం 1.42 శాతం పుంజుకుని 31.83 డాలర్లకు చేరుకున్నది..

# జనవరి నుంచి బీఎండబ్ల్యూ కార్ల ధరలు పిరం.. మూడు శాతం వరకూ..!



ప్రముఖ లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెజ్ బెంజ్ (Mercedes - Benz) కార్ల తయారీ సంస్థ బాటలోనే బీఎండబ్ల్యూ ఇండియా (BMW India) పయనించనున్నది. జనవరి ఒకటో తేదీ నుంచి తన కార్ల ధరలు మూడు శాతం పెంచనున్నట్లు బీఎండబ్ల్యూ ఇండియా శుక్రవారం తెలిపింది. కార్ల మోడల్ వారీగా ధర పెరుగుతుందని పేర్కొంది. సాధారణంగా బీఎండబ్ల్యూ ఇండియా ఏటా రెండుసార్లు కార్ల ధరలు పెంచుతుంది. ఇన్ పుట్ కాస్ట్ పెరిగిపోవడంతో కార్ల తయారీ సంస్థలు కార్ల ధరలు పెంచుతాయి. ఇన్‌పుట్ కాస్ట్‌లో మెటీరియల్ కాస్ట్ ప్రధానంగా ఉంటుంది. దేశీయంగా తయారు చేస్తున్న బీఎండబ్ల్యూ 2 సిరీస్ గ్రాన్ కూపే, బీఎండబ్ల్యూ 3 సిరీస్ లాంగ్ వీల్ బేస్, బీఎండబ్ల్యూ 5 సిరీస్ లాంగ్ వీల్ బేస్, బీఎండబ్ల్యూ 7 సిరీస్ లాంగ్ వీల్ బేస్, బీఎండబ్ల్యూ ఎక్స్1, బీఎండబ్ల్యూ ఎక్స్3, బీఎండబ్ల్యూ ఎక్స్5, బీఎండబ్ల్యూ ఎక్స్7, బీఎండబ్ల్యూ ఎం340ఐ కార్లతోపాటు కంప్లీట్లీ బిల్ట్ అప్ యూనిట్లు (సీబీయూ)గా తీసుకొస్తున్న బీఎండబ్ల్యూ ఐ4, బీఎండబ్ల్యూ ఐ5, బీఎండబ్ల్యూ ఐ7, బీఎండబ్ల్యూ ఐ7 ఎం70, బీఎండబ్ల్యూ ఐఎక్స్1, బీఎండబ్ల్యూ ఐఎక్స్, బీఎండబ్ల్యూ జడ్4 ఎం40ఐ, బీఎండబ్ల్యూ ఎం2 కూపే, బీఎండబ్ల్యూ ఎం4 కాంపిటీషన్, బీఎండబ్ల్యూ ఎం4 సీఎస్, బీఎండబ్ల్యూ ఎం5, బీఎండబ్ల్యూ ఎం8 కాంపిటీషన్ కూపె, బీఎండబ్ల్యూ ఎక్స్ఎం (హైబ్రీడ్) కార్ల ధరలు పెరుగనున్నాయి. మెర్సిడెజ్ బెంచ్ కూడా జనవరి ఒకటో తేదీ నుంచి తన కార్ల ధరలు మూడు శాతం పెరుగుతాయని తెలిపింది.



# దేశం-విదేశం NATIONAL NEWS



# వైద్యులు చనిపోయాడన్నారు... డెడ్ బాడీ లేచి కూర్చుంది..!

అతడు అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరాడు. వైద్యులు చికిత్స చేశారు. తర్వాత చనిపోయాడని ధృవీకరించారు. రెండు గంటలపాటు ఫ్రీజర్‌లో పెట్టారు. ఆపై మృతదేహాన్ని సంబంధీకులకు అప్పగించారు. వారు ఆ మృతదేహాన్ని అంత్యక్రియల కోసం శ్మశానానికి తరలించారు. మరి కాసేపట్లో చితికి నిప్పుపెడుతారనగా డెడ్ బాడీ లేచి కూర్చుంది. దాంతో అంత్యక్రియలకు హాజరైన భయంతో వణికిపోయారు. తర్వాత తేరుకుని ఆస్పత్రికి తరలించారు. రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో ఈ విచిత్ర ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జైపూర్‌కు చెందిన 25 ఏళ్ల మూగ, చెవిటి యువకుడు రోహితాష్ ఒక అనాథ. నగరంలోని ఓ అనాథాశ్రమంలో అతను ఉంటున్నాడు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం రోహితాష్ అస్వస్థతకు గురయ్యాడు. దాంతో ఆశ్రమ సిబ్బంది అతడిని జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యం చేసిన డాక్టర్‌లు మధ్యాహ్నం రెండు గంటల సమయంలో రోహితాష్ మరణించాడని ధృవీకరించారు. ఆ తర్వాత ఫార్మాలిటీస్ పూర్తయ్యే వరకు రెండు గంటల పాటు మృతదేహాన్ని ఫ్రీజర్‌లో పెట్టారు. ఆ తర్వాత ఆశ్రమ నిర్వాహకులకు అప్పగించారు. ఆశ్రమ నిర్వాహకులు అంబులెన్స్‌లో మృతదేహాన్ని అంత్యక్రియలకు తరలించారు. అక్కడ కొద్దిసేపైతే చితికి నిప్పుపెడుతారనగా రోహితాష్ లేచి కూర్చున్నాడు. దాంతో ఒక్కసారిగా అందరూ భయాందోళనకు గురయ్యారు. తర్వాత అతడిని అదే జిల్లా ఆస్పత్రికి తరలించారు. వెంటనే వైద్యులు చికిత్స ప్రారంభించారు. చికిత్స పొందుతూనే ఇవాళ (శుక్రవారం) ఉదయం ప్రాణాలు కోల్పోయాడు. దాంతో ఈ మధ్యాహ్నం అంత్యక్రియలు పూర్తిచేశారు. కాగా ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ సీరియస్ అయ్యారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన నలుగురు వైద్యులను సస్పెండ్ చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం చేస్తే లేచి కూర్చునే ఛాన్స్ ఎక్కడిదని, పోస్టు మార్టం చేయకుండానే రిపోర్టు ఎలా ఇచ్చారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనపై విచారణకు ఆదేశించారు.





# నోయిడాలో దారుణం..

## భర్తకు భయపడి ఇద్దరు పిల్లలను చంపేసిన మహిళ..!

ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో దారుణం జరిగింది. జైలు నుంచి విడుదలైన భర్తకు భయపడి ఓ మహిళ తన ఇద్దరు పిల్లలను చంపేసింది. ఆ తర్వాత తాను ఆత్మహత్యకు ప్రయత్నించింది. కానీ ఇంతలో స్థానికులు అడ్డుకోవడంతో బతికిపోయింది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు.. నిందితురాలి అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. నోయిడాకు చెందిన సదరు మహిళ ముందుగా ఒక ముస్లిం వ్యక్తిని వివాహం చేసుకుంది. వారికి ఒక కొడుకు, ఒక పాప ఉన్నారు. అయితే హత్య కేసులో భర్త జైలుకు వెళ్లడంతో ఆమెకు పిల్లల పోషణ భారంగా మారింది. దాంతో ఒక హిందూ వ్యక్తితో సహజీనం ప్రారంభించింది. అతడితో ఒక బాబును కన్నది. ఈ క్రమంలో ఆమె మొదటి భర్త జైలు నుంచి విడుదలయ్యాడు. భార్యను తన దగ్గరికి తిరిగి రావాలని హుకుం జారీచేశాడు. లేదంటే చంపేస్తానని బెదిరించాడు. అయితే అతని దగ్గరికి తిరిగి వెళ్లడం ఇష్టంలేక, వెళ్లకపోతే తనను, పిల్లలను చంపేస్తాడనే భయంతో ఆమె వణికిపోయింది. చివరికి పిల్లలను చంపేసి, తాను ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుంది. ముందుగా పిల్లలను గొంతు పిసికి చంపి, తాను ఉరేసుకోబోయింది. ఇంతలో గమనించిన స్థానికులు అడ్డుకున్నారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితురాలిని అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టానికి పంపించారు. తన రెండో భర్త పోషిస్తాడనే నమ్మకంతోనే మూడో బాబును వదిలేశానని పోలీసుల విచారణలో నిందితురాలు తెలిపింది. ఆమెను కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

# తాజా హింస నేపథ్యంలో.. మణిపూర్‌కు 10,000 మందికిపైగా సైనికులు



ఇంఫాల్: కుకీ, మైతీ జాతుల మధ్య ఘర్షణలతో రగులుతున్న మణిపూర్‌లో (Manipur) మళ్లీ హింసాత్మక సంఘటనలు తీవ్రమయ్యాయి. ఈ నేపథ్యంలో మరో పది వేల మందికిపైగా సైనికులను అక్కడకు పంపుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. దీంతో కేంద్ర బలగాల మొత్తం కంపెనీల సంఖ్య 288కు చేరుతుందని పేర్కొంది. మణిపూర్ భద్రతా సలహాదారుడు కుల్దీప్ సింగ్ శుక్రవారం రాజధాని ఇంఫాల్‌లో మీడియాతో మాట్లాడారు. 10,800 మంది కేంద్ర బలగాల సిబ్బందితో మరో 90 కంపెనీలు రాష్ట్రానికి వస్తున్నాయని తెలిపారు. ఇప్పటికే కొన్ని కంపెనీల బలగాలు చేరాయని చెప్పారు. దీంతో మణిపూర్‌లో మోహరించిన మొత్తం కంపెనీల సంఖ్య 288కు పెరుగుతుందని వెల్లడించారు. కాగా, పౌరుల ప్రాణాలు, ఆస్తులను రక్షించడానికి ఉద్రిక్త ప్రాంతాలకు కేంద్ర బలగాలను తరలిస్తున్నట్లు కుల్దీప్ సింగ్ తెలిపారు. కొన్ని రోజుల్లో అన్ని ప్రాంతాలకు ఇవి చేరుతాయని చెప్పారు. ప్రతి జిల్లాలో కొత్త కోఆర్డినేషన్ సెల్స్, జాయింట్ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఆయా ప్రాంతాల్లో ఇప్పటికే పనిచేస్తున్న వాటి పనితీరును సమీక్షించినట్లు వెల్లడించారు.



# స్కూటీని ఢీకొట్టి ఈడ్చుకెళ్లిన కారు.. తర్వాత ఏం జరిగిందంటే?

**మహా, లక్నో:** వేగంగా వెళ్తున్న కారు ఒక స్కూటీని ఢీకొట్టింది. కారు ముందు పడిన దానిని కిలో మీటరు దూరం వరకు ఈడ్చుకెళ్లింది. (Car Drags Scooty) దీంతో రోడ్డుపై స్కూటీ రాపిడికి నిప్పురవ్వలు ఎగసిపడ్డాయి. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో ఈ సంఘటన జరిగింది. పీజీఐ పోలీస్ స్టేషన్ పరిధిలోని కిసాన్ పథ్ వద్ద వంతెనపై వేగంగా వెళ్తున్న కారు ఒక స్కూటీని ఢీకొట్టింది. అయితే డ్రైవర్ ఆ కారును నిలుపలేదు. కొందరు వ్యక్తులు అలెర్ట్ చేసినా పట్టించుకోలేదు. కారు ముందు పడిన స్కూటీని కిలోమీటరు దూరం వరకు ఈడ్చుకెళ్లాడు. దీంతో రోడ్డుపై రాపిడికి నిప్పురవ్వలు ఎగసిపడ్డాయి. కాగా, స్కూటీపై ఉన్న ఇద్దరు వ్యక్తులు ఈ ప్రమాదంలో గాయపడ్డారు. వారిని హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ సంఘటనపై పోలీసులు స్పందించారు. కారు డ్రైవర్‌ను అరెస్ట్ చేశారు. నిందితుడ్ని ప్రయాగ్‌రాజ్‌కు చెందిన చంద్రప్రకాష్‌గా గుర్తించారు. మరోవైపు ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

# పెర్త్ ఇలాఖాలో సీమర్ల తడాఖా

**రికార్డ్ స్థాయిలో ఒకే రోజున 17 వికెట్లు పడగొట్టిన ఫాస్ట్ బౌలర్లు**

**పేస్ కు చేతులెత్తేసిన బ్యాట్స్ మెన్.. 150 పరుగులకే భారత్ ఆలౌట్**

**హేజిల్ ఉడ్ కు నాలుగు వికెట్లు.. అరంగేట్రం ఆటగాడు నితిష్ రెడ్డి టాప్ స్కోర్**

**భారత్ బాటలో ఆసీస్.. బుమ్రా దెబ్బ కు కంగారూలు విలవిల**

**4 వికెట్లు తీసి ఆస్ట్రేలియా నడ్డి విరిచిన భారత కెప్టెన్**

**67 పరుగులకు ఏడు వికెట్లు ఢమాల్**



**స్పోర్ట్స్ డెస్క్ మహా:** పెర్త్ లో ఊహించిందే జరిగింది. పిచ్ పై దొరికిన బౌన్స్ తో ఇరుజట్ల పేసర్లు తమ ప్రతాపం చూపారు. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో ఫస్ట్ టెస్ట్ ఫస్ట్ ఇన్నింగ్స్ లో టీమ్ ఇండియా చేతులెత్తేసింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ కు దిగిన భారత్ ఆట తొలిరోజు కనీసం 50 ఓవర్లు కూడా పూర్తిగా ఆడకుండానే 150 పరుగులకు చాప చుట్టేసింది. ఆసీస్ పేసర్లకు దాసోహమంది. పిచ్ పై ఉన్న ఉన్న బౌన్స్ ను సద్వినియోగం చేసుకున్న ఆసీస్ బౌలర్లు షార్ట్ పిచ్ బాల్స్ తో భారత బ్యాట్స్ మెన్ ను ఇబ్బంది పెట్టారు. యువ సంచలనం జైస్వాల్ ఖాతా కూడా తెరవ కుండానే పెవిలియన్ చేరితే మరో ఓపెనర్ రాహుల్ మాత్రం అసలైన టెస్ట్ క్రికెట్ ఆడాడు. కాంగారూల బౌలర్ల ధాటికి కంగారు పడకుండా సమర్ధంగా ఎదురుకున్నాడు. కాని మరో కుర్రాడు ఫస్ట్ డౌన్ లో వచ్చిన దేవ్ దత్ పడిక్కల్ 23 బంతులాడినా ఒక్క పరుగు కూడా చేయకుండానే డకౌట్ గా వెనుదిరిగాడు. ఆసీస్ పేసర్లు బ్యాట్స్ మెన్ ను తమ పేస్ ఉచ్చులో పడేసి వికెట్లు లాగేసుకున్నారు. ఆదుకుంటాడనుకున్న కింగ్ కోహ్లీ 5 పరుగులకే అవుటవడం , కుదురుకున్న రాహుల్ (26) వివాదస్పద నిర్ణయానికి బలైపోవడంతో టాప్ ఆర్డర్ కకావికలమైంది . వికెట్లు పడుతున్నప్పుడు సహజంగా ఉండే ఒత్తిడి కారణంగా దీని ప్రభావం మిడిల్ ఆర్డర్ పై పడింది.ధ్రువ్ జురెల్ 11, వాషింగ్ టన్ సుందర్ 4, విఫలమయ్యారు.దీంతో 73 రన్స్ కు ఆరు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడిన జట్టును వికెట్ కీపర్ రిషబ్ పంత్ (37),అరంగేట్ర ఆటగాడు తెలుగు కుర్రాడు నితీష్ రెడ్డి (41)ఆదుకునే ప్రయత్నం చేసారు.48 పరుగుల భాగస్వామ్యం అందించి ఆశలు రేపారు. కాని ఫ్రస్టేషన్ లో ఓ లూజ్ షాట్ ఆడిన పంత్ క్యాచ్ అవుట్ గా వెనుదిరిగాడు. అక్కడినుండి మిగతా మూడు వికెట్లు పడటానికి పెద్ద సమయమేమీ తీసుకోలేదు. బుమ్రా 8, మరో అరంగేట్ర ఆటగాడు హర్షిత్ రాణా 7, సిరాజ్ పరుగులేమీ చేయకుండా నాటౌట్ గా మిగిలాడు . దీంతో భారత్ ఇన్నింగ్స్ 150 పరుగుల వద్ద ముగిసింది.ఆసీస్ పేసర్లు హేజిల్ ఉడ్ 4 వికెట్లు , స్టార్క్ , మార్ష్ , కమ్మిన్స్ తలో రెండేసి వికెట్లు పడగొట్టారు. అనంతరం భారత్ ను తక్కువ స్కోరుకే ఆలౌట్ చేసామన్న ఆనందం ఆస్ట్రేలియా కు ఎంతో సేపు దక్కలేదు. తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన ఆసీస్ డెబ్యూ ఆటగాడు నాథన్ మెక్ స్వీనీ రెండు ఫోర్లతో టచ్ లోకొచ్చినట్టు కనపడినా ..బుమ్రా రెండో ఓవర్ లో హాఫ్ స్టంప్ ఆవల వేసిన షార్ట్ ఆఫ్ లెంత్ బంతిని డిఫెన్స్ ఆడబోయి వికెట్ల ముందు దొరికి పోయాడు. బుమ్రా రివ్యూతో నాటౌట్ అన్న ఫీల్డ్ అంపైర్ తన నిర్ణయాన్ని మార్చుకోవలసి వచ్చింది.వెంటనే అదే ఓవర్ లో కోహ్లీ లబుషంగే ఇచ్చిన క్యాచ్ విడిచి పెట్టకుంటే మరో వికెట్ పడి ఉండేది.దీంతో ఆస్ట్రేలియా పై ఒత్తిడి పెరిగేది. కాని నిరుత్సాహపడని బుమ్రా పేస్ కు సహకరిస్తున్న పిచ్ పై చెలరేగిపోయాడు.తాను ఇప్పటివరకు బుమ్రా బౌలింగ్ లో అవుట్ కాలేదని ,కానని విర్రవీగిన మరో ఓపెనర్ ఉస్మాన్ ఖ్వాజా బుమ్రా వేసిన షార్ట్ ఆఫ్ లెంత్ డెలివరీని డిఫెండ్ చేయబోయి బ్యాడ్ ఎడ్జ్ తాకి స్లిప్పులో క్యాచ్ ఇచ్చాడు.అది నేరుగా విరాట్ చేతిల్లోకి వెళ్లింది. ఈ సారి కోహ్లీ మిస్టేక్ రిపీట్ చేయకుండా బంతిని ఒడిసి పట్టుకోవడంతో ఆసీస్ రెండో వికెట్ కోల్పోయింది. అనంతరం బుమ్రా వెంటనే తన తరువాతి బంతికి స్టీవెన్ స్మిత్ ను కూడా ఔట్ చేయడంతో భారత శిబిరంలో ఆనందం వెల్లివిరిసింది. అరంగేట్ర ఆటగాడు హర్షిత్ రాణా తొలి రెండు ఓవర్ లలో హెడ్ రెండు ఫోర్లు దంచినా అతని మరుసటి ఓవర్ లో ఓ చక్కటి బంతిని తప్పుగా అంచనా వేసి క్లీన్ బౌల్డయ్యాడు.దీంతో తన తొలిమ్యాచ్ లోనే వికెట్ సాధించి పండగ చేసుకున్నాడు హర్షిత్ రాణా.ఇక మరో ఎండ్ లో సిరాజ్ తానేమీ తక్కువ కానని పేస్ కు సహకరించే పిచ్ పై షార్ట్ బంతులతో బ్యాట్స్ మెన్ ను ఇబ్బంది పెట్టాడు. సిరాజ్ విసిరిన ఓ చక్కటి బంతి మిచెల్ మార్ష్ బ్యాట్ ఎడ్జ్ తగిలి స్లిప్స్ లోకి వెళ్లింది. రాహుల్ ఎడమ వైపు డైవ్ చేసి చక్కటి క్యాచ్ అందుకోవడంతో మార్ష్ 5వ వికెట్ గా పెవిలియన్ చేరాడు. మరోమారు సిరాజ్, బుమ్రా మ్యాజిక్ తో ఆస్ట్రేలియా తొలిరోజు ఆట ముగిసే సమయానికి 67 పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయి టీమ్ ఇండియా కంటే దీన స్థితిలో పడిపోయింది. సెకండ్ డే ఉదయాన్నే త్వరత్వరగా మూడు వికెట్లు పడగొడితే భారత్ కు ఫస్ట్ ఇన్నింగ్స్ లో ఎంతో కొంత కీలక పరుగుల ఆధిక్యం దక్కుతుంది. పిచ్ స్వభావం ఇలాగే ఉంటే ఫలితం రావడానికి మూడు రోజులు కూడా ఎక్కువే.మ్యాచ్ కి రెండో రోజు ఉదయం ఆట కీలకంగా మారనుంది. మ్యాచ్ లో టీమ్ ఇండియా ఓ మెట్టు పైనే ఉన్నప్పటికీ విజయానికి ఇరు జట్లకు సమాన అవకాశాలున్నాయి. దీంతో సగటు క్రికెట్ అభిమానిలో మ్యాచ్ పై మరింత ఆసక్తి పెరుగుతుంది.



## అరంగేట్ర మ్యాచ్‌లో అదుర్స్

**బ్యాటింగ్ లో అదరగొట్టిన తెలుగు కుర్రాడు**

**భారత్ ఫస్ట్ ఇన్నింగ్స్ లో టాప్ స్కోరర్ నితీష్ కుమార్ రెడ్డి**

పేసర్లకు స్వర్గ ధామమైన పెర్త్ బౌన్సీ పిచ్ పై ఇరు జట్లకు చెందిన మహామహులే బ్యాటెత్తేసిన వేళ ఓ తెలుగు కుర్రాడు అదరక బెదరక బ్యాట్ ఝుళిపించాడు. ఆసీస్ బౌలర్లు పేస్ కు సహకరిస్తున్న పిచ్ పై అరివీర భయంకరంగా లైన్ అండ్ లెంగ్త్ తో భారత బ్యాట్స్ మెన్ ను కట్టడి చేస్తే ..ఆంధ్ర ఆటగాడు నితీష్ కుమార్ రెడ్డి అదే బౌలర్లకు తన బ్యాటింగ్ రుచి చూపించాడు. అదీ తన డెబ్యూ మ్యాచ్ లో. 73 రన్స్ కే ఆరు వికెట్లు నష్టపోయి పీకల్లోతుష్టాల్లో ఉన్న జట్టును ఓ రకంగా గాడిన పెట్టే ప్రయత్నం చేసాడు. డిఫెన్స్ తో లాభం లేదనుకుని బౌలర్లపై ఎటాకింగ్ కు దిగి ఇలాంటి పిచ్ పై ఎలా బ్యాటింగ్ చేయాలో చేసి చూపించాడు. పంత్ తో కలిసి ఏడోవికెట్ కి 48 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నమోదు చేయకుంటే టీమ్ ఇండియా 100 పరుగులు కూడా దాటేది కాదు. చక్కటి లైన్ అండ్ లెంగ్త్ బంతులను డిఫెన్స్ ఆడి మిగతా బంతులను ఎడాపెడా షాట్లు బాదుతూ 59 బంతుల్లో 1సిక్స్ 6 ఫోర్లతో 41 పరుగులు సాధించి టీమ్ ఇండియా ఫస్ట్ ఇన్నింగ్స్ టాప్ స్కోరర్ గా నిలిచాడు

# వాహ్ సిరాజ్ మియా



**ఆకట్టుకున్న హైదరాబాదీ ప్లేయర్**

**బుమ్రాకు చక్కటి తోడ్పాటు**

పెర్త్ పిచ్ పై బూమ్ బూమ్ బుమ్రా పేస్ ఎటాకింగ్ తో షార్ట్ లెంగ్త్ బాల్స్ తో కంగారూ బ్యాట్స్ మెన్ కి కంగారెత్తిస్తూ టపటపా వికెట్లు తీస్తుంటే మరో ఎండ్ లో హైదరాబాదీ సిరాజ్ మియా మాయ చేసాడు. అదే లైన్ అండ్ లెంగ్త్ లో బంతులేస్తూ బుమ్రాకు చక్కటి తోడ్పాటు నందించి తనూ వికెట్లు తీసి ఆసీస్ పై మరింత ఒత్తిడి పెంచాడు. ఇలా రెండు వైపులా అటాక్ తో ఆస్ట్రేలియా ఆటలు సాగలేదు. ఒక వైపు వికెట్లు తీస్తున్నా మరో ఎండ్ లో పరుగులు వస్తే బ్యాట్స్ మెన్ కుదురుకునే అవకాశముంటుంది.అప్పుడు మంచి భాగస్వామ్యాలు నమోదై భారత్ పై ఒత్తిడి పెంచే అవకాశముండేది. కాని సిరాజ్ అలాంటి ఛాన్స్ ఇవ్వలేదు నిప్పులు చెరిగే బంతులతో భయపెట్టాడు.రెండు వికెట్లు తీసి సత్తా చాటాడు. మరోవైపు హర్షిత్ రాణాకూడా తన డెబ్యూ మ్యాచ్ లో ఓ వికెట్ తీసి సంబర పడ్డాడు.

## చెలరేగిన తస్కిన్.. కష్టాల్లో వెస్టిండీస్



స్వదేశంలో బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో వెస్టిండీస్ కష్టాల్లో పడింది. బంగ్లా పేసర్ తస్కిన్ అహ్మద్(2/19) ధాటికి ఆతిథ్య జట్టు ఆదిలోనే రెండు కీలక వికెట్లు కోల్పోయింది. తొలుత కెప్టెన్ క్రెగ్ బ్రాత్‌వైట్ (4)ను ఎల్బీగా వెనక్కి పంపిన తస్కిన్ లంచ్‌కు ముందు మరోసారి విజృంభించాడు. క్రీజులో కుదురుకునే పనిలో ఉన్న కేసీ కార్టీ(0)ని డకౌట్ చేశాడు. అంతే కరీబియన్ జట్టు ఒత్తిడిలో పడింది. లంచ్ సమయానికి విండీస్ 2 వికెట్ల నష్టానికి 50 పరుగులు చేసింది. అంటిగ్వాలోని సర్ వివియన్ రిచర్డ్స్ మైదానంలో టాస్ గెలిచిన బంగ్లాదేశ్‌కు తస్కిన్ అహ్మద్ ఆదిలోనే బ్రేకిచ్చాడు. తొలి వికెట్‌కు 25 పరుగులు జోడించిన ఓపెనర్లను విడదీశాడు. క్రెగ్ బ్రాత్‌వైట్ (4)ను ఔట్ చేసి విండీస్‌కు షాకిచ్చాడు.

# సినిమా వార్తలు | MOVIE NEWS



## కీర్తి సురేష్ పెళ్లి

**డిసెంబరు 11న వివాహం**

**.. అధికారికంగా ప్రకటించిన ఆమె తండ్రి**

మహానటి కీర్తిసురేష్ పెళ్ళి కన్ ఫాం అయింది. అధికారికంగా కీర్తి తండ్రి సురేష్ ప్రకటించారు. కీర్తి సురేష్ కు 15 సంవత్సరాల నుంచి పరిచయం ఉన్న ఆంటోని తటిల్ తోనే వివాహం జరగబోతోందని అధికారికంగా చెప్పారు. గోవాలోని ఓ రిసార్ట్ లో వీరి వివాహ వేడుక జరుగుతుందన్నారు. దీంతో కీర్తి సురేష్ అభిమానులు పండగ చేసుకుంటున్నారు. కీర్తి పెళ్ళి వార్త ముందుగా మహా పత్రికలో వారం క్రితమే ప్రచురితమైన విషయం విదితమే. డిసెంబరు 11 , 12వ తేదీలలో వీరి వివాహం జరగబోతోంది. నెటిజన్లు కీర్తిసురేష్ - ఆంటోని తటిల్ ఫొటోలను సోషల్ మీడియా వేదికగా షేర్ చేస్తూ శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. కొన్నాళ్లుగా తన బాయ్ ఫ్రెండ్ ఆంటోనీని గోవాలో పెళ్లి చేసుకోబోతోందంటూ వార్తలు వస్తున్నాయికానీ అవన్నీ రూమర్లే అనుకున్నారు. అయితే ఆమె తండ్రి సురేష్ కుమార్ ఈ వివాహాన్ని అధికారికంగా ప్రకటించడంతో వాస్తవమే అని ధ్రువీకరణకు వచ్చారు. సోషల్ మీడియాలో కీర్తిసురేష్ కు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి.

## ఒకే రోజు ఏకంగా పది సినిమాలు రిలీజ్

**అయితే అతివృష్టి లేకుంటే అనావృష్టి**



ఇందులో విశ్వక్సేన్ హీరోగా నటించిన మెకానిక్ రాకి, అశోక్ గల్లా హీరోగా నటించిన దేవకీ నందన వాసుదేవ, సత్యదేవ్ హీరోగా నటించిన జీబ్రా, రాకింగ్ రాకేశ్ హీరోగా నటిస్తున్న కేశవ చంద్ర రమావత్ (కేసీఆర్) మూవీలు కాస్త చెప్పుకోదగ్గవి ఉన్నాయి. ఇవి కాకుండా రోటి కపడా రొమాన్స్ అనే మూవీ, ఉద్వేగం మూవీ, పిచ్చోడు, ఝాన్సీ ఐపీఎస్, కనకమహాలక్ష్మి లాంటి సినిమాలు కూడా విడుదలకు సిద్ధమయ్యాయి. అదే విధంగా తమిళంలో విడుదల అయి తెలుగులో ఇప్పుడు డబ్బింగ్ అయ్యి రిలీజ్ అవుతున్న సన్నీ లియోన్ మందిర అనే మూవీ. అయితే వీటిలో రోటి కపడా రొమాన్స్ సినిమాతో పాటు ఝాన్సీ ఐపీఎస్ అనే రెండు సినిమాలకు థియేటర్లు లేకపోవడంతో వచ్చే వారానికి వాయిదా వేశారు. సినిమాల విడుదలలో అయితే అతివృష్టి లేకుంటే అనావృష్టిగా తెలుగు సినీ ఇండస్ట్రీ పరిస్థితి తయారైంది. వస్తే వరుసపెట్టి సినిమాలు విడుదల అవుతాయి లేకుంటే ఒక్క మూవీ కూడా విడుదల కాని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. మాస్ హీరో 'విశ్వక్ సేన్' ఈ సినిమాతో మంచి బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంటారని భావించగా, ఈ సినిమాకి మిక్స్‌డ్ టాక్ వినిపిస్తోంది. జీబ్రా మంచి టాక్ తెచ్చుకుంది.




EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY N SREENIVAS RAO, PUBLISHED AT 1-9-18/4-1, RAMNAGAR X ROAD, HYDERABAD. PRINTED AT SRI MATHA PRINTERS,H NO 1-1-562/1,GANDHI NAGAR, HYDERABAD.
REGD NO : APTEL/2003/9316. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034



# అడవిలో నెత్తుటేరు

## ఏడాది పొడవునా మారణ హోమమే..

### తూటాలకు బలి అవుతున్న అమాయక గిరిజనులు

### ఎన్నాళ్ళి ప్రతీకార చర్యలు..?

### అడవుల్లో శాంతికపోతాలు ఎగిరేదెన్నాడో..?

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** ఈ భారతదేశం ధర్మ పాలన, అహింసే అనే ముఖ్య సూత్రాలను పాటిస్తూ ప్రజలే ప్రభువులుగా ఎన్నుకుంటున్న ప్రజాస్వామ్య దేశం. ధర్మం అధర్మంగా మారినప్పుడు హింస, క్రూరత్వం పెట్రేగిపోయినప్పుడు ప్రతి యుగానికి ఓ యుగ పురుషుడు జన్మిస్తాడని మేధావులు చెప్పిన మాట. కానీ, భారతదేశానికి స్వతంత్రం వచ్చి 75 సంవత్సరాలు దాటినా ఇంతవరకు అహింస ఆనవాళ్లే దొరకడం లేదు. ఎక్కడ చూసినా హింస ప్రవృత్తి కొనసాగుతుంది. మహా భారత యుద్ధంలో ధర్మం గెలవాలనే లక్ష్యంతో జరిగిన కురుక్షేత్ర యుద్ధంలో శ్రీ కృష్ణుడు మార్గదర్శిగా ఉంటూ పాండవులను విజయ తీరాలకు చేర్చాడు. ఎప్పటికైనా ధర్మమే గెలుస్తుందని గీతా సారాంశాన్ని తెలియజేశాడు. కానీ ఈ కలియుగంలో పోలీసులకు, మావోయిస్టుల మధ్య జరుగుతున్న ఈ అహింస కాండను ఆపేది ఎవరని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మావోయిస్టులే లక్ష్యంగా పోలీసులు, పోలీసులే లక్ష్యంగా మావోయిస్టులు అన్న చందంగా దండకారణ్యాలు దద్దరిల్లుతున్నాయి. ఎప్పుడు ఏం జరుగుతుందోనని అడవుల్లోని గిరిజన గ్రామాల బిడ్డలుభయాందోళన చెందుతున్నారు. గురువారం తెల్లవారుజామున ములుగు జిల్లా వాజేడు మండలం పెనుగోలు కాలనీలో మావోయిస్టులు హింసకాండకు పాల్పడ్డారు. అదే గ్రామానికి చెందిన పంచాయతీ సెక్రెటరీని, అతని సోదరుడిని రాత్రి వేళలో కొందరు మావోయిస్టులు ఇంట్లల్లోకి ప్రవేశించి కిరాతకంగా నరికి చంపారు. ఈ ఘటనతో మరోసారి దండకారణ్యం ఉలిక్కిపడింది.

### అంతరించిపోతున్న నక్సలిజం..

గత కాంగ్రెస్ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి నేటి రేవంత్ రెడ్డి వరకు మావోయిస్టుల ఉనికి తగ్గినట్టుగా గణాంకాలు చెబుతున్నాయి. ఒక్క 2024 లోనే సరిహద్దు ప్రాంతమైన ఛత్తీస్ గఢ్ ఎన్ కౌంటర్ లలో సుమారు 207 మంది మావోయిస్టులు చనిపోయినట్లు అంచనా. ముఖ్యంగా ఛత్తీస్ గఢ్, భద్రాద్రి కొత్తగూడెం ప్రాంతాల్లో అనేకమంది మావోయిస్టులు మృత్యువాత పడ్డారు. 2004 నుండి 2024 వరకు దేశంలోని పది రాష్ట్రాలలోని 38 జిల్లాలకు చెందిన సుమారు 7696 మంది మావోయిస్టులు మృతిచెందినట్లు సమాచారం. ఇలా నక్సలిజాన్ని అంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక ప్రణాళికలు రచిస్తున్నప్పటికీ ఎప్పటికప్పుడు మావోయిస్టులు కూడా వారి ఉనికిని చాటుకునేందుకు అనేక పంథాలను అవలంబిస్తున్నారు. గత కొన్ని దశాబ్దాలుగా జరుగుతున్న ఈ అరణ్యకాండకు ముగింపు మాత్రం దక్కడంలేదు. ఒకరిపై ఒకరు పై చేయి సాధించాలని అమాయకమైన గిరిజనులను మట్టుపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని కొందరు మేధావులు ప్రశ్నిస్తున్నారు. వీరి లక్ష్యం ఏదైనాప్పటికీ ఎటువంటి స్వార్థబుద్ధులు లేని ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం ముమ్మాటికి తప్పేనని కొందరు మేధావులుప్రశ్నిస్తున్నారు.

### ఇన్ఫార్మర్ల నేపంతో బలైపోతున్న గిరిజనులు..

భద్రాద్రి కొత్తగూడెం, ఛత్తీస్ గఢ్ జిల్లాల్లో కొనసాగుతున్న హింసకాండ నేటి యువతరానికి పెనుముప్పుగా మారింది. అర్థ శతాబ్దపు అజ్ఞానంలో కూరుకుపోయి కొందరు యువత మావోయిస్టు సిద్ధాంతాలను అనుచరిస్తున్నారని, వారిని సరైన దారిలో పెట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జనజీవన స్రవంతిలో కలవండని పలు కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ వారిని నిలువరించడంలో విఫలమయ్యారనే చెప్పకోవచ్చు. నిత్యం మావోయిస్టులు వారి ఉనికిని చాటుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. అదేవిధంగా శాంతి భద్రతలను కాపాడే విషయంలో పోలీసులు ఎన్ని ఎత్తుగడలు వేసినా ప్రతిచర్య దాడులు ఆగడంలేదు. వీరి వలన ఇప్పటికే ఎంతోమంది గిరిజనులు ఇన్ఫార్మర్ల నేపంతో బలి పశువులయ్యారు. అమాయకమైన గిరిజనులు పోలీసులకు సహకరిస్తే మావోయిస్టులతో ముప్పు. అదేవిధంగా అన్నలకు సహకరిస్తే పోలీసులతో ముప్పు అనే చందంగా గిరిజన ప్రాంతాల్లోని గ్రామాల ప్రజలు ఎప్పుడు ఏం జరుగుతుందోననే భయాందోళనలో ఉన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం అందించకపోతే ఇంకెంతమంది గిరిజనులు అడవుల్లో పేలుతున్న తూటాలకు బలికాక తప్పదో.

# టైగర్ రిజర్వు పరిధిలోని గ్రామాల తరలింపు

## పకడ్బందీ చర్యలకు నిర్ణయం

**ప్రభుత్వం పట్ల విశ్వాసాన్ని కల్పిస్తూ పునరావాస చర్యలు చేపట్టాలి**

**అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వుల పైమంత్రి కొండా సురేఖ సుదీర్ఘ సమీక్ష**

**పెరుగుతున్న పులుల సంఖ్య .. ఆహారం కోసం జింకల సంఖ్య పెంపునకు చర్యలు**

**అటవీశాఖ చేపడుతున్న చర్యలపై మంత్రి సురేఖ హర్షం**

**హైదరాబాద్, మహా :** అమ్రాబాద్ టైగర్ రిజర్వ్, కవ్వాల్ టైగర్ రిజర్వుల పరిధిలో గ్రామాల తరలింపు ప్రక్రియ ప్రజల భావోద్వాగాలతో ముడిపడి ఉన్నందున, ప్రజలకు ప్రభుత్వం పట్ల విశ్వాసాన్ని కల్పిస్తూ పునరావాస ప్రక్రియను చేపట్టాలని మంత్రి సురేఖ అటవీ అధికారులను ఆదేశించారు. ఉత్తర, దక్షిణ సరిహద్దులుగా విస్తరించిన టైగర్ రిజర్వులు తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేకతను చేకూర్చాయని, వాటి ప్రత్యేకతను కాపాడేందుకు అటవీశాఖ నిరంతర చర్యలు చేపట్టాలని మంత్రి సురేఖ సూచించారు. ఈ రోజు డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలోని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ మంత్రిత్వ శాఖ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో మంత్రి, టైగర్ రిజర్వ్స్ గవర్నింగ్ బాడీస్ చైర్ పర్సన్ శ్రీమతి కొండా సురేఖ గారి ఆధ్వర్యంలో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్, కవ్వాల్ టైగర్ రిజర్వ్ ల గవర్నింగ్ బాడీస్ సమావేశం జరిగింది.

ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే రేకుపల్లి భూపతి రెడ్డి, అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, పీసీసీఎఫ్ (హెచ్ఓఎఫ్ఎఫ్) ఆర్.ఎం.డోబ్రియాల్, పీసీసీఎఫ్ (వైల్డ్ లైఫ్) ఏలూసింగ్, డీసీసీఎఫ్ ఆంజనేయులు(హెడ్ ఆఫీస్), సీఎఫ్, ఎఫ్ డీపీటీ రాంబాబు (అమ్రాబాద్ టైగర్ రిజర్వ్), సీఎఫ్, ఎఫ్ డీపీటీ శాంతారాం (కవ్వాల్ టైగర్ రిజర్వ్), డీఎఫ్ఓలు రోహిత్ (నాగర్ కర్నూల్), బాజీరావ్ పాటిల్ (ఆదిలాబాద్), రాజశేఖర్ (నల్గొండ), శివాశిష్(మంచిర్యాల్), ఎఫ్ డిఓ రామ్మూర్తి(మన్ననూర్), ఓఎస్డీ శంకరన్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అటవీ శాఖ ఉన్నతాధికారులు టైగర్ రిజర్వ్ ల గవర్నింగ్ బాడీస్, టైగర్ కన్సర్వేషన్ ఫౌండేషన్, గవర్నింగ్ బోర్డుల ఏర్పాటు, విధి విధానాలను మంత్రికి సమగ్రంగా వివరించారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలో చేపడుతున్న గ్రామాల తరలింపు ప్రక్రియ పై మంత్రి సురేఖ అధికారులను ఆరా తీశారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వు పరిధిలో 26 కోర్ (కేంద్రీకృత) గ్రామాలుండగా, ప్రస్తుతం వాటిలో 4 గ్రామాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నట్లు మంత్రి సురేఖ వివరించారు. పలు తెగలకు చెందిన ఆదివాసీలకు తమ ఆవాస ప్రాంతాలతో తరతరాలుగా అనుబంధం వుంటుందని, ఈ నేపథ్యంలో వారికి సంపూర్ణమైన నమ్మకాన్ని కల్పిస్తూ, వారి భద్రతకు భరోసానిస్తూ తరలింపు ప్రక్రియను చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అతిపెద్ద కోర్ ఏరియా కలిగిన రెండవ టైగర్ రిజర్వుగా అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ నిలవడం పట్ల మంత్రి హర్షం వ్యక్తం చేశారు. పెరుగుతున్న పులుల ఆహారలభ్యతకు అనుగుణంగా జింకల సంఖ్యను పెంచే దిశగా చేపడుతున్న చర్యలను మంత్రి ప్రశంసించారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలోని దాదాపు 20 శాతం ప్రాంతాన్ని పర్యాటక అవసరాలకు వినియోగించుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. మన్ననూర్, మద్దిమడుగు, సోమశిల, దోమలపెంట ఎకో టూరిజం సర్క్యూట్లలో ప్రస్తుతం పర్యాటక సేవలు అందిస్తున్నట్లు అధికారులు మంత్రి సురేఖకు వివరించారు. కాటేజీలు, సఫారీ వాహనాలు, నేచర్ గైడ్ లు, వంటశాల మొదలైన సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. స్థానికులకు ఉపాధి కల్పించే లక్ష్యంతో ప్రణాళికాబద్ధంగా కార్యాచరణను అమలుచేస్తున్నట్లు అధికారులు మంత్రి సురేఖకు వివరించారు. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హాస్పిటాలిటి అండ్ మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో స్థానిక యువతకు శిక్షణనిచ్చి, వారి ఆధ్వర్యంలో వంటశాలను నిర్వహిస్తూ ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం అమలుచేస్తున్న కార్యక్రమాలతో పాటు పట్టుపురుగుల పెంపకంపై స్థానికులకు శిక్షణను కల్పించి, ఉపాధి అవకాశాలను కల్పించాలని సూచించారు.

సోమశిల, అమరగిరి ఎకో టూరిజం సర్క్యూట్, దోమలపెంటశ్రీశైలం ఎకో టూరిజం సర్క్యూట్ లను రాబోయే రోజుల్లో అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు మంత్రి సురేఖకు అధికారులు తెలిపారు. దోమలపెంటశ్రీశైలం ఎకోటూరిజం సర్క్యూట్ లో భాగంగా ఎంతో ప్రాశస్త్యమైన అక్కమహాదేవి గుహలకు తెలంగాణ ప్రభుత్వపరంగా భూ, జలమార్గాల్లో భక్తులకు యాత్రా సౌకర్యం కల్పించేందుకు గాను అవకాశాలను పరిశీలించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నల్లమల అటవీప్రాంతంలో వున్న తెలంగాణ అమర్ నాథ్ గా ప్రసిద్ధిగాంచిన సలేశ్వరం జాతరను భవిష్యత్ లో చేపట్టనున్న సర్క్యూట్ లలో చేర్చి, ప్రభుత్వపరంగా యాత్రా సౌకర్యాలను కల్పించేదిశగా కార్యాచరణను అమలుచేయాలని అధికారులను మంత్రి నిర్దేశించారు.

> పరిహారం రూ. 10 లక్షల నుండి
>
> **రూ. 20 లక్షలకు పెంపుపై చర్చ**
>
> వన్యప్రాణుల దాడుల ఘటనల్లో మరణించిన వారికి ఇచ్చే నష్టపరిహారాన్ని రూ. 10 లక్షల నుండి రూ. 20 లక్షలకు పెంచే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు మంత్రి సురేఖ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ మొత్తాన్ని రూ. 5 లక్షల నుంచి 10 లక్షలకు పెంచి ఇస్తున్న విషయాన్ని మంత్రి సురేఖ గుర్తు చేశారు. 'స్టేట్ లెవల్ కమిటి ఫర్ మిటిగేటింగ్ హ్యూమన్ యానిమల్ కాంఫ్లిక్ట్' పూర్తిస్థాయి చర్చల తర్వాత ఈ దిశగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని మంత్రి సురేఖ స్పష్టం చేశారు.

## దద్దరిల్లిన దండకారణ్యం...

**ఛత్తీస్ ఘడ్,మహా :** ఛత్తీస్ఘడ్‌లో భారీ ఎన్కౌంటర్ జరిగింది.సుక్మా జిల్లాలోని బెజ్జి అటవీప్రాంతంలో భద్రతా బలగాలకు,మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పులో పదిమంది మావోయిస్టులు మృతి చెందారు. దండకారణ్యంలో మావోయిస్టులు సమావేశమయ్యారనే పక్కా సమాచారంతో కూంబింగ్ నిర్వహిస్తున్న క్రమంలో భద్రతా దళాలకు మావోయిస్టులకు మధ్య హోరాహోరీ ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయి.ఉదయం నుంచే జరిగిన కాల్పుల్లో పది మంది మావోయిస్టులు మృతి చెందినట్లుగా సమాచారం. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశంలో భారీగా ఆయుధాలు, పేలుడు సామాగ్రిని భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మావోయిస్టులకు అడ్డాగా ఉన్న ఛత్తీస్ ఘడ్‌లోని సుక్మా జిల్లాలోని దండకారణ్యం మరోసారి కాల్పులతో దద్దరిల్లింది.మృతి చెందినవారిలో ముగ్గురు మహిళలు ఉన్నారు.మృతి చెందిన వారిలో... దూది మాసా(డివిసీఎం),మాద్వి లక్మా,దోరోకోసి(ఏసిఎంలు),కుంజమ్ బమన్,కాటంకోసి(పీ ఎల్ జి ఏ 8 కమాండర్),దూది హంగీ లను గుర్తించారు.మరో నలుగురిని గుర్తించాల్సి ఉందని...ఘటనా స్థలంలో ఏకే 471,ఎస్ ఎల్ ఆర్ 1,ఇన్సాస్ 1,సింగిల్ షాట్ గన్,1మరియు ఒక పిస్టల్ ను స్వాధీనం చేసుకున్నట్లు ఛత్తీస్ ఘడ్ పోలీసులు తెలిపారు.

# సాహిత్యమే చరిత్రకు సమగ్రమైన సాక్ష్యం

## మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

- మాతృమూర్తి, మాతృభూమి, మాతృభాషలే మన నిజమైన అస్తిత్వం
- జాతి సంస్కృతి, దేశ వైభవాలను సాహిత్యం ప్రతిబింబిస్తుంది
- నూతన సాహిత్య సృష్టితో పాటు, ప్రాచీన సాహిత్య అధ్యయనం అత్యంత కీలకం
- కలలోనూ మాతృభాషనే కలవరించే ప్రవాసుల స్ఫూర్తి ఆనందదాయకం
- దోహాలో 9వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సును ప్రారంభించిన పూర్వ ఉపరాష్ట్రపతి




**దోహా (ఖతార్), మహా :** సాహిత్యమే ఒకజాతి మనుగడకు లిఖితాధారం. ఒక దేశ వైభవాన్ని అక్కడి సాహిత్యం ప్రతిబింబిస్తుంది. భిన్నమైన విలువల అధ్యయనానికి కూడా సాహిత్యమే మూలాధారం. సాహిత్యమే చరిత్రకు సమగ్రమైన సాక్ష్యం అని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, ఆంధ్ర కళావేదిక ఖతార్ ఆధ్వర్యంలో దోహాలో జరుగుతున్న 9వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సును ప్రారంభించిన ఆయన, సాహిత్యసాంస్కృతిక వైభవానికి భారతదేశమే నిలువెత్తు సాక్ష్యమని, అందులోనూ తెలుగుకు సుసంపన్నమైన సాహిత్యం ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వంగూరి ఫౌండేషన్ వెబ్ సైట్ తో పాటు పలు ప్రచురణలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఖతార్ లో భారత రాయబారి విపుల్, మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్, ఆంధ్ర కళా వేదిక ఖతార్ అధ్యక్షులు వెంకప్ప భాగవతార్, వంశీ ఆర్ట్స్ థియేటర్ వ్యవస్థాపకులు డా. వంశీ రామరాజు సహా పలువురు తెలుగు సినీ, రాజకీయ, సాహిత్య ప్రముఖులు పాల్గొన్నారు. తెలుగు సుసంపన్నమైన సాహిత్యం ఉందన్న ఆయన, ప్రాచీన సాహిత్యం నుంచి ఆధునిక వచన సాహిత్యం వరకూ పరిణామాను క్రమంగా, ప్రజల అవసరాలకు తగ్గట్లుగా తెలుగు సాహిత్యం కొత్త పుంతలు తొక్కిందన్నారు. ఈ సందర్భంగా గుణాఢ్యుడు మొదలుకుని నన్నెచోడుడు, కవిత్రయం, పోతన, అన్నమయ్య, వేమన వంటి తెలుగు సాహితీ వెలుగులను స్మరించిన ఆయన, అవధానం వంటి ప్రక్రియలు తెలుగు సాహిత్యానికి మరింత వన్నె తీసుకొచ్చాయన్నారు. సాహిత్యంలో మన చరిత్ర ఉందనే విషయాన్ని గుర్తించకపోవటం విచారకరమన్న ఆయన, మన సాహిత్యం గురించి తెలియని వారు రాసిన చరిత్ర సమగ్రమైనది కాదని పేర్కొన్నారు. అముక్తమాల్యద వంటి గ్రంథాల్లో సాహితీ విలువలతో పాటు చారిత్రక అంశాలు, మానవీయ విలువలు ఉన్నాయన్నారు. తెలుగు సాహితీ చరిత్రను క్షుణ్ణంగా అధ్యయం చేస్తే, తెలుగు వారి చరిత్రను కూడా సమగ్రంగా తెలుసుకోవటం సాధ్యమౌతుందని తెలిపారు. భారతదేశ నిజమైన చరిత్రను ముందు తరాలకు అందించాల్సిన అవసరం ఉందన్న వెంకయ్యనాయుడు, ఇందు కోసం అన్ని భాషల్లో ఉన్న భారతీయ సాహిత్యాన్ని అధ్యయనం చేయాలని సూచించారు. ఇందు కోసం అంతర్జాతీయంగా ఉన్న సంస్థలు చొరవ తీసుకోవాలని సూచించిన ఆయన, రెండు దశాబ్దాల క్రితం తెలుగు దూరదర్శన్ లో ప్రసారమైన రాజశేఖర చరిత్ర, కాంతం కథలు, వేయిపడగలు, అమరావతి కథలు వంటి ధారావాహికల గురించి ప్రస్తావించారు. ఆ తర్వాత అలాంటి ప్రయత్నాలు సమగ్రంగా జరగలేదన్న ఆయన, తెలుగు సాహిత్యాన్ని ఓటీటీ ద్వారా ఈ తరం యువతకు పరిచయం చేయాలని కళాకారులకు, సాహితీ సంస్థలకు సూచించారు.

ప్రాచీన తెలుగు సాహిత్యాన్ని అందరూ అస్వాదించే విధంగా, వారి పరిపక్వత స్థాయిని బట్టి ప్రతి ఒక్కరికీ చేరువ చేసే ప్రయత్నాలు సాగాలన్న ఆయన నూతన సాహిత్య సృష్టితో పాటు, మన చరిత్ర, సంస్కృతులకు నెలవైన ప్రాచీన సాహిత్యాన్ని అక్కున చేర్చుకోవాలని సూచించారు. అప్పుడే ముందు తరాలు నిజమైన చరిత్రను తెలుసుకుని, మనదైన సంస్కృతికి వారసులుగా, మనవైన విలువలతో జీవితాన్ని సాగిస్తాయని పేర్కొన్నారు. మాతృమూర్తి, మాతృభూమి, మాతృభాషలే మన అస్తిత్వమన్న వెంకయ్యనాయుడు, మన సంస్కృతిని ముందు తరాలకు తెలియజేసే చక్కని వారధి మన భాషే అనే సత్యాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని ఆకాంక్షించారు. భాషా పరిరక్షణ ఉద్యమం మన ఇంటి నుంచే ప్రారంభం కావాలన్న ఆయన, ప్రతి ఒక్కరూ తమ ఇళ్ళలో, తమ కుటుంబ సభ్యులతో మాతృభాషలోనే మాట్లాడేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ఎన్ని భాషలు నేర్చుకున్నా, మాతృభాషలో పరిణతి ఉండాలన్న ఆయన, ఇందు కోసం తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలని, పిల్లలకు మన భాషలోని సాహిత్యాన్ని, మనదైన సంస్కృతిని పరిచయం చేసి, వారిని మనవైన మంచి విలువలతో తీర్చిదిద్దాలని సూచించారు. సృజనాత్మకతకు, మానవీయ విలువలకు, సామాజిక చైతన్యానికి పెద్ద పీట వేసే విధంగా నూతన పంథాలో రచనలు రావలసిన అవసరం ఉందన్న ఆయన, సమాజంలో అక్కడక్కడ పేరుకుపోయిన జాఢ్యాలకు వ్యతిరేకంగా రచయితల కలం కదం తొక్కాల్సిన అవసరం ఉందని ఆకాంక్షించారు.

# ములుగు ఏజెన్సీలో మావోల ఘాతుకం..!





- **ఇన్ ఫార్మర్ నెపంతో గొడ్డలితో నరికి చంపిన వైనం...**
- **పలుమార్లు హెచ్చరించిన మారని తీరు అంటూ లేక విడుదల**
- **మృతుల్లో పేరూరు పంచాయతీ కార్యదర్శి రమేష్**

**ములుగుప్రతినిధి:** మారుమూల ఏజెన్సీ ప్రాంతమైన ములు గు జిల్లా వాజేడు మండల కేంద్రంలోని పెనుగోలు కాలనీలో మావోయిస్టులు ఘాతుకాన్ని సృష్టించారు. పోలీసుల ఇన్ఫార్మర్ నేపంతో ఇద్దరు గిరిజన అన్నదమ్ములను గొడ్డలితో అతి కిరాతకంగా నరికి చంపారు. మృతుల్లో ఒకరైన ఉయిక రమేష్ పేరూరు పంచాయతీ కార్యదర్శి గా పనిచేస్తున్నారు. ఇదే గ్రామానికి చెందిన ఉయిక అర్జున్ అనే గిరిజన వ్యక్తిని కూడా సుమారు రాత్రి 11.30 నిమిషాల సమయంలో సాయుధులైన ఆరుగురు మావోయిస్టులు రెండు గ్రూపులుగా విడిపోయి ఇద్దరినీ ఒకే సమయంలో గొడ్డలితో నరికి చంపారు. ఉయిక అర్జున్ అక్కడికక్కడే మృతి చెందగా రమేష్ కొన ఊపిరితో కొట్టు మిట్టాడుతుండగా కుటుంబ సభ్యులు 108 సహాయం తో ఏటూరు నాగారం ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. ఈ ఇద్దరు వ్యక్తులు కూడా పోలీసులకు ఇన్ ఫార్మర్లుగా మారి గత కొద్ది సంవత్సరాలుగా మావోయిస్టు కదలికలను పోలీసులకు చేరవేస్తూ మావోయి స్టులపై దాడులకు కారకులు అయ్యారని పలుమార్లు హెచ్చ రించిన పద్ధతి మార్చుకోకపోవడంతో హతమార్చడం జరిగిం దని వాజేడు వెంకటాపురం ఏరియా కార్యదర్శి శాంత పేరుతో లేఖలో పేర్కొన్నారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

### మండల కేంద్రంలోనే...

ఇప్పటి వరకు ములుగు జిల్లా సరిహద్దు అటవీ ప్రాంతాలకే పరిమితం అయిన మావోయిస్టు పార్టీ ఉనికి ఏకంగా మండల కేంద్రంలో బయటపడడం సంచలనంగా మారింది. వాజేడు మండల కేంద్రాన్ని ఆనుకుని ఉన్న పెనుగోలు కాలనీకి చెందిన ఇద్దరిని పోలీస్ ఇన్ ఫార్మర్ పేరిట నక్సల్స్ హత్యం చేయడం కలకలం లేచింది. అయితే ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ములపై ఆరోపించేందుకు వచ్చిన దళం వేర్వేరుగా లేఖలు వదిలేయడం కొత్త ఆనవాయితిని అమలు చేస్తున్న ట్టుగా అనిపిస్తోంది. పంచాయితీ కార్యదర్శి రమేష్, అతని సోదరుడు అర్జున్ ను టార్గెట్ చేసేందుకు వచ్చిన మావోయి స్టు పార్టీ నక్సల్స్ వేర్వేరుగా లేఖలు వదలి వెల్లడం వెనక ఉన్న ఆంతర్యం ఏంటన్నదే అంతుచిక్కడం లేదు. గతంలో టార్గెట్లను హతం చేసిన తరువాత ఆ ఘటనలో ఎంత మందిని చంపితే వారి వివరాలను వెల్లడిస్తూ ఒకే లేఖలో వెల్లడించేవారు. కానీ వాజేడు మండల కేంద్రంలో మాత్రం మావోయిస్టులు అన్నదమ్ములను హతం చేసి వేర్వేరుగా లేఖలు వదిలేయడం గమనార్హం.




యువజన సర్వీసుల శాఖ, సెట్విన్ ఆధ్వర్యంలో

## మూడునెలల పాటు వృత్తి నైపుణ్య శిక్షణ

**సర్టిఫికెట్లు ప్రదానం చేసిన కలెక్టర్ రాజర్షిషా**

**మహా ప్రతినిధి ఆదిలాబాద్ :** యువజన సర్వీసుల శాఖ, సెట్విన్ ఆధ్వర్యం లో వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రం ద్వారా నిరుద్యోగ యువతకు మూడు నెలల పాటు ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం జరిగిన శిక్షణ పూర్తి చేసుకున్నఅభ్యర్థుల సర్టిఫికెట్ల ప్రదానోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాజర్షి షా ముఖ్య అతిథిగా హాజరై ప్రశంసా పత్రాలను బహూకరించారు. ఈ సందర్భంగా శిక్షణా కేంద్రం లో టైలరింగ్, కంప్యూటర్, సీసీ కెమెరాలు, మొబైల్ రిపేరింగ్, కంప్యూటర్ శిక్షణ, రిఫ్రిజరేటర్, ఎయిర్ కండిషనర్ సర్వీసింగ్స్ లలో 3 నెలల కాల పరిమితులలో సుశిక్షుతులైన అభ్యర్థుల ద్వార శిక్షణా ఇవ్వడం జరుగుతుందని, నిరుపేద యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, తద్వారా లబ్ధి పొందాలని ఆయన సూచించారు.ఈ మూడు నెలల శిక్షణ లో 120 మంది యువత శిక్షణ పొందారని తెలిపారు.టైలరింగ్ నేర్చుకున్న సిబ్బంది డ్వాక్రా గ్రూపు లో సభ్యులుగా చేరాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డీవైఎస్ ఓ వెంకటేశ్వర్లు, జిల్లా సంక్షేమాధికారి సబిత, ప్రిన్సిపాల్ రవీందర్, సిబ్బంది, వైటీసీ ఇంఛార్జి, బలరాం, లలిత, సాగర్, విశాల్, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం

**ఆకస్మిక తనిఖీ చేసిన మంత్రులు**

**నల్లగొండ, మహా:** మంత్రులు ఆకస్మిక తనిఖీలతో ఆశ్చర్యపరిచారు. నల్గొండ మండలం కొత్తపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు, రోడ్లు, భవనాలు ,సినిమాగ్రోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రానికి వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలవద్దని, తూకం విషయంలో జాగ్రత్తలు వహించాలని సూచించారు. కొనుగోలు కేంద్రం ద్వారా కొనుగోలు చేసిన ధాన్యానికి రైతులకు తక్షణమే చెల్లింపులు చేస్తుండడం పట్ల మంత్రులు సంతృప్తి వ్యక్తం చేశారు. కొత్తపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వహణ భేష్ అని మంత్రుల కితాబు ఇచ్చారు

# గ్రేటర్ పై సర్కార్ మాస్టర్ ప్లాన్

## వేగవంతమైన జీహెచ్ఎంసీ విస్తరణ

**51 గ్రామాల విలీనం.. శివారు భూములకూ డిమాండ్**
**విలీన గ్రామాలలో మౌలిక వసతులపై నజర్**
**హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామాల ప్రజలు**



**హైదరాబాద్, మహా** : గ్రేటర్ హైదరాబాద్ పరిదిని విస్తరించిన మహానగరంగా పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలోనే గ్రేటర్ హైదరాబాద్ శివారులో ఉన్న పలు గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీల్లో విలీనం చేయాలని ఇప్పటికే సర్కార్ నిర్ణయించింది. గ్రేటర్ హైదరాబాద్‌ను ఔటర్ రింగ్ రోడ్డు వరకూ విస్తరించే క్రమంలో రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లోని 51 గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీల్లో విలీనం చేయాలని నిర్ణయం తీసుకోగా తొలిదశలో శివారు మున్సిపాలిటీల్లో 51 గ్రామాలను కలిపేందుకు 2 నెలల క్రితమే ప్రభుత్వం ఆర్డినెన్స్ కూడా జారి చేసింది. ఈ ఆర్డినెన్స్‌కు అనుగుణంగా మున్సిపాలిటీ అధికారులు చర్యలు చేపట్టారు. గ్రేటర్ శివారులోని మున్సిపాలిటీల్లోకి అక్కడున్న సమీప గ్రామపంచాయతీల విలీన ప్రక్రియ ప్రారంభమైంది. ఈ విలీన ప్రక్రియలో భాగంగా గ్రామ పంచాయతీల రికార్డులు, భూములను స్వాధీనం చేసుకున్న అధికారులు ఇళ్లు, ప్రభుత్వ ఆస్తులను మున్సిపాలిటీల్లోని వార్డుల ఖాతాల్లోకి చేర్చుతున్నారు. ప్రాపర్టీ ట్యాక్సులు వసూలు చేస్తున్నా ఆయా గ్రామ పంచాయతీల పేర్లను సాఫ్ట్‌వేర్‌లో ఎక్కించకపోవటంతో ఆన్‌లైన్ ద్వారా ట్యాక్స్ చెల్లించటం సాధ్యం కావట్లేదు. అయితే ఇప్పుడు మున్సిపాలిటీల్లో విలీనమవుతుండటంతో వ్యవస్థ పూర్తిగా మారనుంది. ఇక ఇప్పటి వరకు గ్రామ పంచాయతీల్లో నివసిస్తున్న వారంతా మున్సిపాలిటీ వ్యవస్థలోకి వెళ్తుండటంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఆయా గ్రామాల్లో ఉన్న భూములకు ఇన్ని రోజులూ అంతంతమాత్రంగానే ధరలు పలుకగా ఇప్పుడు మున్సిపాలిటీలో కలుపుతుండటంతో జీహెచ్ఎంసీ పరిధిలోకి వస్తుండటంతో అక్కడి భూములకు మంచి డిమాండ్ రానుంది. దీంతో ఆ భూముల ధరలరు రెక్కలు రానున్నాయి. ఈ క్రమంలో అక్కడి ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

**ఉద్యోగులు కూడా పురపాలక శాఖ పరిధిలోకి**

ఇప్పటివరకు గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులుగా విధులు నిర్వహించిన ఉద్యోగులు.. నేరుగా పురపాలక శాఖ అధికారులుగా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. ఇప్పటివరకు వారు విధులు నిర్వహించిన సంవత్సరాలను సర్వీసుగా పరిగణించనున్నార. గ్రామ పంచాయతీల్లో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహించిన వారిని కూడా మున్సిపాలిటీ అధికారులు తీసుకున్నా... వార్డుల్లో పని విధానం, ఇతర కార్యకలాపాలను దృష్టిలో ఉంచుకుని ఉద్యోగం ఇస్తున్నారు. సర్వే లెక్కలు, గ్రామ పంచాయతీల్లో పన్ను వసూళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, పంచాయతీ గ్రామాల్లో పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బందికి కూడా ఉద్యోగాలు ఇస్తున్నారు. వీరందరికీ పురపాలక శాఖ నుంచే జీతాలు వచ్చేలా చర్యలు చేపట్టారు. మున్సిపాలిటీల పరిధి పెరగటంతో పంచాయతీల్లో పని చేస్తున్న వారికి ఉద్యోగాలు ఇస్తుండటంతో పాటు కొత్తగా మరికొంతమందిని నియమించుకోవాల్సిన అవసరం ఉందని ఉన్నతాధికారులకు విన్నపాలు వస్తున్నాయి. మరోవైపు మున్సిపాలిటీల్లో విలీనమవుతున్న 51 గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై కూడా మున్సిపల్ కమిషనర్లు ఫోకస్ పెట్టారు. గ్రామాల్లో పరిశుభ్రత పాటించాలని ఆదేశాలు జారీ చేశారు. తాగునీటి బెడద ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్లతో సరఫరా చేయాలని అధికారులు నిర్ణయించారు. ఆయా గ్రామాల్లో ఉన్న మురుగునీటి వ్యవస్థపై కూడా అధికారులు పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

**మున్సిపాలిటీల్లో విలీనమైన గ్రామ పంచాయతీలు ఇవే....**

మేడ్చల్ జిల్లాలోని మేడ్చల్ మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాలు రాయిలాపూర్, పూడూరు, నాగారం మునిసిపాలిటీలో విలీనమైన గ్రామాలు రాంపల్లి, దయరా, కరీంగూడ, గోధుమకుంట, బోగారం తూంకుంట మునిసిపాలిటీలో విలీనమైన గ్రామాలు శామీర్‌పేట, బొమ్మరాశిపేట, బాబాగూడదమ్మాయిగూడ మునిసిపాలిటీలో విలీనమైన గ్రామాలు కీసర, చీర్యాల్, యాద్గార్‌పల్లి, తిమ్మాయిపల్లి, అంకిరెడ్డిపల్లి, నర్సంపల్లి, పోచారం మునిసిపాలిటీలో విలీనమైన గ్రామాలు కాచవాని సింగారం, ప్రతాప్ సింగారం, చౌదరిగూడ, కొర్రముల, వెంకటాపూర్, ఘట్‌కేసర్ మునిసిపాలిటీలో విలీనమైన గ్రామాలు ఘనపూర్, ఏదులాబాద్, అంకుశాపూర్, అవుషాపూర్, మర్రిపల్లిగూడ, గుండ్లపోచంపల్లి మునిసిపాలిటీలో విలీనమైన గ్రామాలు మునీరాబాద్, గౌడవెల్లి గ్రామాలున్నాయి. ఇకపోతే సంగారెడ్డి జిల్లాలోని అమీన్‌పూర్ మునిసిపాలిటీలో కిష్టారెడ్డిపేట, ఐలాపూర్ తండా, ఐలాపూర్, దయరా, సుల్తాన్‌పూర్, పటేల్ గూడ, తెల్లాపూర్ మునిసిపాలిటీలో విలీనమయ్యే గ్రామాలు పోచారం, ముత్తంగి, ఘనాపూర్, కర్దానూర్, పాట గ్రామాలున్నాయి. రంగారెడ్డి జిల్లాలోని పెద్ద అంబర్‌పేట మునిసిపాలిటీలో విలీనమయ్యే గ్రామాలు తారామతిపేట, గౌరెల్లి, కుత్బుల్లాపూర్, బాచారం నార్సింగి మునిసిపాలిటీలో మీర్జాగూడ, తుక్కుగూడ మునిసిపాలిటీలో హర్షగూడ గ్రామాలుండగా, శంషాబాద్ మునిసిపాలిటీలో చిన్న గోల్కొండ, పెద్ద గోల్కొండ, రషీద్‌గూడ,, బహదూర్ గూడ, ఘాంసీమియా గూడ, హమీదుల్లానగర్ గ్రామాలున్నాయి.

# లగచర్ల ఘటన కేసీఆర్ కుట్రే

## కలెక్టర్ హత్యకు బిఆర్ఎస్ ప్లాన్

**కాంగ్రెస్ నిజనిర్ధారణ బృందం ఆరోపణ**



**హైదరాబాద్:** వికారాబాద్ జిల్లా లగచర్లలో కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను హత్య చేసేందుకు బీఆర్ఎస్ కుట్ర చేసిందని నిజనిర్ధారణ బృందం ఆరోపించింది. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు మాజీ సీఎం కేసీఆర్ కుట్రలు పన్నారని బృందం సభ్యులు ఆరోపించారు. లగచర్ల దాడి ఘటనలో నిజానిజాలు తేల్చేందుకు ఎంపీ మల్లు రవి, రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి కలిసి శుక్రవారం లగచర్లలో పర్యటించారు. ఆ రోజు జరిగిన దాడి, ఘర్షణ వాతావరణంపై గ్రామస్థులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. దాడిలో ఎవరెవరు పాల్గొన్నారనే అంశాలపైనా ఆరా తీశారు. బీఆర్ఎస్ నాయకులే ప్రకా పథకం ప్రకారం దాడి చేశారని నిర్ధారణకు వచ్చారు. అనంతరం హైదరాబాద్‌లోని సచివాలయానికి చేరుకుని మీడియా సమావేశం నిర్వహించారు.

**భూమి లేని వారు దాడి**

ఈ సందర్భంగా ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ.. "మా ప్రతినిధుల బృందం లగచర్ల గ్రామానికి వెళ్లింది. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, స్థానిక రైతులతో మాట్లాడాం. దాడి జరిగిన రోజు కలెక్టర్ రాగానే కొందరు తాగి వచ్చి కర్రలు, రాళ్లతో కలెక్టర్, అధికారులపై దాడికి పాల్పడ్డారు. గతంలో ఇలాంటి దాడులు ఎప్పుడూ చూడలేదు. ఈ దాడి వెనక బీఆర్ఎస్ హస్తం ఉంది. మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి, బీఆర్ఎస్ నేత సురేశ్ సహా మరి కొంతమంది నాయకులు ప్రణాళిక ప్రకారమే దాడి చేశారు. 17 మంది భూమిలేని వారు దాడి చేయడానికి అక్కడికి వచ్చారు. త్వరలోనే అక్కడి మాజీ సర్పంచ్‌లు, ముఖ్య నాయకులు సీఎం రేవంత్ రెడ్డిని కలిస్తామని చెప్పారు. ఘటనపై నిజ నిర్ధారణ రిపోర్టును సీఎం, ప్రతిపక్ష నాయకులకు ఇస్తాం. రేవంత్ ప్రభుత్వం రైతులకు వ్యతిరేకం కాదు. బలవంతంగా వారి భూములు తీసుకునే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు." అని చెప్పారు.

**ఎవ్వరినీ మాట్లాడనీయలేదు..**

లగచర్లలో రైతుల స్వేచ్ఛకు భంగం కలిగిందని రైతు కమిషన్ ఛైర్మన్ కోదండ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ నేతలు కుట్రపూరితంగా వ్యవహరించడం వల్లే దాడి జరిగిందని ఆయన చెప్పారు. రైతులకు ఇష్టం లేని పని తానెప్పుడూ చేయనని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారని ఆయన తెలిపారు. పరిశ్రమలు రావడం వల్ల యువతకు ఉద్యోగాల కల్పన జరుగుతుందని ముఖ్యమంత్రి అన్నారని కోదండ రెడ్డి చెప్పారు. పబ్లిక్ హియరింగ్‌లో రైతులు, స్థానికులను బీఆర్ఎస్ నాయకులు మాట్లాడనీయలేదని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో పరిశ్రమలు, వ్యవసాయం రెండూ అభివృద్ధి చెందాలని సీఎం ఆకాంక్షించారని కోదండ రెడ్డి చెప్పుకొచ్చారు.

### కేసీఆర్ కుట్ర..

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో కుట్రలు చేశారని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు. కలెక్టర్ ప్రతీక్ జైన్‌ని చంపించే ప్రయత్నం చేశారని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో భయానక వాతావరణం సృష్టించాలని కుట్రలు పన్నారని మండిపడ్డారు. జిల్లాలో రూ.4 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేశారని, ఇప్పుడు రూ.15 వేల కోట్లతో ఇండస్ట్రీ బెల్ట్ తీసుకురావాలని సీఎం రేవంత్ భావిస్తున్నారని రామ్మోహన్ రెడ్డి అన్నారు. ప్రజాప్రభుత్వంపై బీఆర్ఎస్ మాజీ మంత్రులు హరీశ్ రావు, కేటీఆర్ దురాగతాలు చేస్తున్నారని ఎమ్మెల్యే ధ్వజమెత్తారు. పరిశ్రమలు పెట్టడానికి ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి కోరారు.

# రాచకాల్వ సర్వే పూరి చేయాలి



ఇరిగేషన్ అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే సుధీర్ రెడి

- ట్రంక్లైన్ పనులను ప్రారంభించాలి
- ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

**ఎల్బీనగర్, నవంబర్ 22:** రాచకాల్వ సర్వే పూరి చేసి, ట్రంక్లైన్ పనులను ప్రారంభించాలని అధికారులను ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆదేశించారు. బీఎన్‌రెడి డివిజన్ శివారు కాలనీల డ్రైనేజీ అవుట్ లెట్ కోసం సాహెబ్నగర్ గ్రామశివారులో నిలిచిపోయాయి. ఇక్కడ రైతుల భూములు ఉండడంతో పనులను ఆగిపోయాయి. దీంతో సానికులు ఎమ్మెల్యేను కోరారు. సమస్య పరిష్కారం కోసం సాహెబ్ నగర్ గ్రామ రైతులతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఇప్పటికే రెండుసారు సమావేశమయ్యారు. అనంతరం ఎల్బీనగర్ జోన్ సిటీ పానర్ శ్రీనివాస్యాదవ్, టౌన్ప్లానింగ్ ఏసీపీ శ్యామ్సన్తో రెండు రోజుల క్రితం సమావేశమై చర్చించారు. ఇందులో భాగంగా శుక్రవారం ఇరిగేషన్ అధికారులతో ట్రంక్లైన్ పనులపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. ట్రంక్ లైన్ నిర్మాణానికి రెండోసారి సుమారు రూ.2కోటు మంజూరు చేశామన్నారు. కాంట్రాకర్ సైతం పనులను ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నారని.. అధికారులు పనులను ప్రారంభించడానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. ట్రంక్లైన్ పనుల కోసం మరోసారి రాచకాల్వను మొతం సర్వే చేయించి, పనులపై ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రాచకాల్వ సర్వేను త్వరగా పూరి చేసి, వచ్చే వర్షాకాలంలోపు ట్రంక్లైన్ పనులను పూరి చేయాలని ఇరిగేషన్ అధికారులను ఎమ్మెల్యే సుధీర్‌రెడి ఆదేశించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కటికరెడ్డి అరవింద్ డి, ఇరిగేషన్ అధికారులు శుకాజ, సతీశ్, అశోక్ పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్మల్‌లో మధుమేహ వ్యాధి నిర్ధారణ శిబిరం

## 65 మందికి పరీక్షలు చేసి వ్యాధిపై అవగాహన




**మహా ప్రతినిధి నిర్మల్ :** లయన్స్ క్లబ్ ఆఫ్ నిర్మల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మధుమేహ వ్యాధి నిర్ధారణ వారోత్సవాల్లో భాగంగా నాలుగవ రోజు స్థానిక పంచాయతీరాజ్ కార్యాలయంలో సిబ్బందికి మధుమేహ వ్యాధి నిర్ధారణ శిబిరం నిర్వహించారు. విజిలెన్స్, క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ శైలేందర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంజనీర్స్ అసోసియేషన్ నిర్మల్ డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ కామారపు జగదీశ్వర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. దాదాపు 65 మందికి పరీక్షలు చేసి కరపత్రాలను అందజేసి మధుమేహ వ్యాధిపై అవగాహన కల్పించారు. డయాబెటిక్ పేషంట్ ఎడ్యుకేటర్ ప్రోగ్రాం ఆఫీసర్ లయన్ నేరెళ్ల హనుమంతు, ల్యాబ్ టెక్నీషియన్ సుమిత్ర పరీక్షలు నిర్వహించారు. లయన్స్ క్లబ్ కోశాధికారి లయన్ లక్ష్మీనారాయణ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం



**మహా:** జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో శుక్రవారం దివ్యాంగులకు ఆటలు పోటీలు నిర్వహించారు.అదనపు కలెక్టర్ దివ్యాంగుల జిల్లా సంక్షేమ ఇన్చార్జ్ అధికారి ఫైజన్ అహ్మద్ కార్యక్రమానికి హాజరై పోటీలను ప్రారంభించారు. క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని ఆయన అన్నారు. దివ్యాంగులు క్రీడా పోటీల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు.జిల్లా స్థాయిలో సత్తాచాటిన దివ్యాంగులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ విజయలక్ష్మి, సీడీపీఓ నాగమణి, ఏసిడిపిఓ నాగలక్ష్మి, సూపర్వైజర్ విజయ గౌరీ, దివ్యాంగుల సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# డివిజన్ సమస్యలు పరిష్కరించాలి

## జోనల్ కమిషనర్‌కు కార్పొరేటర్ వినతి




**ఎల్బీనగర్, నవంబర్ 22:** కొతపేట డివిజన్లో నెలకొన్న సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్న కార్పొరేటర్ పవన్కుమార్ కోరారు. శుక్రవారం జోనల్ కార్యాలయంలో కమిషనర్ కార్పొరేటర్ సమావేశమై, కొతపేట డివిజన్లో నెలకొన్న సమస్యలను వివరించారు. డివిజన్లోని ప్రతి కాలనీలో సీసీరోడు వేయించాలని కోరారు. భరత్నగర్ ఫేస్ 1, మారుతినగర్ లోని శ్వేత గారెన్ ఎదురుగా రోడు, ఓల్ మారుతీనగర్ లోని గురుమందిర్ రోడు మొతం పూరిగా ధ్వంసమైనటు తెలిపారు. ఆయా కాలనీలో సీసీరోడు వేయించాలని కోరారు. కొతపేట డివిజన్లోని కొన్ని కాలనీలో వీధిదీపాలు లేవని, కొతగా లైటు వేయించాలని సూచించారు. ఆయా కాలనీలో సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ పవన్ కుమార్ కోరారు.

# గ్రంథాలయాలు విజ్ఞాన గనులు

## కలెక్టర్ అభిలాష అభినవ్



**మహా ప్రతినిధి నిర్మల్ :** గ్రంథాలయాలను ఉపయోగించుకొని విజ్ఞానవంతులు కావాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు.శుక్రవారం పట్టణంలోని జిల్లా గ్రంథాలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా గ్రంథాలయంలో వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థుల కోసం సరిపడినన్నిఅన్ని రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచాలన్నారు. గ్రంథాలయంలో కుర్చీల కొరత రాకుండా చూడాలన్నారు. అనంతరం పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులతో మాట్లాడుతూ, వారికి గల అవసరాలను అడిగి తెలుసుకున్నారు. సమయపాలనను పాటిస్తూ శ్రద్ధగా చదివి అనుకున్న లక్ష్యాలను సాధించాలని సూచించారు. గ్రంథాలయంలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ సయ్యద్ అర్జుమంద్ అలి, తాహసిల్దార్ రాజు, అధికారులు మోహన్ సింగ్, విజయ శ్రీ, సిబ్బంది తదితరులు, పాల్గొన్నారు.

# మాది భరోసా -ఎస్పీ జానకి షర్మిల




**మహా ప్రతినిధి నిర్మల్:** భరోసా సహాయ కేంద్రాలు సమగ్రమైన సహాయాన్ని అందించడానికి ఉపయోగ పడతాయని ఎస్పీ జానకి షర్మిల అన్నారు. దాంపత్య జీవితం వెలగనిద్దాం దేదీప్యంగా నినాదంతో పని చేస్తున్న నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయ సమీపంలో గల భరోసా కేంద్రాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. భరోసా కేంద్రంలో ఒక్కటైన జంటలతో సమావేశం నిర్వహించి అభినందించారు. బాలికలు, మహిళలకు సాయం చేసే ఉద్దేశంతో తెలంగాణ పోలీసుశాఖ ఆధ్వర్యంలోని మహిళా భద్రతా విభాగం భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసిందని ఎస్పీ తెలిపారు.

# చాందా(టి) బైపాస్ వద్ద పోలీసుల తనిఖీల్లో పిస్టల్స్ లభ్యం

## మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన ఎస్పీ




**మహా ప్రతినిధి ఆదిలాబాద్ :** పట్టణ శివారులోని చాందా టీ బైపాస్ వద్ద పోలీసులు జరిపిన తనిఖీల్లో నాలుగు పిస్టల్స్ లభ్యం కావడం సంచలనం రేపింది. ఆంధ్రప్రదేశ్ కు చెందిన పలువురు వ్యక్తులు వీటిని కర్నూల్ కు తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా... జిల్లా పోలీసులు పక్కా సమాచారంతో వాహనాలు తనిఖీ చేసి... నిందితులను అదుపులోకి తీసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ మేరకు ఎస్పీ గౌష్ ఆలం శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రభుత్వ నిషేధిత జనశక్తి దళ ఏర్పాటుకు నిందితులు ఆర్థికంగా, ఆయుధ పరంగా దళం పునర్నిర్మాణం చేస్తుండగా ఆదిలాబాద్ జిల్లా పోలీసులు పక్కా సమాచారంతో వారిని పట్టుకుని దళం ఏర్పాటును విచ్ఛిన్నం చేసినట్లు ఎస్పీ గౌష్ ఆలం తెలిపారు. కేసులో ప్రధాన నిందితుడైన వెంకటరెడ్డి గతంలో జనశక్తి పార్టీలో పనిచేసి అరెస్టు అయ్యారని, తన మిత్రుడి హత్యకు ప్రతీకార చర్యగా, అదేవిధంగా జనశక్తి పార్టీని తిరిగి ఉమ్మడి కర్నూలు జిల్లాలో స్థాపితం చేయడానికి ప్రయత్నాలు ప్రారంభించారని ఎస్పీ వెల్లడించారు. ఇందుకు నల్లగంటి ప్రసన్నరాజు ఆర్థిక సహాయం చేయగా, హేమకాంత్ రెడ్డితో కలిసి బిహార్ నుండి తీసుకువచ్చిన పిస్టల్స్, బుల్లెట్ లను తీసుకు వెళ్తున్నారని పేర్కొన్నారు. పక్క సమాచారంతో బైపాస్ వద్ద పోలీసులు తనిఖీలు చేయగా నాలుగు పిస్టల్స్, ఎనిమిది మ్యాగజైన్లు, 18 లైవ్ రౌండ్ లు ఒక కార్ ను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. దర్యాప్తులో భాగంగా గురువారం రాత్రి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న సుత్రధారులు ఏపీలోని నంద్యాల జిల్లా సున్నిపెంట గ్రామానికి చెందిన వోట్టి వెంకటరెడ్డి, మైల దిలీప్ ,నంద్యాల కు చెందిన అవులపాటి హిమకాంత్ రెడ్డి ,నల్గొండ జిల్లా నకిరేకల్ కు చెందిన నల్లగంటి ప్రసన్నరాజు లను సైతం అరెస్టు చేసామన్నారు. అదేవిధంగా మిగిలిన నిందితులను అరెస్టు చేయడానికి ఆంధ్రప్రదేశ్, బీహార్, తెలంగాణ రాష్ట్రాలకు పంపడానికి ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ నిందితులను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన ఆదిలాబాద్ జిల్లా పోలీసు అధికారులను, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి సురేందర్ రావు, డి.ఎస్.పి ఎల్ జీవన్ రెడ్డి, సిఐలు కే ఫణిదర్, కరుణాకర్, డి సాయినాథ్, ఎస్సైలు ముజాహిద్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బీసీల రిజర్వేషన్లు పెంచాల్సిందే - కవిత



**హైదరాబాద్, మహా:** కుల సర్వే, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ పెంపుపై అధ్యయనం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కులగణన డెడికేటెడ్ కమిషన్ కు నివేదిక అందించాలని తెలంగాణ జాగృతి సంస్థ నిర్ణయించింది. తెలంగాణ జాగృతి నాయకులతో కలిసి త్వరలో కులగణన డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వర రావుకు జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కవిత ఓ నివేదికను అందజేయనున్నారు. ఈ మేరకు శుక్రవారం తన నివాసంలో తెలంగాణ జాగృతి నాయకులు, ముఖ్య కార్యకర్తలతో ఆమె సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. అయితే, రాష్ట్రంలో కులగణన, స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల పెంపుపై కొన్ని నెలల క్రితం జాగృతి అధ్వర్యంలో అన్ని జిల్లాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలను నిర్వహించిన సంగతి విధితమే. ఆ సమావేశాల్లో తెలంగాణ జాగృతి నాయకులు, బీసీ సంఘాల నేతలు, మేధావులు, జర్నలిస్టులు, ఇతర ప్రముఖులు పాల్గొని తమ తమ అభిప్రాయాలను తెలియజేశారు. వాటిని క్రోడీకరించి తెలంగాణ జాగృతి ఓ నివేదికను రూపొందించింది. జిల్లాల వారీగా పూర్తి వివరాలు, బీసీల లెక్కలతో తెలంగాణ జాగృతి సమగ్ర నివేదికను రూపొందించింది. తెలంగాణ సామాజిక స్వరూపాన్ని ఆవిష్కరించే విధంగా పకడ్బందీగా ఆ నివేదికను తయారు చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో అప్పటి కేంద్ర ప్రభుత్వం నియమించిన శ్రీకృష్ణ కమిటీకి కూడా ఇదే తరహాలో నివేదిక సమర్పించడం గమనార్హం. ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ... బడుగు బలహీన వర్గాలకు విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో సరైన ప్రాధాన్యత దక్కడం లేదన్నారు. సమాజంలో అంతరాలను రూపుమాపడానికి, బలహీనవర్గాలను మరింతపైకి తీసుకురావడానికి ప్రభుత్వాలు కృషి చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా బీసీలకు రాజకీయ రంగంలో రిజర్వేషన్లు పెంచాల్సిందేనని తేల్చి చెప్పారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కుల సర్వేను నామమాత్రంగా కాకుండా పకడ్బందీగా చేసి రిజర్వేషన్లు పెంచి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కవిత డిమాండ్ చేశారు.

# ఆదివాసులను హత్య చేయటం అన్యాయం

**ములుగు జిల్లా ప్రతినిధి, మహా:** ఇన్ఫార్మర్ల నెపంతో ఆదివాసీలను హత్య చేయడం అన్యాయమని ఆదివాసీ సంఘాల నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆదివాసి, ఉద్యోగ, తుడుందెబ్బ సంఘాల ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రపంచం విజ్ఞానంతో పరుగెడుతుంటే ప్రతిసారి ఇన్ ఫార్మర్ల నెపంతో మావోయిస్టులు రాష్ట్రంలో అధికంగా ఆదివాసులనే చంపారని, ఇది బావ్యం కాదన్నారు. ఇలా హత్యలు చేయడం వల్ల ఆదివాసులు అభివృద్ధికి ఆమడ దూరంలో నెట్టబడుతారని అన్నారు. ఆదివాసులు ఎవరైనా ఏమైనా తప్పు చేస్తే ప్రజా కోర్టులో తప్పు నిరూపించి మందలించాలన్నారు. ఆదివాసీల హత్యలను ఆదివాసీ సంఘాలు ఖండిస్తున్నాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఆదివాసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ములుగు జిల్లా అధ్యక్షులు మంకిడి రవి, రాష్ట్ర కార్యదర్శి అన్నవరం రవికాంత్, తుడుం దెబ్బ ములుగు డివిజన్ అధ్యక్షుడు, పీసా కమిటీ జిల్లా కార్యదర్శి వజ్జ రాజు, తుడుం దెబ్బ ములుగు మండలం అధ్యక్షులు ఈక కుమార్, ఆదివాసీ విద్యార్థులు వెంకన్న, వినోదు, సూర్యనారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### ఈ నెల 26న రైతు సంఘం

# నిరసన కార్యక్రమం

### సుందరయ్య భవనంలో కార్యక్రమ పోస్టర్లు ఆవిష్కరణ

**మహా ప్రతినిధి ఆదిలాబాద్ :** కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 26న నిరసన చేపడుతున్నట్లు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బండి దత్తాత్రి తెలిపారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో నిరసనకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలను ప్రస్తావిస్తూ నినాదాలు చేశారు .ఈ సందర్భంగా బండి దత్తాత్రి మాట్లాడుతూ...కార్మికుల సంక్షేమంపై కేంద్రం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని అన్నారు. రైతులందరికీ ఒకేసారి పంట రుణాలను మాఫీ చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు లంక రాఘవులు, అన్నమొల్ల కిరణ్ పాల్గొన్నారు.

# చెరుకు రైతుల బలోపేతమే లక్ష్యం

### షుగర్ ఫ్యాక్టరీ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కోటయ్య



**నేలకొండపల్లి, నవంబర్ 22, మహా:** చెరుకు రైతులను బలోపేతం చేయడమే తమ లక్ష్యమని, అందుకోసం రైతులకు కల్తీ లేని ఆరోగ్యవంతమైన విత్తన శుద్ధి చేసిన మొక్కలను సరఫరా చేస్తున్నట్లు ఫ్యాక్టరీ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కోటయ్య ప్రకటించారు. శుక్రవారం మండలంలోని రాజేశ్వరపురం మధుకాన్ షుగర్ అండ్ పవర్ ఇండ్రస్టీస్ ఈ సీజన్ లో రైతులకు చెరుకు టన్ను ధర ను రూ.3400 ప్రకటించారు. ఈ విషయాన్ని ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ నామ కృష్ణయ్య ఆదేశాల మేరకు కోటయ్య తెలిపారు. ఫ్యాక్టరీ పరిధిలోని అనంతనగర్, రాజేశ్వరపురం, జక్కేపల్లి, కృష్ణాపురం గ్రామాలలో చెరుకు సాగులో అధిక దిగుబడులపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పంచదార ధరలు లేకపోయినప్పటికీ, ఫ్యాక్టరీ నష్టాలలో ఉన్నప్పటికీ రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని యాజమాన్యం ధర ప్రకటించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే రూ.116 అదనంగా ఇస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా గత ఏడాది కంటే ఈ ఏడాది రూ. 210 అదనంగా చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. కొత్తగా చెరుకు నాటే రైతులకు ఎకరానికి మూడు టన్నుల విత్తనం ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. ప్రతీ టన్నుకు పావు కేజీ పంచదార ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. రైతులకు కల్తీ లేని ఆరోగ్యవంతమైన విత్తన శుద్ధి చేసిన మొక్కలను సరఫరా చేస్తున్నట్లు ప్రకటించారు. ఇతర రాష్ట్రాల నుంచి కొత్త రకం చెరుకు విత్తనం తేచ్చేయంత్రాలను సరఫరా చేయనున్నట్లు తెలిపారు. చెరుకు సాగులో రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు ప్రతీ మూడు నెలలకొకసారి క్షేత్ర స్థాయిలో సూచనలు, సలహాలు అందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. నూతన వ్యవసాయ విధానాలను తెలియజేసేందుకు శాస్త్రవేత్తల ద్వారా అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో డీజీయం అప్పారావు, అసిస్టెంట్ కేన్ కమీషనర్ రవీందర్రావు, ఫ్యాక్టరీ హెచ్.ఆర్. నరేష్, శాస్త్రవేత్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# 24న మధిరలో ప్రజాపాలన విజయోత్సవాలు

**ఖమ్మం, నవంబర్ 22, మహా:** మధిర ప్రాంతంలో నవంబర్ 24న ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ శుక్రవారం తెలిపారు. ప్రజాప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం పూర్తవుతున్న నేపథ్యంలో ప్రజా పాలన ప్రజా విజయోత్సవ కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తుందని, ఇందులో భాగంగా నవంబర్ 24న రాష్ట్రం నుంచి జయ జయహే ప్రజా పాలన అనే కళా బృందం అలేఖ్య సారథ్యంలో మధిర ప్రాంతానికి విచ్చేసి వివిధ కళా రూపాలలో ప్రభుత్వ కార్యక్రమాలు, గత సంవత్సర కాలంలో సాధించిన విజయాలను తెలుపుతూ కళా ప్రదర్శనలు చేయడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నవంబర్ 24న మధిర మండలం దెందుకూరు గ్రామంలోని శ్రీరస్తు ఫంక్షన్ హాల్ నందు సాయంత్రం 6.00 గంటల నుండి ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు, ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు హాజరవుతారని, ప్రజలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

## ప్రభాస్ ఎవరో ఇప్పటికి

# నాకు తెలియదు

### ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల





**మహా, తెలంగాణ:** ప్రభాస్ ఎవరో తనకు ఇప్పటికీ తెలియదని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల స్పష్టం చేశారు. ఏపీ మాజీ సీఎం జగన్‌కు పారిశ్రామిక వేత్త గౌతమ్ అదానీ రూ.1,750 కోట్ల లంచం ఇచ్చినట్లు అమెరికా ఏజెన్సీల దర్యాప్తులో వెల్లడైన నేపథ్యంలో శుక్రవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

జగన్ తన స్వప్రయోజనాల కోసం చెల్లి, తల్లి పేర్లను వాడుకుంటున్నారని మండిపడ్డారు. 'బాలకృష్ణగారి నివాసంలో ఉన్న ఐపీ అడ్రస్ నుంచి నాపై తప్పుడు ప్రచారం జరిగిందని జగన్‌మోహన్‌రెడ్డి కేసు పెట్టినట్లు ఇటీవల ఎంటర్‌టైనింగ్‌గా చెప్పారు. మీకు నిజంగానే చెల్లెలిపై ప్రేమ ఉంటే, బాలకృష్ణగారి నివాసంలోని సిస్టమ్ ఐపీ అడ్రస్ నుంచి తప్పుడు ప్రచారం జరిగిందని నమ్మితే, ఐదేళ్లు సీఎంగా ఉండి మీరేం గాడిదలు కాశారు? బాలకృష్ణ మీద ఎందుకు విచారణ చేపట్టలేదు? మీరిప్పుడు చెల్లెలిపై ప్రేమ ఉన్నట్లు మాట్లాడుతున్నారు. ప్రభాస్‌కూ నాకూ సంబంధం ఉందని నాపై జరిగిన అసత్య ప్రచారంపై నేను కేసు పెట్టిన వెంటనే ఎందుకు స్పందించలేదని అన్నారు.



# ఆర్ఓబీ పనులు పరిశీలన

**ఖమ్మం సిటీ, నవంబర్ 22, మహా:** ఖమ్మంలో జరుగుతున్న ఆర్ఓబీ పనులను మున్సిపల్ కమిషనర్ అగస్త్య శుక్రవారం పరిశీలించారు. ఆర్ఓబీ పనుల విషయంలో ఎంతవరకు జరిగాయో అక్కడ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులు జరిగే క్రమంలో చుట్టుపక్కల ఎక్కడా కూడా నీరు నిలవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆర్ఓబీ సమీపంలో పేరుకుపోతున్న చెత్తను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని అన్నారు. ఆర్ఓబీ సమీపంలో ప్రజల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన లైటింగ్ సదుపాయాలను కూడా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.



# శానిటేషన్ ప్లానింగ్ పై సమీక్షా సమావేశం

**ఖమ్మం సిటీ, నవంబర్ 22 , మహా:** ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అగస్త్య, ట్రైనీ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ట ఆధ్వర్యంలో శానిటేషన్ ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులతో సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శానిటేషన్ ప్లానింగ్ సిద్ధం చేయడం, చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. డిసెంబర్ 10 లోపు ప్రతి శానిటరీ ఇన్స్పెక్టర్ తమ ప్రాంతానికి శానిటేషన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రణాళికలో శుభ్రం చేయవలసిన కాలువలు, రోడ్లు, వాటి పొడవు, అవసరమైన కార్మికుల వివరాలు ఉండాలని చెప్పారు. టౌన్ ప్లానింగ్ అధికారులకు కాలువ ఆక్రమణలను డివిజన్ వారీగా గుర్తించి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సూచించారు. ప్రతిఒక్క శానిటరీ ఇన్స్పెక్టర్ తమ సిబ్బంది వద్ద శానిటేషన్ ప్లాన్ ఉండేలా చూడాలని, ఖచ్చితమైన అవగాహనతో పనులు నిర్వహించాలని సూచించారు.

### పూరాతన నాన్కింగ్ చైనీస్

# రెస్టారెంట్ భవనం కూల్చివేయాలి




**మహా, హైదరాబాద్ :** సికింద్రాబాద్ ఎస్పీ రోడ్డు, పార్క్ లేన్ లోని నాన్కింగ్ చైనీస్ రెస్టారెంట్ శిథిలావస్థలో ఉందని సీనియర్ సివిల్ ఇంజనీర్ల అధికారుల బృందం రిపోర్ట్ ఇచ్చారు. ఏ చిన్నపాటి భూకంపం సంభవించినా, భారీ వర్షాలు కురిసినా ఈ భవనం కూలిపోయే ప్రమాదం ఉంటుందని ఈ రిపోర్ట్ స్పష్టంగా తెలిపారు. భవనం ఏ క్షణమైనా కూలిపోవచ్చు అన్న భయంతో పలు చోట్ల, భవనం మూలల్లో ఇనుప స్తంభాలను ఏర్పాటు చేశారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న రెస్టారెంట్ యజమానిపై కఠినమైన చర్యలు తీసుకోవాలి. తక్షణమే జిహెచ్ఎంసి సంబంధిత అధికారులు స్పందించి ఈ భవనాన్ని కుల్చావేయాలి. లేని పక్షంలో ఈ రెస్టారెంట్ కి వచ్చే కస్టమర్స్, అలాగే పనిచేసే వారి ప్రాణాలికే పెను ప్రమాదం పొంచి ఉంది.

## పెండింగ్ బిల్లులను

# వెంటనే విడుదల చేయాలి




### తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్

**వరంగల్, నవంబర్ 22, మహా:** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ డైట్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వ్యవస్థాపక అధ్యక్షులు కూరెల్ల మహేష్, రాష్ట వర్కింగ్ ప్రెసిడెంట్ దామల్ల సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండ పట్టణంలో తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నయీమ్ నగర్, బాలసముద్రంతోపాటు పట్టణ నలుమూలల విద్యార్థులు భారీ సంఖ్యలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వసతి గృహాలకు పెంచిన మెస్ ఛార్జీలను వెంటనే అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం కళ్లు తెరిచి విద్యార్థులకు పెండింగ్లో ఉన్న సంక్షేమ వసతి గృహాల డైట్ బిల్లులను, రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న స్కాలర్ షిప్స్, రియంబర్స్ మెంట్ ను విడుదల చేసి విద్యార్థుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గోవింద్ రాజు, రాష్ట్ర నాయకులు ఈర్ల ప్రసాద్, యాదాద్రి భువనగిరి ప్రెసిడెంట్ సుధాకర్, గ్రేటర్ హైదరాబాద్ ప్రెసిడెంట్ మేడి నాగరాజు, గ్రేటర్ హైదరాబాద్ వర్కింగ్ ప్రెసిడెంట్ యన్నమల్ల ప్రవీణ్ కుమార్, జాయింట్ సెక్రెటరీ నిర్మల సతీష్ మహాజన్, జనరల్ సెక్రెటరీ కురెళ్ళ ఉదయ్, ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ తాటిపాముల తరుణ్, ఆదర్శ్ ,విజయ్ కుమార్, హనుమకొండ జిల్లా మహిళా ఇన్చార్జ్ శ్రీ లక్ష్మీ ప్రసన్న ,స్వాతి, పద్మావతి, సరళ, స్వరూప, దివ్య, రమ , పద్మ, భాగ్య, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ బోరులు మంజూరు చేయాలి



### అన్నవరపు కనకయ్య

**చర్ల, నవంబర్ 22, మహా:** సీతమ్మ సాగర్ ప్రాజెక్టు వల్ల నిర్వాసితులు అవుతున్న పేదల కోసం మరో పోరాటానికి ప్రజలను సమాయత్తం అవుతామని, నిర్వాసితులకు న్యాయం జరిగేంత వరకు సీపీఎం పోరాడుతుందని జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య తెలిపారు. చర్ల మండల తొమ్మిదవ మహాసభ శ్రీనివాస కళ్యాణ మండపంలో అమరజీవి సీతారాం ఏచూరి నగర్ కుంజా చిన్నక్క ప్రాంగణంలో నిర్వహించారు. మహాసభను ప్రారంభిస్తూ అన్నవరపు కనకయ్య మాట్లాడారు. ఎటువంటి నష్టపరిహారం ఇవ్వకుండా వేలాది మంది పేద కుటుంబాలను సీతమ్మసాగర్ లో ముంచటం అన్యాయమన్నారు. వారు కోల్పోతున్న లంక భూములకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. తాలుపేరు ప్రాజెక్టు అదనపు గేట్ల నిర్మాణం మూలన పడిపోయిందని, దానికోసం నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలని, ప్రాజెక్టును ఆధునికరించాలని డిమాండ్ చేశారు. చర్ల మండలానికి సాగునీటి వనరులు కల్పించే వద్దిపేట చెక్ డాం నిర్మాణానికి నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. చర్ల మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గోదావరిముంపు గ్రామాల ప్రజలకు మేరక ప్రాంతంలో ఇంటి స్థలాలు ఇచ్చి ప్రభుత్వం పక్కా ఇల్లు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక గ్రామ సభల ద్వారానే నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహాసభకు పార్టీ మండల కమిటీ సభ్యులు కారం నరేష్ పి సమ్మక్క, అధ్యక్ష వర్గంగా వ్యవహరించగా పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె బ్రహ్మాచారి పార్టీ జిల్లా కమిటీ సభ్యులు గడ్డం స్వామి మండల కార్యదర్శి మచ్చా రామారావు, మండల కమిటీ సభ్యులు తాటి నాగమణి రాధాకుమారి, దొడ్డి హరినాధ వర్మ, పామర్ బాలాజీ, బందెల చంటి పార్టీ నాయకులు నవీన్ వరలక్ష్మి, షారోని, నాగేశ్వరరావు, కాంతయ్య రాంబాబు, శ్యామల చంద్రం, నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

# మిరప పంట రక్షణ చర్యలపై అవగాహన



**కొనిజర్ల, నవంబర్ 22, మహా:** కొణిజర్ల మండలం చిన్న గోపతి గ్రామంలో మిరప పంటల్లో "కొమ్మ కుళ్ళుడు" వ్యాధి వ్యాప్తి చెందినట్లు గుర్తించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 'వాతావరణ మార్పులు, మబ్బులున్న వాతావరణం, చిరు జల్లుల కారణంగా ఈ వ్యాధి వేగంగా వ్యాప్తి చెందుతోంది. రైతులు పొలంలో నడవడం, పనిమనిషులు లేదా యంత్రాల ద్వారా వ్యాధి ఒక చెట్టు నుంచి మరొక చెట్టుకు వ్యాపిస్తుంటుంది. చల్లటి గాలులతో కొమ్మలు విరిగి పడి మరింత వ్యాప్తి చెందుతుంది. కొమ్మ కుళ్ళుడును అదుపులో ఉంచడానికి రైతులు కొమ్మ కుళ్ళు వచ్చిన భాగాలను తొలగించి వాటిని చేనుకు దూరంగా తగలబెట్టాలి. నత్రజని లేదా యూరియా ఎరువులను అధికంగా వాడకూడదు. సిలింద్ర నాశన మందులను సాయంత్రం సమయాల్లో మాత్రమే పిచికారి చేయాలి. తాయోఫినెట్ మీథైల్ 450 గ్రా లేదా 200 మి.లీ, కాపర్ ఆక్సీక్లోరైడ్ 500 గ్రా, పైరాక్షిస్ట్రోబిన్ 600 గ్రా లేదా ఆక్సక్సీ స్ట్రోబిన్ 200 మి.లీ పిచికారి చేయడం ద్వారా వ్యాధిని నియంత్రించవచ్చు' అని పేర్కొన్నారు. ఈ పరిశీలనలో ఏఎఓ బాలాజీ, ఏఈఓ శ్రీనివాసరాజు, రైతులు పోట్లపల్లి శ్రీనివాసరావు, చిన్న జిడయ్య, అనిల్, బండారు నరేష్, ఏ. రామకృష్ణ పాల్గొన్నారు.

# దట్టమైన పొగమంచులో ఢిల్లీ

### కనిష్ట ఉష్ణోగ్రతలు 11.3 డిగ్రీలు నమోదు.. ఢిల్లీ కూల్చివేతలపై ప్రభుత్వం నిషేధం

### నగరంలోకి అనుమతించని వాహనాలు

**మహా, ఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో కనిష్ట ఉష్ణోగ్రతలు 11.3 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. దీంతో రాజధాని ప్రాంతాన్ని దట్టమైన పొగమంచు కమ్మేసింది. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 373తో చాలా పేలవమైన కేటగిరీలో నమోదైంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి డేటా ప్రకారం.. నగరంలోని మొత్తం 38 మానిటరింగ్ స్టేషన్లలో తొమ్మిదింటిలో ఏక్యూఐ లెవల్స్ తీవ్రమైన కేటగిరీలో నమోదయ్యాయి. ఆనంద్ విహార్, బవానా, జహంగీర్‌పురి, ముండ్కా, నెహ్రూ నగర్, షాదీపూర్, సోనియా విహార్, వివేక్ విహార్, వజీర్‌పూర్‌లో గాలి నాణ్యత సూచీ చాలా అధ్వానంగా ఉంది. ఈ స్టేషన్లలో ఏక్యూఐ లెవల్స్ 400 కంటే ఎక్కువే నమోదైంది. తీవ్ర వాయుకాలుష్యంతో ప్రజలు ఆరోగ్య సమస్యలను నివేదిస్తున్నారు. ఉదయం 8:30 గంటలకు నగరంలో తేమ స్థాయిలు 97 శాతంగా ఉన్నాయి. రోజంతా మోస్తరు పొగమంచు కొనసాగుతుందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. గరిష్ట ఉష్ణోగ్రతలు 27 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది.

